ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
విశాఖపట్నం
మంగళవారం 22 ఆగస్టు 2017 | 16



కుండపోత



పాడేరు ఘాట్ రోడ్డులో లైట్లు వేసుకొని వస్తున్న ఆర్టీసీ బస్సు 16



ఓఎస్డీగా సిద్ధార్థ కౌశిల్

పార్వతీపురం ఏఎస్పీగా పనిచేస్తూ బదిలీపై రాక

బాబూజీ తర్వాత ఇన్‌చార్జి ఓఎస్డీగా పనిచేస్తున్న కౌశిల్ 7

ప్రధానమంత్రి ఆవాస యోజనపై నిరుపేదల పెదవి విరుపు

- లబ్ధిదారులను నిరుత్సాహ పరుస్తున్న నిబంధనలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.3 లక్షల సబ్సిడీ
- మిగిలిన సొమ్ము బ్యాంకు రుణం
- 20 ఏళ్లపాటు నెలకు రూ3-4 వేలు రుణ వాయిదాలు
- అసలు కన్నా వడ్డీనే అధికం
- అరకొర ఆదాయంతో వాయిదాలు ఎలా చెల్లిస్తామని ఆవేదన
- సబ్సిడీ పెంచి, వడ్డీపై రిబేటు ఇవ్వాలని వినతి

పేదల ఇళ్లకు రుణ భారం



365 చదరపు అడుగుల నమూనా ఇల్లు



430 చదరపు అడుగుల నమూనా ఇల్లు

ప్రతి పేదవానికీ సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిబంధనలను చూసి నిరుపేదలు పెదవి విరుస్తున్నారు. తమపై ప్రభుత్వం ప్రేమ చూపిస్తున్నప్పటికీ, పథకంలో ఉన్న నిబంధనలు నిరుత్సాహపరుస్తున్నాయని అంటున్నారు. కూలి పనులు చేసుకుంటూ, వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకునే తాము, నెలకు రూ.నాలుగు వేల వరకు రుణ వాయిదాలను ఎలా చెల్లించగలమని వారు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు.

అనకాపల్లి: జీవీఎంసీ పరిధిలోని అనకాపల్లిలో నిరుపేదలకు పక్కా గృహాలు నిర్మించాన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజనను ప్రవేశపెట్టింది. ఈ పథకంలో మూడు విభాగాలుగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించింది. మొదటి కేటగిరీలో 300 చదరపు అడుగుల్లో ఒక బెడ్‌రూమ్, ...మిగతా 6వ పేజీలో...

- నగరంలోని ప్రధాన కూడళ్లలో శబ్ద కాలుష్యం ప్రమాదకరస్థాయిలో
- హనుమంతువాక, గాజువాక జంక్షన్లు
- అదేదారిలో ఎన్ఏడీ, మద్దిలపాలెం
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- నరాలు పొడై చెవుడు వచ్చే అవకాశం వుందంటున్న వైద్యులు
- ప్రజారవాణా వ్యవస్థతోనే చెక్
- సొంత వాహనాల వినియోగం తగ్గాలంటున్న నిపుణులు 7



ఎన్ఏడీ జంక్షన్

చెవులకు చిల్లులు!

శబ్ద కాలుష్యం స్థాయి

వాహనం	వచ్చే శబ్దం (డెసిబుల్స్)
ద్విచక్రవాహనం	75- 80
మూడు చక్రాల వాహనాలు	77-80
కారు	75
భారీ వాహనం (12 టన్నుల వరకు)	80
భారీ వాహనం (12 టన్నులు దాటి)	83

'ఇంటింటికీ టీడీపీ'తో సత్తా చాటుతాం



సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేష్‌బాబు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు 6

మాజీ ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు



బాకీ అడిగితే చంపేస్తానని బెదిరించారని పారిశ్రామికవేత్త ఆరోపణ

వార్త 7వ పేజీలో

శారదకు తూట్లు



కొత్తపల్లి వద్ద శారదానదిలో ఇసుక తవ్వుతున్న దృశ్యం

- కశింకోట మండలంలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- పట్టపగలు వాహనాల్లో తరలిపోతున్నా పట్టించుకోని అధికారులు
- ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం

కశింకోట రూరల్, ఆగస్టు 21: మండలంలోని శారదా నది, మామిడివాకగెడ్డ, అడ్డాం గెడ్డ, పరవాడవానిపాలె గెడ్డల్లో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. పట్టపగలు ఇక్కడి నుంచి ఇసుక తవ్వి.... లారీలు, ట్రాక్టర్లలో తరలించుకుపోయి సొమ్ము చేసుకుంటున్నారు. కొత్తపల్లి వద్ద నది గర్భంలో పది నుంచి 20 అడుగుల మేర గోతులు తవ్వుతున్నారు. ఇసుకాసురులకు శారదా నది, పలు గెడ్డలు బంగారు గుడ్డు పెట్టే బాతులుగా మారాయి. ఇసుక అక్రమ తవ్వకాలపై ఎన్నిసార్లు పత్రికలల్లో కథనాలు వచ్చినా, తవ్వకాలు, రవాణా మాత్రం ఆగడంలేదు. ఇసుక తవ్వకం, రవాణాదారులపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా అధికారులు చేస్తున్న హెచ్చరికలు తాటాకు చప్పుళ్ల మాదిరిగా వున్నాయని ...మిగతా 6వ పేజీలో...

గాయత్రీదేవికి ఆటా అవార్డు



నక్కపల్లి: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతీ ఏటా అవార్డు టీచర్స్ అసోసియేషన్ (ఆటా) జాతీయ పురస్కారానికి నక్కపల్లికి చెందిన వేదపండితురాలు వేదాల గాయత్రీదేవి ఎంపికయ్యారు. ఇప్పటికే ఎన్నో సత్కారాలు, అవార్డులను అందుకున్న ఆమె ఆటా జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆటా అధ్యక్షుడు బి. శ్రీనివాసరావు నుంచి సోమవారం తమకు సమాచారం వచ్చిందని గాయత్రీదేవి చెప్పారు. ప్రస్తుతం ఈమె నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు పండితురాలిగా పనిచేస్తున్నారు. సాహిత, సాంస్కృతిక రంగాలు, తెలుగు భాష ప్రాచుర్యానికి, ఆమె చేస్తున్న సేవలను గుర్తించిన ఆటా సంస్థ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ అవార్డును అక్టోబర్ 8న భద్రాచలంలో తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో అవార్డును ప్రదానం చేస్తారని తెలిపారు. ప్రతీ ఏటా తానా (యుఎస్ఏ) భాగస్వామ్యంతో ఆటా సంస్థ ఈ అవార్డులను అందజేస్తుంటుంది. ఈసందర్భంగా మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, ఉపమాక శ్రీనివాసా సేవా సమితి సభ్యులు, స్థానిక నాయకులు గాయత్రీదేవిని అభినందించారు.

అర్హులందరికీ పథకాలు

మంత్రి అయ్యన్నపాత్రుడు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: నియోజకవర్గంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషిచేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను రాష్ట్ర ఆర్అండ్‌బీ మంత్రి సీహెచ్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం, దీపం పథకం, పింఛన్లు, రైతులకు అందించే పరికరాలు, తదితర సంక్షేమ పథకాలకు అర్హులైన అభ్యర్థులను గుర్తించి, వారికి అందజేయాలన్నారు. ఇప్పటికే దాదాపుగా 90శాతం మందికి వివిధ పథకాలను మంజూరుచేసి అందజేశామని, ఇంకా అవసరమైన వారు ఎక్కడైనా ఉన్నట్టయితే వారిని గుర్తించాలన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్గించడం ద్వారా దరఖాస్తు చేసుకునేలా ప్రయత్నించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతిధులు సమన్వయంతో లబ్ధిదారులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. జనవరి నెలలో జరిగే జన్మభూమిలో పింఛన్లు అందజేయనున్నారని, దానికి వితంతువులు, వృద్ధులు, వికలాంగులను గుర్తించాలన్నారు.

నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పథకాలను వేగంగా పూర్తిచేయాలన్నారు. ఇంకా అవసరమైన వాటిని గుర్తించి అధికారులు దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో ఎంపీ లాడ్స్, ముఖ్యమంత్రి మంజూరుచేసిన పథకాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైతే మరిన్ని నిధులు మంజూరుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్డీవో సూర్యారావు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ సన్యాసిపాత్రుడు, కమిషనర్ జె.సురేంద్ర, మాకవరపాలెం తహసీల్దార్ కె.రమామణి, హౌసింగ్ డీఈ ఎస్.వి.ఎస్.శ్రీనివాస్, నర్సీపట్నం, మాకవరపాలెం, నాతవరం, గొలుగొండ ఎంపీపీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

చిన్న ఉద్యోగులకు వరం.. ఈఎస్ఐ స్మార్ట్ కార్డులు



కుటుంబ సభ్యులందరి ఆరోగ్యానికి భరోసా ● దేశంలో ఎక్కడైనా చికిత్సలు పొందే అవకాశం

భీమునిపట్నం-రూరల్, ఆగస్టు 21:
కర్మాగారాల్లో పనిచేసే కార్మికులకు కార్మిక రాజ్య బీమా సదుపాయం ఉంది. దీనివల్ల చిన్న స్థాయి ఉద్యోగులు, కార్మికులు కార్మికశాఖ ఆధీనంలో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రుల ద్వారా ఉచిత వైద్య సదుపాయాలు పొందవచ్చు. ప్రతి వారం అవసరమైన మందులను ఉచితంగా తీసుకునే అవకాశం కూడా ఉంది. ఈ సదుపాయాన్ని ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలు, ప్రైవేట్ యాజమాన్య నిర్వహణలో ఉన్న సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా వర్తింపజేస్తున్నారు. ఆయా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు స్మార్ట్ కార్డులను జారీ చేసే కార్యక్రమాన్ని కార్మికశాఖ చేపట్టింది. ఉద్యోగులకు, కార్మికులకు ప్రభుత్వపరంగా పలు సదుపాయాలు కల్పిస్తున్నారు.

ఉద్యోగపర్వం

ఇప్పటి వరకు రోజువారి కూలీ పనులు చేస్తున్న కార్మికులకు మాత్రమే వర్తింపజేస్తున్న వివిధ సదుపాయాలను ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కటింగ్ చేస్తున్న చిన్నస్థాయి ఉద్యోగులకు కూడా కల్పిస్తున్నారు. ఇందువల్ల వేలాది మంది చిన్న ఉద్యోగులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ ప్రయోజనాలు పొందడానికి గాను స్మార్ట్ కార్డుల పేరుతో ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేస్తున్నారు. ఈ కార్డులు కలిగినవారు జిల్లాలో వివిధ ప్రాంతాలలో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రులలో ఎక్కడైనా వైద్య సదుపాయాలను పొందవచ్చు.

సాధారణ కార్మికులకు, ఉద్యోగులకు వైద్య సదుపాయాలు కల్పించరు. కేవలం ఈ కార్డులు ఉన్నవారు మాత్రమే ఈ వైద్యసేవలు పొందడానికి అర్హులు. అందువల్ల అన్నిస్థాయి ఉద్యోగులకు, కార్మికులకు ఈ కార్డులను జారీ చేయడానికి అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

ఈ కార్డులెంతో ఉపయోగకరం



ఉద్యోగులు, కార్మికులకు అందించే స్మార్ట్ కార్డుల వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయి. కార్మికులు దేశంలో ఎక్క డకు వెళ్లినా చికిత్సలు అవసరమైతే ఆయా ప్రాంతాలలో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రులలో ఈ కార్డుల ఆధారంగా చికిత్స పొందవచ్చు. ఇప్పటివరకు కార్మికులకు మాత్రమే పరిమితమైన ఈ విధానం కార్మాగారాలు, కంపెనీలలో పని చేసే చిన్నస్థాయి ఉద్యోగులకు కూడా వర్తింపజేయడం వల్ల చాలామంది లబ్ధి పొందుతున్నారు. కార్మికులు నేరుగా ఈ కార్డులు తీసుకునే విధానాన్ని మార్పు చేసి యాజమాన్యాలే తమవద్ద పనిచేసే ఉద్యోగులకు ఈ కార్డులను అందించే విధానాన్ని అమలు చేయాలి.

-అల్లు బాబూరావు,
కార్మిక సంఘ నాయకుడు, తగరపువలస



స్మార్ట్ కార్డుల వల్ల ఉపయోగాలు

- ఉద్యోగులు, కార్మికులకు జారీ చేసిన స్మార్ట్ కార్డులు వారు ఉద్యోగంలో ఉన్నంతవరకు పనిచేస్తాయి.
- ఉద్యోగి పేరుతో జారీ అయిన స్మార్ట్ కార్డులను అతనితో పాటు అతని కుటుంబ సభ్యులందరూ వినియోగించుకునే అవకాశం ఉంది.
- ఉద్యోగులు ఏ ప్రాంతంలో పనిచేస్తున్నా ఈ కార్డుల ఆధారంగా దేశంలో ఎక్కడి ఈఎస్ఐ ఆస్పత్రిలోనైనా చికిత్సలు పొందవచ్చు.
- ఒకసారి ఈ కార్డు తీసుకున్న తర్వాత రెన్యూవల్ చేయించనవసరం లేదు. ఉద్యోగి/కార్మికుడు తాను బతికి ఉన్నంతవరకు వినియోగించుకునే అవకాశం ఉంది.
- ఒక కంపెనీ నుంచి మరో కంపెనీకి మారినప్పుడు మళ్లీ కొత్తకార్డును తీసుకోవాల్సిన అవసరం లేదు. ఒకసారి తీసు కున్న కార్డును ఎన్ని కంపెనీలు మారినా వినియోగించుకోవచ్చు.
- కార్డు తీసుకున్న తర్వాత ఉద్యోగి తమ కుటుంబ సభ్యుల పేర్లు, ఇతర వివరాలను సులభంగా మార్చుకోవడానికి అవకాశం ఉంది. పెళ్లి కాక ముందు కార్డు తీసుకుంటే పెళ్లయిన తర్వాత భార్య పేరును కొత్తగా చేర్చుకోవచ్చు.
- ఉద్యోగి ఈ కార్డు తీసుకున్న తర్వాత ఇతర ఇన్సూరెన్సలను తీసుకున్నా వాటి ద్వారా వచ్చే అదనపు పరిహారాలను పొందేందుకు ఎటువంటి అభ్యంతరాలుండవు.
- ఇంతవరకు కంపెనీలలో శాశ్వత ఉద్యోగులుగా ఉన్నవారికి మాత్రమే ఈ కార్డులను వినియోగించుకునే అవకాశం ఉండేది. అయితే ఇప్పుడు టెంపరరీ ఉద్యోగులు కూడా ఈ కార్డు ద్వారా ప్రయోజనం పొందే అవకాశం కల్పించారు.

స్మార్ట్ కార్డులు జారీ గురించి..

- ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) సంస్థ ద్వారా ఉద్యోగులు, కార్మికులు మాత్రమే స్మార్ట్ కార్డులు పొందడానికి అర్హులు .
- వివిధ కర్మాగారాలు, చిన్న పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు తమ కంపెనీల ద్వారా ఈఎస్ఐలో సభ్యులుగా పేర్లు నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి.
- విశాఖ నగరంలోని మల్కాపురంలో ఉన్న ప్రాంతీయ కార్యాలయంలో బయోమెట్రిక్ పద్ధతిలో ఫొటోలు తీయించుకోవాలి. వీటి ఆధారంగా ఉద్యోగికి స్మార్ట్ కార్డులను జారీ చేస్తారు.
- వివిధ పరిశ్రమలు, కంపెనీల్లో నెలసరి వేతనం రూ.21,000 కంటే తక్కువ పొందుతున్న కార్మికులు, ఉద్యోగులకు మాత్రమే ఈ అవకాశాన్ని కల్పిస్తున్నారు. గతంలో రూ.15,000 లిమిట్ వుండగా, ఈ ఏడాది జనవరి నుంచి ఈ మొత్తాన్ని రూ.21,000కు పెంచడంతో మరింత మంది లబ్ధి పొందే అవకాశం కలిగింది.
- ఉద్యోగి తన స్థూల వేతనంపై 1.75 శాతం చందాగా చెల్లిస్తే యాజమాన్యం 4.75 శాతం కలిపి ప్రభుత్వానికి జమ చేస్తుంది. ఇలా చెల్లించిన వారికే స్మార్ట్ కార్డులను పొందడానికి అవకాశం ఉంది.
- ఉద్యోగులు 40 శాతం పైబడిన వికలాంగులైతే యాజమాన్యం చెలించవలసిన చందాను కేంద్ర ప్రభుత్వమే భరించి స్మార్ట్ కార్డులు జారీ చేస్తుంది.

స్మార్ట్ కార్డులను ఎలా పొందాలంటే..

ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొంది కంపెనీ యాక్టు ప్రకారం వ్యాపారం చేస్తున్న సంస్థలు, ఇతర చిన్న కర్మాగారాలలో పనిచేస్తున్న వారు ఈ కార్డులను పొందే అవకాశం ఉంది. రోజువారి కార్మికులే కాకుండా గుమస్తాలు, ఎల్‌డీసీలు వంటి కిందిస్థాయి ఉద్యోగులు కూడా ఈ కార్డులను పొందవచ్చు. అయితే ఈ ఉద్యో గులకు సంబంధించిన యాజమాన్యం చెల్లించవలసిన ప్రీమియం సొమ్మును ఆయా కంపెనీలు కార్మికశాఖకు ప్రతి ఏడాది తప్పనిసరిగా చెల్లిస్తుండాలి. కార్డు పొందవలసిన వ్యక్తి తాను ఎక్కడ పనిచేస్తున్నదీ వివరాలతో కూడిన ప్లే స్లిప్పును జత చేయాలి తన చిరునామా ధ్రువీకరణకు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని అందించాలి. యాజమాన్యం నుంచి తాను ఈఎస్ఐ పరిధిలో ఉన్నట్టు ధ్రువీకరణ తీసుకోవాలి. వీటితోపాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను జత చేయాలి.

వీటి ఆధారంగా జిల్లా కేంద్రంలో ఉన్న ఈఎస్ఐ ప్రధాన కార్యాలయానికి ఆదివారం మినహా మిగతా రోజులలో వెళ్లి దరఖాస్తులను అందిస్తే ఉద్యోగుల వేలిముద్రలు, కంటి ఐరిష్‌ను తీసుకుంటారు. వారి సిఫారసు మేరకు రాష్ట్ర కార్మికశాఖ అధికారుల సంతకంతో కార్డులను జారీ చేస్తారు. ఈ విధంగా జారీ చేసే కార్డుకు ఒక నంబర్‌ను కూడా కేటాయిస్తారు. ఇలా జారీ చేసే కార్డుకు ఎటువంటి సొమ్ము చెల్లించనవసరం లేదు. కానీ కార్డు లామినేషన్ కోసం పది రూపాయలు చెల్లించాలి. స్మార్ట్ కార్డుతో పాటు గుర్తింపు కార్డు మాదిరిగా ఉండే మరో కార్డులను కూడా కార్మికశాఖ అధికారులు అందిస్తున్నారు. వీటిని కూడా కార్మికులు తీసుకోవలసి ఉంటుంది.

యాజమాన్యాలకు ఆదేశాలివ్వాలి



విశాఖలోని చాలా కర్మాగారాలలో పని చేస్తున్న ఉద్యోగుల కోసం ప్రభుత్వానికి చెల్లించవలసిన ప్రీమియం మొత్తాలను యాజమాన్యాలు సక్రమంగా చెల్లించడం లేదు. అందువల్ల స్మార్ట్ కార్డులు తీసుకోవడానికి చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కార్మిక శాఖ ఈ కార్డులను జారీ చేస్తున్నందున ప్రీమియం విషయంలో యాజమాన్యాలకు కూడా సత్వర ఉత్తర్వులను అమలు జరిపేలా ఆదేశాలను జారీ చేయాలి కార్మిక, ఉద్యోగ సంఘాలు ఈ కార్డులను తమ సభ్యులకు అందించడానికి చొరవ తీసుకోవాలి. వీటి వినియోగం, ప్రయోజనం గురించి ప్రచారం చేయాలి.

-నాగోతి అప్పలరాజు,
ఏఐటీయూసీ కార్యదర్శి, చిట్టివలస

నంద్యాల ఎన్నికల విధులకు ఎస్పీ

విశాఖపట్నం: నంద్యాల ఉప ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ వెళ్లారు. ఆయన వచ్చేవరకు ఓఎస్‌డీ సిద్దార్థ కౌషిల్‌కు అదనపు ఎస్పీగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

జడ్పీ సర్వసభ్య సమావేశం రేపు

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు జడ్పీ సీఈవో జయప్రకాశ్‌నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు హాజరు కావాలని కోరారు. ఇప్పటికే ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపామని సీఈవో తెలిపారు.

డయేరియాతో గిరిజన విద్యార్థి మృతి



మృతి చెందిన విద్యార్థి పరశురాం

పెదబయలు: అడుగుల పుట్టు పంచాయతీ లకేయిపుట్టు గ్రామానికి చెందిన పాంగి కామేశ్వరరావు కుమారుడు పాంగి రవి(8) డయేరియాతో ఆదివారం మృతి చెందాడు. గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో రవి మూడో తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల నుంచి తీవ్రమైన జ్వరం, వాంతులు, విరేచనాలతో బాధ పడుతున్నాడు. ఆదివారం రాత్రి అస్వస్థతకు గురయ్యాడు. పరిస్థితి విషమించడంతో తెల్లవారుజామున మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న గిరిజన సంఘం మండల కార్యదర్శి కె.శరభన్న, మండల కమిటీ నాయకులు చెడ్డ పరశురాం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం పరిహారం చెల్లించాలని వారు కోరారు.

అనధికారిక సెలవులో ఎంపీడీవో

- 19 రోజులుగా విధులకు దూరం
- అట్రాసిటీ కేసులో విచారణ చేయాల్సి ఉందని జడ్పీ సీఈవోకు పోలీసుల లేఖ
- జడ్పీకి రిపోర్టు చేయాలని సీఈవో ఉత్తర్వులు
- చింతపల్లి ఈవోపీఆర్డీకి ఇన్‌చార్జి బాధ్యతలు



ఎంపీడీవో నివాస గృహం తలుపులకు సీఈవో ఉత్తర్వులు అంటిస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి: మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్.సత్యనారాయణ విధులకు గైర్హాజరవుతున్నారు. దాదాపు 19 రోజులుగా ఎగనామం పెడుతున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి సెలవు మంజూరు కాకుండానే ఆయన కార్యాలయానికి రావడం లేదు. దీంతో చింతపల్లి ఈవోపీఆర్డీ వి.రవిరత్నకుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అంతేకాకుండా ఎంపీడీవో వెంటనే జడ్పీకి రిపోర్టు చేయాలని లేదా పోలీసులకు లొంగిపోవాలని జిల్లా పరిషత్ సీఈవో జయప్రకాష్‌నారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కాపీని కార్యాలయం సిబ్బంది సోమవారం అతని నివాస గృహం తలుపులకు అంటించారు. సీఈవో జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి.

జీకే వీధి పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎంపీడీవో సత్యనారాయణపై అట్రాసిటీ, లైంగిక వేధింపులు కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ నిమిత్తం హాజరుకావాలని ఇన్‌స్పెక్టర్ కోరారు. ఈ నెల 3వ తేదీ నుంచి ఎంపీడీవో విధులకు హాజరుకాలేదు. దీంతో జిల్లా పరిషత్ సీఈవోకు పోలీసు అధికారులు లేఖ పంపించారు. దీంతో జడ్పీ అధికారులు ఎంపీడీవోకు మెమో జారీ చేశారు. అయినప్పటికీ ఎంపీడీవో స్పందించలేదు. కాగా అనుమతి తీసుకోకుండా సెలవు కోరడాన్ని జిల్లా పరిషత్ అధికారులు తిరస్కరించారు. దీంతో మండల పరిషత్ కార్యాలయంలో క్రమంగా జరగాల్సిన ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు నిలిచిపోవడంతో చింతపల్లి ఎంపీడీవో కె.భాగ్యారావుకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. రెండు మండలాల్లో విధులు నిర్వహించడం కష్టమని సంబంధిత ఎంపీడీవో జిల్లా పరిషత్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో మండల పరిషత్ పరిధిలో అన్ని రకాల ప్రభుత్వ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగించేందుకు వీలుగా చింతపల్లి ఈవోపీఆర్ రవి రత్నకుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఎంపీడీవో సత్యనారాయణ వెంటనే జడ్పీకి రిపోర్టు చేయాలని లేదా పోలీసులకు లొంగిపోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల ప్రతులను సోమవారం ఎంపీడీవో నివాల గృహం తలుపులకు సిబ్బంది అంటించడం విశేషం.

సెలవు పేరుతో విధులకు ఎగనామం

- అయినా రిజిస్టర్‌లో సంతకాలు
- గంటికొర్లాం ఉపాధ్యాయుడి నిర్వాకం
- స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పరిశీలనలో బయటపడ్డ వ్యవహారం





ఉపాధ్యాయుడు లేక ఖాళీగా ఉన్న విద్యార్థులు.. రిజిస్టర్ పరిశీలిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి

బుచ్చెయ్యపేట: గంటికొర్లాం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఐదు రోజులుగా విధులకు ఎగనామం పెడుతున్నారు. రిజిస్టర్‌లో మాత్రం ఎంచెక్కా సంతకాలు చేస్తున్నారు. ఒక రోజు మాత్రమే సీఎల్ అని ఉండగా, అప్పుడు కూడా విధుల్లో ఉన్నట్టు సంతకం ఉండడంపై స్థానికులు విస్తుబోయారు. ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సోమవారం రికార్డులు పరిశీలించినప్పుడు ఈ వ్యవహారం బయటపడింది.

గంటికొర్లాం పాఠశాల ఉపాధ్యాయుడు బుధవారం నుంచి విధులకు హాజరుకావడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పిల్లలు చదువుకు దూరమవుతున్నారని వాపోయారు. స్థానికుల ఆందోళనలతో పాఠశాలకు చేరుకున్న సీఆర్పీ శ్రీను సోమవారం పాఠశాలకు వచ్చారు. ఈ సమయంలో ధరిత్రి రూరల్ డెవెలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి నానాజీ పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ నెల 16, 18, 19 తేదీలతో పాటు 17వ తేదిన రిజిస్టర్‌లో సీఎల్‌లో ప్రసాద్ సంతకం ఉండడాన్ని నానాజీ గుర్తించారు. కాగా, ఉపాధ్యాయులు అధికారికంగా సెలవు తీసుకున్న రోజు పొట్టిదొరపాలెం పాఠశాలకు చెందిన అప్పారావు అనే ఉపాధ్యాయుడు ఇచ్చి విధులు నిర్వహించారు. ఆ రోజున ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు అప్పారావు సంతకంతో పాటు ప్రసాద్ సంతకం కూడా రిజిస్టర్‌లో ఉండడం చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విధులకు రాకపోయినా రిజిస్టర్‌లో సంతకం ఎలా వచ్చిందని సీఆర్పీ శ్రీనును స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నిలదీశారు. ఉపాధ్యాయుడు తరుచూ గైర్హాజరు కావడంతో పిల్లల చదువులు దెబ్బతింటున్నాయని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. దీనిపై ఎంఈవో సత్యనారాయణను వివరణ కోరగా, ఈ నెల 17న ఉపాధ్యాయుడు సీఎల్ అడిగారని తెలిపారు. మిగతా రోజుల్లో డుమ్మా కొట్టడంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

మొండిపాలెం కిడ్నీ బాధితుల ధర్నా

అనకాపల్లి టౌన్: సుందరయ్యపేట పంచాయతీ మొండిపాలెం గ్రామం కిడ్నీ వ్యాధి బాధితులు సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కె.సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ, కిడ్నీ వ్యాధి బారిన పడిన వారందరికీ వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. గత ఆరేళ్లలో ఈ వ్యాధితో 18 మంది చనిపోయారన్నారు. కొణతాల సుబ్రహ్మణ్యం అప్పలనర్సమ్మ ట్రస్టు, ఉత్తరాంధ్ర చర్చా వేదికలు నిర్వహించిన రక్త పరీక్షల శిబిరంలో 210 మంది వరకు ఆరోగ్య తనిఖీలు చేయగా, 30 మంది వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నట్టు తేలిందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తుల విషయం బయటపడడంతో ప్రభుత్వం స్పందించి మెరుగైన వైద్యం అందిస్తుందన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

బస్‌పాస్‌లు మంజూరు చేస్తామని, నెలకు రూ.2500 పింఛన్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటన చేసిందన్నారు. మొండిపాలెం బాధితులకు కూడా ఈ సదుపాయాలను వర్తింపజేయాలని కోరారు. అనంతరం ఆర్డీవో ఎంవీ సూర్యకళ వినతిపత్రం అందజేశారు.

ఆర్మీ ర్యాలీకి ఉచిత శిక్షణ

కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో అక్టోబరు 6వ తేదీ నుంచి నిర్వహించనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శిక్షణ పొందాలనుకొనే అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ ఉదయం 9 గంటలకు హాజరుకావాలని చెప్పారు. అనకాపల్లి మున్సిపల్ స్టేడియం, నర్సీపట్నం డివిజన్‌కు చెందిన అన్ని మండలాల అభ్యర్థులు సెప్టెంబరు 1న నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విశాఖపట్నం డివిజన్‌లోని అభ్యర్థులు, పాడేరు డివిజన్‌లోని అన్ని మండలాల అభ్యర్థులు సెప్టెంబరు 6న విశాఖ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరిగే ఎంపికల్లో పాల్గొనాలని సూచించారు.



సామ పంటను కోతలు కోస్తున్న రైతులు



పంటను నూరుస్తున్న రైతులు

సామకు పెరుగుతున్న గిరాకీ

కిలో రూ. 20 నుంచి రూ.25వరకు ధర ● కోతలు, నూర్పుళ్లలో గిరిరైతులు నిమగ్నం

అరకురూరల్: విశాఖ మన్యంలో ప్రస్తుతం సామ పంట పండటంతో గిరిరైతులు ఈ పంట కోతలను కోస్తూ, నూర్పులు నూర్చే పనుల్లో నిమగ్నమయ్యారు. గిరి రైతులు తొలకరి వానలకు వేసే మొదటి పంటసామ పంట. ఈ కొత్త పంటతోనే ఇంట్లో కొత్త వంటకం చేస్తారు. ఒకప్పుడు గిరిజనులకు ఈ సీజన్ అంతా వరిపంట, చోడి పండేంత వరకు ఇళ్లలో సామలతో వండే సామఅన్నం తింటూ గడిపేవారు. ఈ లోపు చోడి, వరి పంట చేతికి అందగానే ఆ పంటతో వంట గింజలు ఇంట్లో చేరతాయి. ప్రస్తుతం డీఆర్ డిపోల ద్వారా రూ.1 కిలో బియ్యం రావడం, ఉపాధి పనులు అందుబాటులోకి రావడంతో ఆర్థికంగా కాస్త వెసులుబాటు లభించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అధిక శాతం మంది పండించిన పంటను వ్యాపారులకు విక్రయిస్తున్నారు. గతంలో ఈ పంటను కొనుగోలు చేసే పరిస్థితే ఉండేది కాదు. నేడు సామ పంటకు మంచి గిరాకీ ఉంది. కిలో సామలకు రూ.20 నుంచి రూ.25 ధరతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా ఈ పంటకు ఢిల్లీ, నాసిక్, గుజరాత్, మహారాష్ట్ర, పూణె వంటి ప్రాంతాలకు



సామలు

స్థానిక వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. ఈ పంటలో ఎటువంటి క్రిమిసంహారక మందులు, ఎరువులు వినియోగించకుండా గిరిజనం పండించడంతో ఆయా ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది పంట కూడా బాగా పండిందని పలువురు రైతులు ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారు.

మార్పిడి పద్ధతిని పాటిస్తున్నాం



మేము పండించే మొదటి పంట సామలు. ప్రస్తుతం పంట చేతికి వచ్చింది. మార్కెట్‌లో కిలోకు రూ.20 నుంచి రూ.25 వరకు ధర ఉంది. గత ఏడాది పంటకైతే కిలోకు రూ.25 ధరతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది పంట అయితే కిలోకు రూ.20 ధరతో కొనుగోలు చేస్తున్నారు. కొంత విత్తనాలకు, మరి కొంత ఇంట్లో వాడకానికి ఉంచి మిగతా పంటను విక్రయిస్తాం. చాలా మంది రైతులు బియ్యం ఇస్తే సామలు ఇచ్చేస్తున్నారు. కిలో బియ్యానికి కిలో సామలు అనే పద్ధతిన వస్తు మార్పిడి పద్ధతిని అనుసరిస్తున్నాం.

- తామల చిన్నయ్య, రైతు, ముసిరిగుడ

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు కమిటీ

అనంతగిరిరూరల్, ఆగస్టు 21: మండలంలోని ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించేందుకు గానూ ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ అంశమై సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీ చైర్మన్‌గా మండల ప్రత్యేకాధికారి మోహన్‌రావు, కో-చైర్మన్‌లుగా ఎంపీపీ గుజ్జలి పైడితల్లి, జడ్పీటీసీ కొట్యాడ అప్పారావు, కన్వీనర్‌గా ఎంపీడీవో రమేష్‌రామన్, కో-కన్వీనర్‌లుగా తహసీల్దార్ జయప్రకాశ్, ఎస్‌ఐ డోలవెంకన్న, సభ్యులుగా పంచాయతీ కార్యదర్శులు ఈ కమిటీలో ఉంటారని ఎంపీపీ పైడితల్లి తెలిపారు. అన్ని పంచాయతీలలో ప్రభుత్వ భూములు ఎవరైనా ఆక్రమిస్తే ఈ కమిటీ దృష్టికి తీసుకొని వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

● కించుమండలో నిర్వహణ

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ వారపుసంతలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహిస్తారు. రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం కంటి ఆస్పత్రి వారు ఉచితంగా ఈ మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు.. ఏరియా కో ఆర్డినేటర్ మజ్జి పార్వతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. దీర్ఘకాలిక కంటి వ్యాధులతో బాధ పడుతున్న వారికి ఉచిత వైద్యం అందిస్తారన్నారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్ చేసేందుకు విశాఖపట్నం తీసుకు వెళతామని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాన్ని గిరిజనులు సద్వినియోగించుకోవాలన్నారు.

పాఠశాల భవనం పూర్తి చేయాలి

● ఎంపీడీవోకు జాంకరవలస గ్రామస్థుల వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

డుంబ్రిగుడ: మండలంలోని గుంట గన్నెల పంచాయతీ జాంకరవలస గ్రామంలోని పాఠశాల భవనాన్ని తక్షణమే పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు మొద్దు ఆధ్వర్యంలో ఎంపీడీవో మీనాకుమారికి వినతిపత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని పాఠశాల భవనం అసంపూర్తిగా వదిలేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ పరిస్థితిలో సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కోరారు.

అధికారులపై ఫిర్యాదు చేస్తాం

జడ్పీ ఉపాధ్యక్షుడు కొట్యాడ అప్పారావు

అనంతగిరిరూరల్: మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమానికి గైర్హాజరవుతున్న అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తానని జడ్పీ ఉపాధ్యక్షుడు కొట్యాడ అప్పారావు అన్నారు. విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ వారం సమస్యలను విన్నవించేందుకు మండలంలో మారుమూల ప్రాంతాలనుంచి గిరిజనులు వస్తున్నారన్నారు. అయితే గ్రీవెన్స్‌లో అధికారులు లేకపోవడంతో ఎవరో ఒకరికి దరఖాస్తులు ఇచ్చి వెళ్లిపోవాల్సి వస్తోందని వాపోయారు. అదే అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటే సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్, అటవీశాఖ, ఎలక్ట్రికల్ , ఎన్‌ఆర్ ఈజీఎస్ సిబ్బంది గైర్హాజరవుతున్నారని ఈ విషయాన్ని జిల్లా సర్వసభ్య సమావేశంలో ప్రస్తావిస్తానని తెలిపారు. వాస్తవానికి అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉన్నట్టయితే ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు వీలుంటుందని ప్రభుత్వం గ్రీవెన్స్ నిర్వహిస్తోందన్నారు.

అర్హులైన వారికి ట్రైకార్ రుణాలు:ఎంపీడీవో



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో, తదితరులు

అరకులోయ, ఆగస్టు 21: ట్రైకార్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారిని రుణాలు మంజూరు చేస్తామని ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ట్రైకార్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు ఏపీజీవీబీ, ఎస్‌బీఐ, కెనరా బ్యాంకు మేనేజర్లు పాల్గొని దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరి దరఖాస్తులను పరిశీలించి అర్హులైన అభ్యర్థులందరికీ రుణాలు మంజూరుకు కృషి చేస్తామన్నారు.

పెదబయలులో 23న ఇంటర్వ్యూలు

పెదబయలు: మండల కేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో ఈ నెల 23వ తేదీన ట్రైకార్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు. 2017-18 సంవత్సరానికి సంబంధించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు వారి ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. ఆధార్‌కార్డు, ఆన్‌లైన్ దరఖాస్తులతో పాటు మూడు పాస్‌ఫొటోలతో హాజరు కావాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

జి.మాడుగుల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండగలమని గెమ్మెలి పీహెచ్‌సీ వైద్యాధికారి నాయుడు చెప్పారు. మండలంలోని పాలమామిడి పంచాయతీ దేవరాపల్లి గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 175 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, పరిసరాలు పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవని చెప్పారు. రోగాలు ప్రబలితే ఆస్పత్రులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పట్నం గాంధీ ఆస్పత్రి నుంచి వైద్యులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



గర్భిణులను ఆశీర్వదిస్తున్న ఐసీడీఎస్ పీవో రత్నకుమార్ తదితరులు

డుంబ్రిగుడ, ఆగస్టు 21: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సోమవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐసీడీఎస్ పీవో రత్నకుమార్ మాట్లాడుతూ.. మాట్లాడుతూ, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పని సరిగా అందుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాల్లోని గర్భిణీలు ప్రసవాల సమయాల్లో ఆస్పత్రిలకు రావడం లేదని, దీంతో కొన్ని మార్లు తల్లిబిడ్డలు ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి నెలకొందన్నారు. ఏది ఏమైనా గిరిజనులు మూఢనమ్మకాలను విడనాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సరస్వతి, పైడితల్లి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి 'బకాయి' రూ.మూడు కోట్లు

తక్షణమే చెల్లించాలని కూలీల యూనియన్ డిమాండ్ ● అరకులో భారీ ర్యాలీ

అరకులోయ, ఆగస్టు 21: ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేపట్టిన కూలీలకు తక్షణమే బకాయిలు చెల్లించాలని.. ఉపాధి హామీ పథకం కూలీల యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌బీ పోతురాజు డిమాండ్ చేశారు. ఇదే అంశమై సుమారు 300 కూలీలతో గిరిజన భవన్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా తాము చేపట్టిన పనులకు సుమారు రూ.3 కోట్లు మేర కూలీ సొమ్ము బకాయి ఉందని పేర్కొన్నారు. తక్షణం బకాయి సొమ్మును చెల్లించాలన్నారు.

15 రోజుల్లో చెల్లిస్తాం

ఇందుకు స్పందించిన ఎంపీడీవో విజయ్‌కుమార్, ఏపీడీ భ్రమరాంబ మాట్లాడుతూ.. 15 రోజుల్లో బకాయి కూలీ సొమ్ము చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో సంఘాల ప్రతినిధులు, కూలీలు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.బాలదేవ్, మండల కార్యదర్శి రామారావు, ఉపాధి కూలీల సంఘం ప్రతినిధులు చినబాబు, రాజు, రామన్న పాల్గొన్నారు.

'కూలీలు అప్పుల పాలవుతున్నారు'

అనంతగిరిరూరల్ : బకాయి పడ్డ ఉపాధి కూలీ సొమ్మును వెంటనే విడుదల చేయాలంటూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రధాన కూడలిలో ఆందోళన చేపట్టి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మొస్య మాట్లాడుతూ.. మండలంలో 24 పంచాయతీలలో లక్షలాది రూపాయల ఉపాధి కూలీ బకాయిలు విడుదల కావడం లేదన్నారు. దీనివల్ల కూలీలు అప్పుల పాలవుతున్నారన్నారు. అనంతరం.. ఉపాధి బకాయిలు చెల్లించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ మురళీధర్‌కు వినతి పత్రం సమర్పించారు. నిరసనలో సంఘం నాయకులు నాగులు, గంగరాజు పాల్గొన్నారు.



అరకు ఎంపీడీవో కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

'అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు'

డుంబ్రిగుడ: మండలంలోని ఉపాధి కూలీలకు తక్షణమే బిల్లులు చెల్లించాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.సూర్యనారాయణ మాట్లాడుతూ.. పనులు పూర్తి చేసిన గిరిజనులకు అధికారులు బిల్లులు చెల్లించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు.

తక్షణమే గిరిజనులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంపీడీవోకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సురేష్, సత్యనారాయణ, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ద్వారా 1250 నీటి కుంటలు

ఎల్‌బీ దొరబాబు, ఏపీవో, అరకులోయ

ఇంటర్వ్యూ



ప్రశ్న: ఈ ఏడాది ఉపాధి హామీ నిధులతో కాఫీ, సిల్వర్ ఓక్ పనులు ఎంత విస్తీర్ణంలో చేపడుతున్నారు.

జవాబు: ఈ ఏడాది ఉపాధి హామీ పథకం నిధులతో 1003 మంది లబ్ధిదారులతో 1016 ఎకరాల్లో కాఫీ మొక్కలు, 1579 మంది లబ్ధిదారులతో 1608 ఎకరాల్లో సిల్వర్ ఓక్ పనులు చేపుతున్నాం.

ప్రశ్న: ఈ ఏడాది నీటికుంటలు ఎన్ని చేపట్టారు?

జవాబు: ఈ ఏడాది ఉపాధి పథకం ద్వారా 1250 నీటి కుంటలు మంజూరు కాగా, రూ. 9కోట్ల 25 లక్షలు నిధులతో చేపడుతున్నాం. వీటిలో నేటికి 136 పూర్తయ్యాయి. 519 పనులు జరుగుతున్నాయి.

ప్రశ్న: మండలంలో వ్యక్తిగత మరుగుదొడ్లు మొత్తం ఎన్ని మంజూరయ్యాయి?

జవాబు: మండలంలో 6314 వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు కాగా, 3,890 మరుగుదొడ్లు పూర్తయ్యాయి. ఒక్కో మరుగుదొడ్డికి రూ.15 వేలు లబ్ధిదారులకు అందజేస్తున్నాం.

ప్రశ్న: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న పనులకు సంబంధించి కూలీలకు బకాయి ఉన్నాయా?

జవాబు: 14 పంచాయతీలకు గాను 7 పంచాయతీల కూలీలకు పోస్టాఫీసుల ద్వారా, మరో 7 పంచాయతీలకు బ్యాంకుల ద్వారా కూలీ సొమ్మును చెల్లిస్తున్నాం. అయితే ఇటీవల బ్యాంకుల ద్వారా చెల్లించే కూలీ సొమ్ములో సుమారు రూ.40 లక్షలు చెల్లింపులు లబ్ధిదారులకు చేరాల్సి ఉంది. లబ్ధిదారులు ఆధార్, బ్యాంకు ఖాతాలకు సీడింగ్ జరగకపోవడంతో లబ్ధిదారులకు అందడంలో జాప్యం జరిగింది. మరో 15 రోజుల్లో అన్నింటిని సరి చేసి లబ్ధిదారుల ఖాతాలకు కూలీ జమ చేస్తాం.

- అరకులోయ

అల్లం ధర పతనం

కిలో రూ.20కే విక్రయం



పెదబయలు: మండల కేంద్రంలోని సోమవారం వారపుసంతలో అల్లం ధర పతనమైంది. దీంతో అల్లం రైతులు నష్టపోయామని వాపోయారు. కష్టించి సాగు చేపట్టిన అల్లానికి ధర పలకకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. గత వారం కిలో అల్లం రూ.40 నుంచి రూ.50 ధర పలికింది. అయితే ఈ వారం మాత్రం కిలో అల్లం కేవలం రూ.20 ధరలో కొనుగోలు చేశారు. దీంతో తీవ్ర నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా జీసీసీ అధికారులు తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సదురుమామిడిలో జ్వరాలు

జి.మాడుగుల: బొయితిలి పంచాయతీ సదురుమామి గ్రామంలో పది మంది గిరిజనులు జ్వరాలతో బాధ పడుతున్నారు. కొంత కాలంగా కనీసం వైద్య సేవలు అందించడం లేదని, దీంతో గ్రామంలో జ్వరాల ప్రబలుతున్నాయని స్థానికులు తెలిపారు. ఏఎన్ఎం కూడా గ్రామాన్ని సందర్శించడం లేదని చెప్పారు. ప్రస్తుతం పది మంది చిన్నారులతో పాటు గర్భిణులు జ్వరాలతో బాధ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

డోమంగిలో మీజిల్స్- రుబెల్లా టీకాలు

డుంబ్రిగుడ: మండలంలోని డోమంగి సబ్‌సెంటర్ పరిధిలో సోమవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి శాంతికిరణ్ శెట్టి ఆధ్వర్యంలో 270 మంది చిన్నారులకు మీజిల్స్- రూబెల్లా టీకాలను వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి శాంతికిరణ్ శెట్టి మాట్లాడుతూ, ఈనెల 1వ తేదీ నుంచి ఎంఆర్ వ్యాక్సిన్‌లు మొదలు పెట్టి 5 సబ్‌సెంటర్‌ల పరిధిలో సుమారు 4,500 మంది గిరిజన చిన్నారులకు టీకాలు వేశామని అన్నారు. ఇప్పటి వరకు చిన్నారులకు ఎక్కడ టీకాలు వికటించలేదన్నారు. మిగిలిన మూడు సబ్ సెంటర్ల పరిధిలో త్వరలోనే టీకాలు పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది హెచ్.ఎస్ శాంతామణి, సాంబశివరావు, మంజుల, కె.రవీంద్ర, స్వామి, సునీల, అన్నపుర్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

'తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి'

పెదబయలు: ఎన్నో ఏళ్ల తరబడి తపాలా శాఖలో జీడీఎస్ ఉద్యోగులు పని చేస్తున్నా, సమస్యలను కేంద్ర ప్రభుత్వాలు పరిష్కారించడం పోవడం దారుణమని ఏఐజీడీఎస్‌యూ అరకు డివిజన్ జాయింట్ సెక్రటరీ జి.గాసన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉప తపాలా శాఖ కార్యాలయం వద్ద మండల ఎస్‌వో పరిధిలోని పని చేస్తున్న తపాలా ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఏడో వేతన కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, ఎనిమిది గంటలు పని దినం అమలు చేసి, అన్ని సౌకర్యాలు కల్పించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గాసన్న మాట్లాడుతూ.. 35 ఏళ్లపైగా జీడీఎస్ బీపీఎం, ఎంసీలుగా పని చేస్తున్నా శ్రమకు తగ్గ వేతనం రావడం లేదని వాపోయారు. తమ సమస్యలను పరిష్కరించకపోవడంతో ఉద్యోగుల కడుపుమండి సమ్మెకు దిగామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెదబయలు, ముంచంగిపుట్టు జీడీఎస్ తపాలా ఉద్యోగులు చక్రవర్తి, సురేష్, ప్రసాద్‌రావు, జయరావు, ప్రతాఫ్, రాజారమేష్, లోహితాస్, గంగారావు, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న తపాలా ఉద్యోగులు

కంపుకొడుతున్న రహదారులు

వ్యర్థాలను ఇష్టానుసారం పడవేస్తున్న వ్యాపారులు



అరకురూరల్, ఆగస్టు 21: అరకులోయలో రోడ్లన్నీ చెత్తమయంగా మారాయి. వ్యాపారులు చెత్తను రోడ్లపై పారవేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వెలువడుతోంది. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నాడు డివిజన్ పంచాయతీ అధికారి ఉషారాణి ప్రతీ షాపు ముందు చెత్త పారబోసేందుకు డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. దుకాణాల ముందు డస్ట్‌బిన్‌లు లేకపోయినా, చెత్త దర్శనమిచ్చినా రూ.2వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అయినా వ్యాపారులు పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. కనీసం పంచాయతీ ఈవో స్పందించి ప్రతీ షాపుముందు చెత్త బుట్టలు ఏర్పాటు చేసి రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రైతురథంలో 132 ట్రాక్టర్లు

పాడేరు రూరల్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతురథం పథకంలో మన్యానికి 132 ట్రాక్టర్లు మంజూరయ్యాయని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు పి.శంకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, గిరిజన రైతుల సంక్షేమానికి 50 శాతం రాయితీపై ట్రాక్టర్లు అందిస్తున్నట్టు చెప్పారు. పాడేరు నియోజకవర్గానికి 66, అరకు నియోజకవర్గానికి 66 ట్రాక్టర్లు మంజూరయ్యాయని ఆయన చెప్పారు.

వారానికో పంచాయతీలో బస

పథకాల, అభివృద్ధి పనుల అమలును పరిశీలించాలి

24 నుంచి అమలు చేయండి... జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశం



మీకోసం-ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ సృజన

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని, అధికారులు పల్లెకు వెళ్లి రాత్రిబస చేసి సంక్షేమ పథకాల అమలుతీరును తెలుసుకోవాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీకోసం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అధికారులనుద్దేశించి మాట్లాడారు. ప్రజలే ముందు- ప్రజా సంక్షేమమే ధ్యేయం నినాదంతో ప్రభుత్వం ముందుకెళుతున్నదని, ఈ వారం నుంచి ప్రతి అధికారి పల్లెల్లో ఒక్కరోజు రాత్రిబస చేసి సమస్యలు తెలుసుకోవాలని కోరారు. గురువారం నుంచే ప్రతి అధికారి వారంలో ఒక రోజు ఒక గ్రామ పంచాయతీలో రాత్రి బస చేసేలా షెడ్యూల్‌ను రూపొందించుకోవాలని సూచించారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో కాలినడకన తిరిగి, అభివృద్ధి పనులను సమీక్షించాలన్నారు. క్షేత్ర పర్యటనలతోనే ప్రజా సమస్యలపై అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. పంచాయతీ కార్యాలయం, పాఠశాలలు, వసతిగృహాలు, ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేసి ఉద్యోగుల పనితీరును సమీక్షించాలన్నారు.

మీకోసం-ప్రజావాణికి 315 దరఖాస్తులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మీకోసం-ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 315 మంది హాజరై పలు సమస్యలపై వినతులు అందజేశారు. కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ సృజన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గృహాలు, భూవివాదాలు, పింఛన్లు మంజూరు ఇతర సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు 13 ఫోన్‌కాల్స్

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డయల్‌యువర్ కలెక్టర్ కార్యక్రమానికి 13 ఫోన్‌కాల్స్ నుంచి 15 ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులకు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ సృజన, డిప్యూటీ కలెక్టర్లు సత్తిబాబు, గోవిందరాజులు సమాధానాలిచ్చారు. నర్సీపట్నం బలిఘట్టం గ్రామం నుంచి శివనారాయణరావు భూముల ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. బలిఘట్టంలో రవీంద్రభారతి పాఠశాలకు గుర్తింపు లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. విశాఖ నగరంలో 23వ వార్డు నుంచి ఈశ్వరరావు మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారని, పాదచారులకు ఇబ్బందిగా ఉందని చెప్పారు. దీనిపై జీవీఎంసీ అధికారులతో పరిశీలించి చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. నగర పరిధిలో 6 ఫోన్‌కాల్స్ రాగా, గ్రామీణ మండలం నుంచి 9 ఫిర్యాదులు అందాయి.

శారదకు తూట్లు



తాళ్లపాలెం మామిడివాకగెడ్డ నుంచి ట్రాక్టర ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

(మొదటిపేజీ తరువాయి)

స్థానికులు విమర్శిస్తున్నారు. మరోవైపు మండలస్థాయి అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా రెవెన్యూ, మైనింగ్, పోలీసు, ఇరిగేషన్ శాఖలు నిమ్మకునీరెత్తినట్టుగా వున్నాయి. ఇసుక నిల్వలు వున్న శారదా నది, గెడ్డలవైపు కన్నెత్తి అయినా చూడడంలేదు. దీంతో ఇసుకాసురలు రాత్రి, పగలు అన్న తేడా లేకుండా ఇసుకను తవ్వి, తరలించుకుపోతున్నారు. మండలంలో ఎక్కడా ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని చెబుతున్న ఆయా ఆ శాఖల అధికారులు, శారదా నది, దానికి అనుబంధంగా వున్న గెడ్డల్లో జరుగుతున్న ఇసుక తవ్వకాలు కనిపించకపోవడం శోచనీయం. కొందరు స్థానికులు సమాచారం ఇచ్చినప్పటికీ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేదని చెబుతున్నారు.

'ఇంటింటికీ టీడీపీ'తో సత్తా చాటుతాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల



నియోజకవర్గం నేతలతో సమావేశమైన పంచకర్ల రమేష్‌బాబు

మునగపాక, ఆగస్టు 21: తెలుగుదేశం హయాంలో అభివృద్ధి జరగలేదంటూ దుష్ప్రచారం చేస్తున్న విపక్షాలకు దిమ్మతిరిగేలా 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ద్వారా సమాధానం చెబుతామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మునగపాకలో సోమవారం నిర్వహించిన ఎలమంచిలి నియోజకవర్గస్థాయి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ ప్రభుత్వం గ్రామాలవారీగా చేసిన అభివృద్ధి వివరాలను కరపత్రాల రూపంలో ముద్రించి ఇంటింటికీ అందజేస్తామన్నారు. ప్రతి ఒక్క ఓటరును కలిసి తెలుగుదేశం ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తామన్నారు. 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం సందర్భంగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన తరువాత అధికారులు వెళ్లిపోతారని, అనంతరం ఆ గ్రామంలో పార్టీ విషయాల గురించి కార్యకర్తలతో చర్చిస్తామని పంచకర్ల చెప్పారు. సెప్టెంబర్ మూడో తేదీ నుంచి ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం జరుగుతుందని, ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గంతో ఏటికొప్పాక గ్రామంలో ప్రారంభిస్తామని చెప్పారు. ప్రతి మండలంలో నాలుగు రోజులు పర్యటించే విధంగా ఆయా మండలాల నాయకులు రూట్‌ప్లాన్‌ను తయారు చేసుకోవాలని సూచించారు. ఎలమంచిలి మార్కెట్ కమిటీ పాలకవర్గం 23వ తేదీన ప్రమాణస్వీకారం చేస్తుందని, మంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఆయన తెలిపారు.

పార్టీ అంతర్గత వ్యవహారాలను రచ్చకీడ్చను

పార్టీలో సమస్యలు ఏమైనా ఉంటే అధిష్ఠానం దృష్టికి తీసుకెళతానే తప్ప పత్రికలకు ఎక్కనని రమేష్‌బాబు అన్నారు. పార్టీ నాయకుడు సుందరపు విజయ్‌కుమార్‌కు మీరు సమాచారం ఇవ్వడం లేదని, కార్యక్రమాలకు పిలవడం లేదని ఆరోపణలు వస్తున్న విషయాన్ని ప్రస్తావించగా, తన పీఏ ద్వారా అందరికీ సమాచారాన్ని అందిస్తున్నానని, కొందరికి స్వయంగా తాను చెబుతున్నానని చెప్పారు. ఇలాంటి సమస్యలు ఏమైనా ఉంటే పార్టీ అధిష్ఠానం దృష్టిలో పెట్టాలే తప్ప పత్రికలకు ఎక్కడం తగదన్నారు. ఇటీవల కొంతమంది నాయకులు ఇతర పార్టీల్లో చేరడానికి ప్రయత్నాలు చేసుకుంటూ, టీడీపీకి నష్టం కలిగిస్తున్నారని, అటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పార్టీకి నష్టం కలిగించే చర్యలు చేపట్టనని, పార్టీకి నష్టం కలిగించి, సొంత ఇమేజ్ పెంచుకుందామని చూసే వారి పట్ల కేడర్ అప్రమత్తంగా వుండాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీలు ఆడారి మంజు, చేకూరి శ్రీనివాసరాజు, జడ్పీటీసీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు రాజాన రమేష్‌కుమార్, ధూళి రంగనాయకులు, డి.మునిలినాయుడు, కొయిలాడ వెంకట్, దొడ్డి శ్రీనివాసరావు, మారిశెట్టి వెంకటరమణ, మద్దాల నాగ అప్పారావు, సుందరపు తాతాజీ, కర్రి రామనాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల ఇళ్లకు రుణ భారం

(మొదటిపేజీ తరువాయి)

హాలు, కిచెన్, టాయిలెట్ వుంటాయి. దీనికి లబ్ధిదారులు 500 రూపాయలను డిపాజిట్ చెల్లించాలి. ఇంటి విలువ రూ.6,46,200. దీనిలో కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.5 లక్షలు... వెరశి మూడు లక్షల రూపాయలను సబ్సిడీగా ఇస్తాయి. మిగిలిన 3,45,700 రూపాయలను వడ్డీతో సహా 20 సంవత్సరాలపాటు వాయిదాల రూపంలో చెల్లించాలి. అధికారుల లెక్కల ప్రకారం నెలకు రూ.3,100 చెల్లించాల్సి వుంటుంది. మొత్తంగా చూస్తే ఇది రూ.7,44,000 అవుతుంది.

రెండో కేటగిరీలో 365 చదరపు అడుగుల్లో ఇల్లు నిర్మిస్తారు. ఒక బెడ్ రూమ్, హాలు, కిచెన్, బాత్‌రూమ్ వుంటాయి. దీనికి లబ్ధిదారులు తమ వాటాగా రూ.50 వేల చొప్పున చెల్లించాలి. దీనిని ఏడాది కాలంలో



300 చదరపు అడుగుల నమూనా ఇల్లు

నాలుగు దఫాలుగా చెల్లించే వెసులుబాటు వుంది. ఇంటి మొత్తం విలువ రూ.7,42,045. దీనిలో మూడు లక్షల రూపాయలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీగా చెల్లిస్తాయి. మిగిలిన 3,92,045 రూపాయలను లబ్ధిదారుడు 20 సంవత్సరాలపాటు నెలకు 3,500 రూపాయల చొప్పున చెల్లించాలి. ఈ లెక్కన ముత్తం 8 లక్షల 40 వేల రూపాయలు చెల్లించాల్సి వుంటుంది.

మూడో కేటగిరీలో 430 చదరపు గజాల్లో రెండు బెడ్ రూమ్‌లు, ఒక హాలు, కిచెన్, బాత్‌రూమ్ నిర్మించి ఇస్తారు. లబ్ధిదారుడు తన వాటా కింద లక్ష రూపాయలను నాలుగు దఫాల్లో చెల్లించాలి. మొత్తం ఇంటి విలువ రూ.8,36,780. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు లక్షల రూపాయలు సబ్సిడీగా ఇస్తాయి. మిగిలిన నాలుగు లక్షల 36 వేల 780 రూపాయలను 20 సంవత్సరాల్లో నెలకు 3,900 రూపాయల వంతున చెల్లించాలి. ఈ లెక్కన లబ్ధిదారుడు 9 లక్షల 36 వేల రూపాయలు చెల్లించాల్సి వుంటుంది. ఇక్కడ అసలు కంటే వడ్డీ ఎక్కువ వుండడం గమనార్హం.

అనకాపల్లి పట్టణంలో ఎక్కువ మంది దినసరి కార్మికులు, ఫుట్‌పాత్ వ్యాపారులు, షాపుల్లో పనిచేసే వారు అధికంగా ఉన్నారు. వీరి నెల ఆదాయం ఐదారు వేలకు మించదు. ఇటువంటి వారు నెలకు మూడు నుంచి నాలుగు వేల రూపాయలను ఇంటి రుణ వాయిదాల కింద చెల్లించడం సాధ్యమైనా? ప్రస్తుతం వీరు వెయ్యి నుంచి రూ.1500 అద్దె వుండే ఇళ్లల్లో నివాసం వుంటున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద సొంత ఇల్లు సమకూరుతున్నప్పటికీ నెలకు మూడురెట్లు సొమ్మును రుణ వాయిదా కింద చెల్లిస్తే, కుటుంబం ఎలా గడుస్తుందని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలించి, సబ్సిడీ సొమ్మును పెంచాలని, ఇంటి రుణంపై వడ్డీ శాతాన్ని తగ్గించాలని పలువురు కోరుతున్నారు.

మాలాంటి వారికి సాధ్యమేనా?



వై.శాంతమ్మ, ఉడ్‌పేట

పేదవారికి సొంత గూడు వుండాలన్న సంకల్పంతో ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజనను ప్రవేశపెట్టడం అభినందనీయం. అయితే ప్రతి నెలా 3,100 రూపాయలను రుణ వాయిదా కింద 20 ఏళ్లపాటు చెల్లించడం నాలాంటి వారికి సాధ్యమయ్యే పనికాదు. నాకు భర్త లేడు. చిన్నాచితకా పని చేసుకుంటూ పిల్లల్ని పోషించుకుంటున్నాను. నాలాంటి వారిని దృష్టిలో ఉంచుకొని సబ్సిడీ పెంచాలి. రుణంపై వడ్డీని తగ్గించాలి.

స్థలం ఇస్తే బాగుంటుంది



వీర్ల కుమారి, మళ్ల వీధి

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి మూడు లక్షల రూపాయలను రాయితీగా ఇస్తున్నాయి. దీనికిబదులు 60 గజాల ఇంటి స్థలం ఇచ్చి, ఆ సొమ్మును నేరుగా లబ్దిదారుడికి ఇచ్చేస్తే ఉన్నంతలోనే ఇల్లు కట్టుకుంటాడు. 20 సంవత్సరాలపాటు అప్పు చెల్లించాలంటే నాలాంటి వారికి సాధ్యం కాదు.

ఓఎస్డీగా సిద్ధార్థ కౌశిల్

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు ఆపరేషన్స్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓఎస్డీ)గా సిద్ధార్థ కౌశిల్ నియమితులయ్యారు. ప్రస్తుతం పార్వతీపురం ఏఎస్పీగా పనిచేస్తున్న ఆయనను విశాఖ జిల్లా ఓఎస్డీగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ఓఎస్డీగా పనిచేసిన అట్టాడ బాబూజీ నెలరోజుల క్రితం పదోన్నతిపై కడప జిల్లా ఎస్పీగా బదిలీ అయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి సిద్ధార్థ కౌశిల్ విశాఖ ఓఎస్డీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ముగిసిన జిల్లా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్

విశాఖపట్నం: జిల్లా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2017 ముగిసింది. కైలాసగిరి పోలీసు క్రీడా మైదానంలో మూడు రోజులుగా ఈ పోటీల్లో అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు, చింతపల్లి పోలీస్ సబ్‌డివిజన్ల పరిధిలోని సివిల్ పోలీసులు, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు. అనకాపల్లి జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్ గెల్చుకుంది. ఈ జట్టుకు కెప్టెన్‌గా ఎస్ఐ ఎస్.సూర్యప్రకాష్, కోచ్‌గా ఎస్.వి.రామకష్ణ వ్యవహరించారు. విశాలాక్షినగర్‌లోని ఏఆర్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. మినిస్టీరియల్ విభాగంలో ఎస్‌పీసీసీఎం వి.శ్రీనివాస్ వందమీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచారు. విజేతలకు ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ సతీమణి సాక్షి శర్మ, ఓఎస్డీ మేఘూకార్యాల్ బహుమతులు ప్రదానం చేశారు. అదనపు ఎస్పీ జి.శ్రీకాంత్, ఓఎస్డీ సిద్ధార్థ కౌశిల్, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ అనిల్‌ప్రసాద్, చింతపల్లి డీఎస్పీ అనిల్‌పులపాటి, అనకాపల్లి డీఎస్పీ కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

చెవులకు చిల్లులు!

నగరంలోని ప్రధాన కూడళ్లలో శబ్ద కాలుష్యం

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

నగరంలోని ప్రధాన కూడళ్లలో శబ్ద కాలుష్యం పరిమితికి మించిపోయింది. విశాఖలో వాయు కాలుష్యం ప్రమాదకరంగా వుందని ఇప్పటికే పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు శబ్ద కాలుష్యం కూడా ప్రమాదకర స్థాయికి చేరుకుందని నిపుణుల అధ్యయనాలు చెబుతున్నాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం పర్యావరణ విభాగానికి చెందిన విద్యార్థులు ఇటీవల నిర్వహించిన సర్వేలో ఈ విషయం తేలింది.

అధ్యయనం నిర్వహించిన కూడళ్లు ఇవి

నగరంలో వాహనాల రద్దీ ఎక్కువగా వుండే హనుమంతువాక, మద్దిలపాలెం, తాటిచెట్లపాలెం, ఎన్ఏడీ, శీలానగర్, గాజువాక జంక్షన్‌లను విద్యార్థులు ఇందుకు ఎంపిక చేసుకున్నారు. ప్రతిరోజు ఉదయం ఏడు నుంచి పది గంటల వరకూ, సాయంత్రం ఐదు నుంచి ఎనిమిది గంటల మధ్య ఈ జంక్షన్‌లలో వాహనాల రద్దీ ఎక్కువగా వుంటుంది. ఉదయం, సాయంత్రం మూడేసి గంటల వ్యవధిలో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎన్ఏడీ జంక్షన్ మీదుగా మూడు గంటల వ్యవధిలో పాతిక వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని విద్యార్థుల అధ్యయనంలో వెల్లడైంది. వీటిలో ద్విచక్ర వాహనాలు ఎక్కువ కాగా తరువాత ఆటోలు, కార్లు, బస్సులు వున్నాయి. వాటిలో సగం వరకు భారీట్రక్కులు వుంటున్నాయి. ఉదయం, సాయంత్రంపూట రద్దీ సమయాల్లో జంక్షన్‌లలో ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో వాటి హారన్లు, ఇంజన్ శబ్దాలు భరించలేనంతగా వుంటున్నాయి.

హనుమంతువాక, గాజువాకల్లో ప్రమాదకరం

హనుమంతువాక, గాజువాక జంక్షన్‌లలో శబ్ద కాలుష్యం 120 డెసిబిల్స్‌గా నమోదైంది. ఎన్ఏడీ జంక్షన్, మద్దిలపాలెం, తాటిచెట్లపాలెం జంక్షన్‌లలో 105 నుంచి 110 డెసిబిల్స్ నమోదైంది. సాయంత్రంతో పోల్చితే ఉదయం పూట శబ్ద కాలుష్యం ఎక్కువగా వుంటోంది. రద్దీ సమయాల్లో చెవులు చిల్లులు పడేలా హారన్లు మోగిస్తున్నట్టు విద్యార్థుల అధ్యయనంలో తేలింది.

శబ్ద కాలుష్యానికి కారణాలు

విశాఖ నగరం మీదుగా జాతీయ రహదారి వెళుతుంది. పారిశ్రామిక ప్రాంతం కావడంతో సరుకు రవాణా వాహనాల రాకపోకలు ఎక్కువగా వుంటాయి. నగర శివారుల్లో విద్యాసంస్థలు, పారిశ్రామికవాడలు వున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్మికులు నగరం నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లివస్తుంటారు. దీంతో ఉత్తరాన హనుమంతువాక జంక్షన్, దక్షిణాన గాజువాక జంక్షన్‌లపై అన్ని రకాలుగా ఒత్తిడి పెరుగుతుంది. మెట్రో నగరాలతో పోల్చితే విశాఖలో ప్రజా రవాణా అతి తక్కువగా వాడతారు. ప్రజారవాణా వ్యవస్థ విస్తృతంగా లేకపోవడంతో ప్రజలు సొంత వాహనాల వినియోగం ఎక్కువగా వుంది. స్కూటీ నుంచి ట్రక్ వరకు నగరంలో 12 లక్షల వాహనాలు వున్నాయి. ఇరవై లక్షల జనాభా వున్న నగరంలో ప్రతి ఇద్దరికీ ఒక వాహనం వుందన్నమాట. సగటున ప్రతి వాహనం రెండురోజులకొకసారి బయటకు తీసినా ట్రాఫిక్ ఇబ్బందులతోపాటు వాయు, శబ్ద కాలుష్యాలు పరిమితికి మించుతాయనేది నిపుణుల విశ్లేషణ. వారి విశ్లేషణకు అనుగుణంగా ఏయూ విద్యార్థుల అధ్యయనానిన ఒక హెచ్చరికగా తీసుకోవాలి. ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు ప్రాజెక్టు రిపోర్టు కోసం అధ్యయనం చేసిన నేపథ్యంలో విశాఖలో ఎక్కడెక్కడా ఎంతెంత శబ్ద కాలుష్యం వస్తోందనే అంశంపై విస్తృతమైన పరిశోధనలు చేయాల్సిన అవసరం వుందని నిపుణుల అభిప్రాయం.

ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు

ఆచార్య పీవీవీ ప్రసాదరావు,ఏయూ పర్యావరణ విభాగం

విశాఖలో శబ్ద కాలుష్యం పరిమితి దాటుతోంది. నివాస ప్రాంతాల్లో శబ్దాలు అదుపులో వున్నప్పటికీ రహదారులు, ప్రధాన కూడళ్లు, పారిశ్రామికవాడల్లో మితిమీరుతున్నాయి. అందుకు అనేక కారణాలున్నాయి. ప్రజారవాణా వ్యవస్థ లేకపోవడంతో ప్రతి ఒక్కరు సొంత వాహనం లేదా ఆటోను ఆశ్రయిస్తున్నారు. మెట్రో నగరాలతో పోల్చితే విశాఖలో ఎక్కువ మంది ఇళ్ల నుంచి పనిచేసేచోటికి వెళ్లేందుకు సొంత వాహనాలపై ఆధారపడుతున్నారు. దీనిని వెంటనే నియంత్రించేలా ప్రభుత్వం ప్రజారవాణా వ్యవస్థ ఏర్పాటుచేయాలి. గాజువాక నుంచి మధురవాడ వరకు ప్రజారవాణా ఏర్పాటుచేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి. దాంతో వాయు, శబ్ద కాలుష్యాలు తగ్గుతాయి. ప్రజారవాణా వ్యవస్థ ఏర్పాటుచేసినపుడు నిర్ణీత స్టేషన్‌లలో పార్కింగ్ కేటాయించాలి. విశాఖలో బీఆర్‌టీఎస్ రోడ్లను వెంటనే ఉపయోగంలోకి తీసుకురావాలి. అప్పుడే ట్రాఫిక్ తగ్గి ప్రమాదాలు తగ్గుతాయి.

త్వరలో రెండుచోట్ల శబ్ద కాలుష్య యంత్రాలు

ఆర్.లక్ష్మినారాయణ, ఈఈ, కాలుష్య నియంత్రణ మండలి

నగరంలో ప్రస్తుతం జూ, సిరిపురం కూడలి ప్రాంతాల్లో శబ్ద కాలుష్య నిర్ధారణ యంత్రాలు పనిచేస్తున్నాయి. సున్నితమైన ప్రాంతం కావడంతో జంతుప్రదర్శనశాలలో ఒకటి పనిచేస్తోంది. జంతుప్రదర్శనశాలలో 50-60 డెసిబుల్స్ నమోదవుతుంది. కమర్షియల్ ప్రాంతంగా గుర్తించినందున సిరిపురం జంక్షన్‌లో ఏర్పాటుచేయగా 70-75 డెసిబుల్స్ నమోదవుతుంది. కాగా అధికారులు మాన్యువల్‌గా మద్దిలపాలెం, సీతమ్మధార, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నెలకు నాలుగైదు పర్యాయాలు శబ్ద కాలుష్యం తీవ్రతను లెక్కిస్తున్నారు. ఆయా చోట్ల సగటును 75 నుంచి 80 డెసిబుల్స్ నమోదవుతున్నాయి. నగరంలో శబ్దాలు పెరుగుతున్నందున మరో రెండు కూడళ్లలో యంత్రాలు ఏర్పాటుచేయాలని ప్రతిపాదించాం. జగదాంబ జంక్షన్‌లో ఒకటి, ఎన్ఏడీ జంక్షన్‌లో రెండో యంత్రం ఏర్పాటుచేస్తాం.

నరాలు పాడై చెవుడు వచ్చే ప్రమాదం

డాక్టర్ సూర్యప్రకాష్, ఈఎన్‌టీ వైద్యులు



శబ్ద కాలుష్యం వల్ల నరాలు పాడై శాశ్వత చెవుడు వచ్చే అవకాశముంది. ముఖ్యంగా లారీలు, ఆటో డ్రైవర్లలో ఇటువంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. భారీ శబ్దాల వల్ల కొంతమందిలో కళ్లు తిరగడం, వాంతులు వంటి సమస్యలు కూడా కనిపిస్తుంటాయి. లారీలు అదేపనిగా హారన్‌లు మోగించడం వల్ల నరాలపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశముంది. అతి శబ్దాల వల్ల వయసుతో సంబంధం లేకుండా శాశ్వతంగా వినికిడి శక్తిని కోల్పోవచ్చు. సాధారణంగా 50-60 డెసిబుల్స్ వరకు శబ్దాన్ని వినవచ్చు. 110 వరకూ ఇబ్బందైనా పర్వాలేదు. 110 డెసిబుల్స్ దాటితే మాత్రం తీవ్రమైన శబ్దంగా భావించాలి. ఇది మితిమీరిన శబ్దంగా పరిగణించాల్సి ఉంటుంది. 110 డెసిబుల్స్ దాటితే నరాలపై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశముంది.

మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజుపై పోలీసులకు ఫిర్యాదు

విశాఖపట్నం, ఆగస్టు 21: తన వద్ద అప్పుగా తీసుకున్న రూ.50 లక్షలను తిరిగి ఇవ్వాలని కోరితే చేయి చేసుకోవడంతోపాటు చంపేస్తానని బెదిరించారంటూ ఎలమంచిలి మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజుపై ఒక పారిశ్రామికవేత్త సోమవారం ద్వారకానగర్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనికి సంబంధించి బాధితుడు తెలిపిన వివరాలిలా వున్నాయి...పి.రాజన్‌బాబు ద్వారకానగర్ మొదటి లైన్‌లో సరోజిని ఇంజనీరింగ్ వర్క్స్ పేరుతో ఫెర్రో ఎల్లాయిస్ ప్రాజెక్టులు నిర్వహిస్తుంటారు. ఆయన 2010లో అచ్యుతాపురంలో అభిజిత్ ఫెర్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టు కాంట్రాక్టు పనులు దక్కించుకున్నారు. ఆ సమయంలో అప్పటి ఎలమంచిలి ఎమ్మెల్యేగా వున్న యువీ రమణమూర్తిరాజు (కన్నబాబు) ప్రాజెక్టుకు తన వాహనాలను పెట్టుకోవాలని రాజన్‌బాబును కోరారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం పెరిగింది. ఈ నేపథ్యంలో అచ్యుతాపురంలో ల్యాండ్ కొనుగోలు చేసేందుకు డబ్బు అవసరమని, రూ.50 లక్షలు సర్దుబాటు చేస్తే వారం రోజుల్లో తిరిగి ఇచ్చేస్తానని కన్నబాబురాజు కోరారు. ఆ మొత్తాన్ని అదే సంవత్సరం సెప్టెంబర్ పదిన కన్నబాబు మేనల్లుడైన ఉజ్వలరాజుకు చెందిన యూనియన్ బ్యాంక్ ఖాతాకు యాక్సిస్ బ్యాంక్ నుంచి ట్రాన్స్‌ఫర్ చేశారు. తర్వాత ఆ మొత్తాన్ని అడిగితే ఇదిగో...అదిగో అంటూ కన్నబాబు చెప్పుకుంటూ వచ్చారు. కొంతకాలానికి సీబీఐ తన బ్యాంకు ఖాతాలను సీజ్ చేసిందని, సర్దుమణగగానే ఇచ్చేస్తానని చెప్పారు. ఆరు నెలల క్రితం డబ్బులు ఇవ్వాలని కన్నబాబును అడిగితే ఆగస్టులో ఇస్తానని తెలిపారు. ఆగస్టు ఐదున సీతమ్మధారలోని కన్నబాబురాజు



పోలీసులకు ఫిర్యాదు అందజేస్తున్న రాజన్‌బాబు

ఇంటికి వెళ్లి డబ్బులు అడిగితే బాగానే మాట్లాడి 20 తేదీన వస్తే డబ్బు ఇస్తానని చెప్పారు. దీంతో రాజన్‌బాబు సోమవారం ఉదయం 11 గంటల సమయంలో సీతమ్మధారలోని కన్నబాబు ఇంటికి వెళ్లారు. అయితే రాజన్‌బాబుని చూడగానే...'ఫోన్ చేయకుండా ఎందుకువచ్చావు...నేను బయటకు వెళుతున్నాను. ఈసారి వచ్చినపుడు ఫోన్ చేసి రా.' అని కన్నబాబురాజు చెప్పారు. దీంతో తనకు డబ్బులు ఇస్తే గానీ ఇక్కడి నుంచి కదలనని తాను అనగా కన్నబాబు ఆగ్రహంతో...గట్టిగా మాట్లాడుతున్నావేంటంటూ మెడపై చేయి వేసి తోసి చెంపపై కొట్టారని రాజన్‌బాబు చెబుతున్నారు. గన్‌తో కాల్చి చంపేస్తానంటూ బెదిరించారని, వాచ్‌మన్, డ్రైవర్‌ను పిలిచి బయటకు గెంటివేయించారని, అయినప్పటికీ కారుకు అడ్డంగా నిలబడగా ఢీకొట్టి చంపేస్తానంటూ బెదిరించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజన్‌బాబు సోమవారం ద్వారకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సెక్షన్ 420, 352, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని దర్యాప్తు చేపడుతున్నామని సీఐ రాంబాబు తెలిపారు.

నేచురోపతిపై నిర్లక్ష్యం

డిమాండ్ ఉన్నా..ఇన్ పేషెంట్ విభాగాన్ని మూసేశారు బూజుపట్టిన వార్డు..తుప్పుపట్టిన సామగ్రి

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

ఆంధ్ర విశ్వవిద్యాలయ యోగా విలేజ్‌లో నేచురోపతిపై పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. వర్సిటీలో కొత్త కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న పాలకులు... నేచురోపతిని మళ్లీ ప్రారంభించాలనే ఆలోచనలో లేరు. రక్షణ రంగంలో మూడు ప్రధాన విభాగాల అధికారులు, సిబ్బందికి వర్సిటీ యోగాలో ఇప్పటికే స్వల్పకాల కోర్సు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో నేచురోపతి కోర్సును అందిస్తే మంచి స్పందన వస్తోందని తెలిసినా పాలకులు ఆ దిశగా యోచించడం లేదు. రకరకాల వ్యాధులతో సతమతమవుతున్న అనేకమంది యోగా తరగతులకు హాజరవుతున్నారు. ఇటువంటి వారంతా వ్యాధి ఉపశమనం కోసం నేచురోపతి వైద్యం కోసం ఆరా తీస్తున్నారు. అయితే తూతూమంత్రంగా మసాజ్, స్టీమ్ బాత్, మడ్ బాత్ వంటి సేవలందిస్తున్నా.. ఇన్ పేషెంట్ వార్డు లేకపోవడంతో ప్రైవేట్ వైద్యానికి మరలుతున్నారు. ప్రైవేట్‌రంగంలో సేవలు పొందాలంటే వేల రూపాయలు వెచ్చించాల్సిందే.

రెండు దశాబ్దాల కిందటే నేచురోపతి సేవలు

ఆచార్య కోనేరు రామకృష్ణారావు తొలుత ఏయూలో యోగా కోర్సులు ప్రారంభించారు. అయితే ప్రమీలాషరాప్ అనే మహిళ ఒకరు నేచురోపతి వైద్యం అందించేలా వర్సిటీ పాలకులను ఒప్పించారు. ఆమె దశాబ్ద కాలంపాటు నేచురోపతి విభాగానికి గౌరవ డైరెక్టర్‌గా వున్నారు. యోగా విలేజ్‌లో మౌలిక వసతుల కోసం అనేక మంది దాతల నుంచి విరాళాలు సేకరించారు. యోగా విలేజ్‌లో రీసెర్చి విభాగాన్ని కోనేరు రామకృష్ణారావు, ఎక్స్‌టెన్షన్ విభాగాన్ని ప్రమీలా పర్యవేక్షించేవారు. ప్రధానంగా నేచురోపతికి డిమాండ్ పెరగడంతో ప్రత్యేకంగా పది పడకలతో ఇన్ పేషెంట్ వార్డును ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రధానంగా మసాజ్, స్టీమ్‌బాత్, మడ్‌బాత్, ఇతర సేవల కోసం కొందరు ఉద్యోగులను తాత్కాలికంగా నియమించారు. ఈలోగా నేచురోపతిలో డిగ్రీ చేసిన డాక్టర్ తులసీరావు నేచురోపతి వైద్యునిగా వచ్చారు. విశాఖ నగరంలో ప్రభుత్వపరంగా నేచురోపతి ఆస్పత్రి ఇదే. తాత్కాలిక ఉద్యోగులు 15 మందికి ఆచార్య బీల సత్యనారాయణ వీసీగా వున్నప్పుడు మసాజర్లుగా హోదా ఇచ్చారు. డిమాండ్ పెరగడంతో అనేక రకాల మౌలిక సదుపాయాలు సమకూర్చారు. కొందరు పేషెంట్లు కొన్ని వస్తువులను విరాళంగా ఇచ్చారు. ప్రైవేటు రంగంతో పోల్చితే తక్కువ ఫీజు వసూలు చేసినా ఆదాయం బాగానే వచ్చేది. రోజుకు 30 నుంచి 40 మంది అవుట్ పేషెంట్లు వైద్యానికి వచ్చేవారు. దీంతో ఇన్ పేషెంట్ వార్డు ఫుల్‌గా వుండేది. అయితే ఏమైందో ఏమోగాని 2013లో నేచురోపతి ఇన్ పేషంట్ వార్డును అర్థంతరంగా మూసివేశారు. ఏళ్లతరబడి అనుభవం ఉన్న మసాజర్లను వర్సిటీకి బలవంతంగా బదిలీ చేశారు.



మూతపడిన నేచురోపతి విభాగంలోని ఇన్ పేషెంట్ వార్డు

పదేళ్లపాటు పనిచేసిన తులసీరావును పర్మినెంట్ చేయాలన్న కోర్టు ఆదేశాలను సైతం పక్కన పెట్టిన గత పాలకులు, పూర్తిగా ఈ విభాగాన్ని మూసివేశారు. వర్సిటీలో అనేక మందిని పర్మినెంట్ చేసిన పాలకులు, తులసీరావు విషయంలో న్యాయం చేయలేకపోయారు. చివరకు నేచురోపతి సేవలు అందించే డాక్టర్ తులసీరావును యోగా తరగతుల బోధనకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఆయన తాత్కాలిక విధానంలో అసిస్టెంట్ ఆచార్యునిగా సేవలందిస్తున్నారు. ఇన్ పేషెంట్ విభాగం మూతపై అప్పట్లో విమర్శలొచ్చినా గత పాలకులు పట్టించుకోలేదు. ప్రస్తుతం ముగ్గురు, నలుగురు ఆధ్వర్యంలో అవుట్ పేషెంట్‌లకు సేవలందిస్తున్నారు. వీరిలో ఒకరిద్దరు తప్ప మిగిలిన వారికి అనుభవం లేకున్నా మసాజ్ సేవలకు వినియోగిస్తున్నారు. యోగా తరగతుల బోధనకు బదిలీ చేసినప్పటికీ అవుట్ పేషెంట్ రోగులకు తులసీరావు సేవలందిస్తున్నారు.



మట్టి వినాయకునికే జై

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకు నిరాదరణ
- కొనుగోలుదారుల కోసం తయారీదారుల ఎదురు చూపు
- పది శాతం కూడా బుక్ కాలేదని ఆవేదన
- గత ఏడాది ఇప్పటికే 60 శాతం బుకింగ్



ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌పై జనానికి మోజు తగ్గిందా...మట్టి వినాయక ప్రతిమలనే వాడాలన్న ప్రచారం ఫలిస్తోందా...ఏమో ప్రస్తుతం నగర మార్కెట్ పరిస్థితి చూస్తే అలాగే అనిపిస్తోంది. నగరంలో చవితి సందడి ప్రారంభమైంది. మండపాల ఏర్పాట్లు మొదలయ్యాయి. అదే సమయంలో వ్యాపారుల వద్ద వివిధ ఆకృతుల్లో గణనాథులు సిద్ధమయ్యారు. భక్తుల కోరిక, వారి ఇష్టాలకు అనుగుణంగా కళాకారులు విభిన్న రీతుల్లో గణనాథులను తీర్చిదిద్ది విక్రయించేందుకు సిద్ధంగా ఉంచారు. కానీ అనుకున్న డిమాండ్ మాత్రం కానరాక పోవడంతో ఖిన్నులవుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు డిమాండ్ తగ్గడం వల్లే వ్యాపారం డల్‌గా ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

వాటిపై విముఖత



పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన పెరిగిందో లేక మట్టి విగ్రహాలను ఒకసారి వినియోగించి చూద్దామన్న భావనో తెలియదుగాని నగరంలోని చాలాచోట్ల ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలు ఆశించిన స్థాయిలో అమ్ముడు కావడం లేదు. వినాయక చవితికి పది రోజుల ముందు నుంచి వివిధ ప్రాంతాల భక్తులు తమకు కావాల్సిన డిజైన్లు, ఎత్తులను ముందుగానే ఆర్డర్లు ఇచ్చేవారని, ఈ ఏడాది అటువంటి ఆర్డర్లు చాలా వరకు తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. ఏటా వినాయక చవితికి మూడు రోజుల ముందు నాటికే తయారు చేసిన విగ్రహాల్లో 60 శాతం వరకు బుక్ అయ్యేవని, ఈ ఏడాది పది శాతం కూడా బుక్ కాలేదని చెబుతున్నారు. గత కొన్నేళ్లుగా స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు చేసిన ప్రచారాన్ని ప్రజలు మన్నించారో, ఇంకా సమయం ఉందని వేచి చూస్తున్నారో మరో రెండు రోజులు ఆగితేగాని తెలియదు. పోలీసుల ఆంక్షలు, ఇతర కారణాల వల్ల గతంతో పోల్చితే పందిళ్ల సంఖ్య తగ్గడమేకాకుండా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల సంఖ్య కూడా చాలావరకు తగ్గే అవకాశం ఉందని పర్యావరణ వేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ట్రెండీ గణనాథులు

ఏటా విభిన్న రూపాల్లో ఉండే గణనాథులను తయారు చేసి భక్తులను ఆకర్షిస్తుంటారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా ట్రెండీ గణనాథులను రూపొందించి విక్రయాలు సాగిస్తున్నారు. ఇందుకోసం మహారాష్ట్ర, గుజరాత్, కోల్‌కతా తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా కళకారులను తీసుకువచ్చి విగ్రహాలు తయారు చేయించి విక్రయాలు సాగిస్తున్నారు. ఇప్పటికే నగరంలోని మద్దిపాలెం, పెదవాల్తేరు, ఇసుకతోట, ఎంవీపీ కాలనీ, అక్కయ్యపాలెం, పెదవాల్తేరు, బీచ్ రోడ్డు, వన్‌టౌన్, గాజువాక తదితర ప్రాంతాల్లో తాత్కాలిక ఆవాసాలు ఏర్పాటు చేసుకుని ఈ విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఈ ఏడాది సైక్లింగ్ వినాయకుడు, బాహుబలి, మోదీ, విష్ణురూప, ఫొటో షూట్, కుమారస్వామి, బుద్ధ అవతార, ఫ్యాషన్ డ్రెస్ వినాయకుడు, సెల్ఫీ గణనాథులు, మహాత్మాగాంధీ, శివుడు, వెంకటేశ్వరుడు...ఇలా విభిన్న రూపాలు, డిఫరెంట్ స్టైల్స్‌లో ఉండేలా గణనాథులను తీర్చిదిద్ది విక్రయాలు సాగిస్తున్నారు. ఆయా విగ్రహాల పొడవునుబట్టి రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు ధరల్లో విక్రయిస్తున్నారు. ఆర్డర్‌లను బట్టి 20 అడుగులపై వరకు విగ్రహాలను తయారు చేసి అందిస్తున్నారు.







కళ తప్పిన జనపథం

- కాలంతోపాటు మారిన పరిస్థితులు
- ఆదరణా లేదు... ఆదరించే వారు కరువు
- వెండితెర, బుల్లి తెర ప్రభావం కూడా
- కూడుపెట్టని వృత్తికి కళాకారులు రాంరాం
- ప్రత్యామ్నాయ వృత్తుల్లోకి ఎంతోమంది వలస
- వేళ్లపై లెక్కపెట్టే స్థాయికి చేరిన కళా రూపాలు
- ప్రభుత్వ ఆదరణపై బతుకీడుస్తున్న వైనం

నేడు జానపద కళల దినోత్సవం





మనసు వికసిస్తే మాట పాట రూపాన్ని ధరిస్తుంది. శరీరం కష్టపడుతుంటే హృదయ స్పందన వేగవంత మవుతుంది. గుండె వేగం తగ్గాలంటే మనసును కట్టడి చేయాలి. మనసు కట్టడిలోకి రావాలంటే మాట పాటై దాన్ని పరవశింపజేయాలి. ఈ అల్లికలోంచి పుట్టినవే జానపదాలు. ఓ పాట జీవితానికి దర్పణం కావచ్చు. ఓ పద బంధనం కన్నీటి వ్యథకు సాక్ష్యం కావచ్చు. మనసులోని భావాలే పాటగా మారి, పాటకు ఆకట్టుకునే ప్రదర్శన ఇచ్చి పల్లెజనాన్ని పరవశింపజేసే జానపద కళది ఏళ్లనాటి చరిత్ర. పల్లె మానస పుత్రిక జానపద కళ. జానపదానికి రాగం, తాళంతో పనిలేదు. పరవశింపజేసే ప్రకృతిలోని ప్రతి వర్ణన జానపదానికి రాగం, తాళం, పల్లవే. పల్లెజనం హృదయాంతరాళలో ఓ వెలుగు వెలిగిన కళ నేడు ఆదరణ కోసం ఎదురు చూడడమే విషాదం - ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం



'ఏం పిల్లడో ఎల్దుమొస్తవ...
ఏం పిల్లో ఎల్దామొస్తవా...
సికాకులంలో సీమ కొండకు'...
'బాయ బాయో
బంగారు రవణమ్మ...
బాయి సెరువుకాడ
బోరింగ్ రమణమ్మ'...

పల్లె జనాలు మనసుకు నచ్చి మెచ్చి పాడుకునే జానపద గీతాలు ఇవి. మాటే పాటగా మారి మనుషుల మధ్య సంబంధాలను, సరసాలను, చాణక్యాన్ని, వెక్కిరింపులు, వేళాకోలాలను పాటలు, నృత్యాల రూపంలో చూపేవే జానపద కళలు. ప్రజల కష్టాలు, కన్నీళ్లు, ఈతిబాధలు, ఇబ్బందులు, సంతోషాలు, సరదాల మిశ్రమం జానపద కళ. వ్యవసాయ కూలీలు ఏరువాక, ఉడుపులు, గాబుతీత, కోతల సందర్భాల్లో అలవోకగా జానపద గీతాలు పాడుకుంటూ శ్రమను మర్చిపోయే వారంటే వీటి ప్రభావం ఏ స్థాయిలో ఉండేదో అర్థం చేసుకోవచ్చు. వేల సంవత్సరాల క్రితం పుట్టి పల్లెజనం జీవితంలో భాగంగా శతాబ్దాలపాటు గ్రామీణ ప్రజల జీవితంలో భాగంగా విరాజిల్లిన జానపదం నేడు ఆదరణ కోల్పోయి, ఆదరించే వారు కరువై అంతరించే స్థాయికి చేరుకుంది. జానపద కళలే వృత్తిగా బతికిన ఎన్నో కుటుంబాలకు నమ్ముకున్న కళ పట్టెడు అన్నం కూడా పెట్టలేని స్థాయికి చేరుకుంది. కళను నమ్ముకుంటే కడుపు నిండని పరిస్థితుల్లో ఎంతో మంది కళాకారులు వృత్తికి స్వస్తిచెప్పి ప్రత్యామ్నాయ మార్గాలు వెదుక్కోవడం దశాబ్దన్నర క్రితమే ప్రారంభమైంది. క్రమేనా వీరి సంఖ్య పెరగడంతో ఇప్పుడు జానపద వృత్తిని జీవనోపాధిగా నమ్ముకున్న వారి సంఖ్య ఒకటి రెండు శాతానికి మించి ఉండదంటే అతిశయోక్తి కాదు. కొన్నేళ్ల క్రితం ఉత్తరాంధ్రలో ఓ వెలుగు వెలిగిన జానపద కళలు, కళాకారులు ప్రస్తుతం క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. నేడు జానపద కళల దినోత్సవం సందర్భంగా పలువురు కళారంగ ప్రముఖులతో మాట్లాడి 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

పండగైనా ఉత్సవమైనా...



పట్టణీకరణ పెరగక ముందు గ్రామాల్లో అమ్మవారి పండగలు, ఉత్సవాల, సంబరాలు, జాతర్లు ప్రధాన భూమిక పోషించేవి. గ్రామీణ ప్రజలు ఓ సందర్భం, సమయం, మొక్కులు తీర్చుకునేందుకు జరుపుకునే ఈ పండుగలు, ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యం ఉండేది. ఈ ఉత్సవాల్లో జానపద కళలే ప్రధాన వినోద సాధనాలు. కోయ డ్యాన్స్‌లు, తప్పెటగుళ్లు, చెక్క భజనలు, బిందెల డ్యాన్స్‌లు, కోలాటం, గంగిరెద్దులు, గరగ నృత్యాలు, హరిదాసులు, బుడబుక్కలు, పులివేషాలు, బుర్రకథ, హరికథ, కొమ్మదాసరోళ్లు, జంగమయ్య ప్రదర్శనలు నాటి జానపద కళలకు ప్రతీకలు. ప్రాచీన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు, గ్రామీణ ప్రజల జీవనసౌరభానికి ప్రతీకలుగా జానపదాలు నిలిచేవంటే అతిశయోక్తి కాదు. జానపద కళాకారులను పల్లె జనం గుండెల్లో పెట్టుకుని చూసుకునే వారు. వారి జీవనోపాధికి తమవంతు సాయం అందించడం బాధ్యతగా భావించే వారు. ఇప్పుడా పరిస్థితి మచ్చుకైనా లేదు. వెండితెర రాక, బుల్లితెర ప్రాధాన్యం పెరిగాక ఆధునిక కళలే రాజ్యమేలుతున్నాయి. పల్లె సంస్కృతిని, ఆచార సంప్రదాయాలను ప్రతిబింబించే జానపదాలు ఆసక్తిలేని కార్యక్రమాలుగా మారిపోవడం కాలం తెచ్చిన మార్పు.



అలవోకగా పుట్టినవే...

పాటంటే సాహిత్య ప్రతిభ...రాగంతాళం మిళితమైన సంగీత సౌరభం...గానం అద్భుత ప్రతిభకు నిదర్శనం. ఇది ఇప్పటి మాట. జానపదం జనం పాట. మనసులోని భావాల సాహితీ ప్రక్రియ. అది కవితాత్వకమా కాదా అన్నది సంబంధం లేదు. రాగతాళయుక్తమన్న దానితో పోలిక లేదు. పల్లెజనం తమకు తోచిన రీతిలో అలవోకగా పాడుకునేవే జానపద గీతాలు. అక్షరాలు పుట్టకముందే జానపద గీతాలు పుట్టాయని చెబుతారు. ఒకప్పుడు వ్యవసాయం, వృత్తి జీవనమే ప్రజల జీవనాధారం. ఆయా వృత్తుల్లో కష్టజీవులు శ్రమను మర్చిపోయేందుకు, ఉషారుగా పనిచేసేందుకు కొన్ని మాటలను పాటలుగా మార్చుకునే వారు. జీవన గమనంలో ఎదురయ్యే ప్రతి సంఘటనను తమలోని భావాలతో అనుసంధానించి మాట రూపంలో తీసుకువచ్చి పాటగా పాడేవారు. ఒక చోట పుట్టిన పాట బంధువుల ఇళ్లకు వెళ్లేటప్పుడు, పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే సందర్భంలో ఆయా ప్రాంతాలకు చేరేవి.

ఎక్కడికక్కడే పుట్టినవి

ప్రాంతాలు, వృత్తులు, ఆయా సంప్రదాయాలను బట్టి జానపదాలు పుట్టాయి. ఉత్తరాంధ్రలో దాదాపు 150కి పైగా జానపద కళారూపాలు కొన్నేళ్లపాటు విరాజిల్లాయి. ఆయా వృత్తుల్లోని సంప్రదాయాలు, ఇబ్బందులే కళగా మారాయి. ఉత్తరాంధ్ర ప్రాంతాలను తీసుకుంటే మత్స్యకార, అటవీ, గ్రామీణ ప్రజలు నచ్చి, మెచ్చిన కళలే ఎక్కువ. దళిత, గిరిజన సంప్రదాయ కళలకు ప్రాధాన్యం ఉంది. తొలి రోజుల్లో పాటకే ప్రాధాన్యం. ఆ పాటకు చిన్నచిన్న శబ్దాలు చేసే పరికరాలు తోడయ్యాయి. ఆ తర్వాత వాటికి వేషాలు అనుసంధానించి కళగా మారాయి. వృత్తుల్లో శ్రమను మర్చిపోయేందుకు పాడుకునే పాటలు క్రమేణా కొందరి జీవనోపాధి వృత్తులుగా మారాయి. ఆయా గ్రామాలకే పరిమితమైన కళలు కాలక్రమంలో వివిధ ప్రాంతాలకు విస్తరించాయి. ఆయా జానపద కళారూపాలకు అనుగుణంగా కొన్ని రకాల వాయిద్య పరికరాలను చేర్చి వినూత్న పద్ధతిలో ఊరు, వాడా తిరుగుతూ ప్రజల్లోకి వీటిని తీసుకెళ్లారు. ఇలా తెలుగునాట ప్రాంతానికి కొన్ని చొప్పున వందల రకాల జానపద కళారూపాలు ఆవిర్భంచాయి. కాలక్రమంలో వీటికి ఆదరణ తగ్గడం, వృత్తుల వారసత్వాన్ని స్వీకరించేవారు లేకపోవడంతో ఇప్పుడు జానపదం అంతరించే కళగా మారింది.

ఉత్తరాంధ్ర జానపదాలు

ఉత్తరాంధ్ర జానపద కళలకు పెట్టింది పేరు. ఈ ప్రాంతంలో దాదాపు 150 వరకు జానపద కళలు ఉండేవి. కొన్ని వందల మంది కళకారులు వీటిపైనే ఆధారపడి జీవనం సాగించేవారు. ప్రస్తుతం సుమారు 30 వరకు మాత్రమే జానపద కళలు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నాయి. వాటిలో ప్రధానంగా థింసా నృత్యం, గరగ నృత్యం, శివ బాగోతం, జాలరి బాగోతం, జముకుల పాట, దాసరి పాట, హరినారాయణ పాట, కోలాటం, తప్పెట గుళ్లు, చెంచు బాగోతం, వీధి బాగోతం, చెక్క భజన, పులివేషాలు, పందిరిపాట వంటి వాటికి మాత్రమే అంతోఇంతో ఆదరణ ఉంది. ఇవి కూడా కాస్త వెనుకటి తరం వారితో నడుస్తున్న కళలు. వీటిని కొనసాగించే వారు కరువవుతుండడంతో ఏవో ఉత్సవాల్లో అరుదైన కళలుగా దర్శించుకోవడం తప్ప సంప్రదాయ ఆస్తిగా చెప్పుకునేందుకు అవకాశంగా మాత్రం కనిపించడం లేదు.

ప్రభుత్వ పరమైన సహకారం



సీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి జానపద కళలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఈ కళలను బతికించేందుకు, భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం తరపున జరిగే కార్యక్రమాల్లో జానపద కళల ప్రదర్శన ఉండేలా చూస్తున్నారు. ఇప్పటికే పలువురు కళాకారులకు ప్రభుత్వం పింఛన్ అందిస్తోంది. కొంతమంది కళాకారులకు గుర్తింపు కార్డులను కూడా అందించారు. మరింత మందికి ఇవ్వాల్సి ఉంది. జానపద కళలను భవిష్యత్ తరాలకు తెలియజేసే కార్యక్రమాలతోపాటు కళాకారులను కూడా ప్రోత్సహించే చర్యలను చేపట్టనున్నారు.

- డి.హరినాథ్, భాషా సాంస్కృతిక శాఖ జిల్లా కో ఆర్డినేటర్

కళ అంతరించే దశకు చేరుకుంది



జానపద కళలు నేడు అంతరించే దశకు చేరుకున్నాయి. ప్రధానంగా ప్రభుత్వాల నుంచి కళలకు, కళాకారులకు సరైన సహకారం, ప్రోత్సాహం లేకపోవడం వల్లే ఇదంతా జరుగుతోంది. తెలుగు భాషను బతికించుకోవాలంటే జానపద కళలను కూడా బతికించుకోవాలి. లేకపోతే జాతి మూలాలే దెబ్బతినే అవకాశం ఉంది. ఉత్తరాంధ్రలో ఇప్పటికే చాలా కళలు అంతరించే దశకు చేరుకున్నాయి. మిగిలిన వాటిని కాపాడాలంటే ప్రభుత్వాల ప్రోత్సాహం చాలా అవసరం. ఇందుకోసం పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు ఉన్న విద్యలో జానపద కళలను కూడా బోధించేలా చూడాలి. ఏయూ థియేటర్ ఆర్ట్స్ విభాగంలో జానపద కళలకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు నేర్పించే బాధ్యతను అప్పగించారు. ఇదే విధంగా మిగిలిన చోట్ల చర్యలు తీసుకుంటే మరింత కాలం జానపద కళలు బతికేందుకు అవకాశముంది. **- జానపద కళారత్న వంగపండు ప్రసాదరావు,** ఉత్తరాంధ్ర జానపద కళాకారుడు



ప్రత్యామ్నాయం వైపు



సంప్రదాయ వృత్తులను స్వీకరించే పరిస్థితి ప్రస్తుతం లేకపోవడంతో ఆయా వృత్తుల నుంచి పుట్టిన జానపద కళలు కూడా అంతరించే దశకు చేరుకుంటున్నాయి. ప్రధానంగా ఆయా వృత్తులకు పల్లెల్లో ఆదరణ తగ్గడం, కళలను పోషించేవారు కానరాకపోవడంతో ఏళ్ల నుంచి జానపద కళను వృత్తిగా నమ్ముకున్నవారు ప్రత్యామ్నాయ దారులు వెతుక్కుంటున్నారు. అవసరమైతే వలస బాట పడుతున్నారు. ఈ పరిస్థితి జానపద కళలకు శాపంగా మారడమేకాదు భవిష్యత్తుతరాలకు వాటి గురించి తెలిసే అవకాశం కూడా లేని పరిస్థితిని సృష్టిస్తోంది. సంప్రదాయ వృత్తులు కూడా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు కళాకారులను తమ ఆస్తిగా, వారిని కాపాడుకోవడం తమ బాధ్యతగా గ్రామీణ ప్రజలు భావించే వారు. వారికి వస్తు రూపంలో సాయం అందించి ఆదరించే వారు. ఇప్పుడా పరిస్థితి మచ్చుకైనా కానరావడం లేదు. ఎప్పుడో ప్రదర్శన జరిగితే కళాకారులకు నగదు రూపంలో కొద్దిమొత్తం ఇచ్చి చేతులు దులిపేసుకున్న వారే అధికం. ఈ కారణంగానే వందల సంఖ్యలో ఉన్న కళా రూపాలు పదుల సంఖ్యకు చేరుకున్నాయి. వాటి భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారడంతో ప్రభుత్వమే వాటిని కాపాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు


ప్రమాదానికి గురైన లారీ


గాయపడిన జోగినాయుడు

అచ్యుతాపురం రూరల్ : జిల్లాలో సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి వ్యక్తులు గాయపడ్డారు. అచ్చుతాపురం మండలంలోని సాని కాలువ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. గాజువాక నుంచి అచ్యుతాపురం వస్తున్న లారీ సాని కాలువ వద్ద ఆగి ఉన్న మరో లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ సంఘటనలో ఢీకొట్టిన లారీ ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ప్రమాదంలో లారీ డ్రైవరైన చోడవరం మండలం లక్ష్మీపురానికి చెందిన చిల్లపురెడ్డి శ్రీనివాసరావు కుడి కాలు విరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ దీనబంధు తెలిపారు.

అచ్యుతాపురం జంక్షన్ వద్ద...


108లో చికిత్స అందిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం జంక్షన్ సమీపాన రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పరవాడ మండలం రావాడ గ్రామానికి చెందిన పి.రమణ తీవ్రంగా గాయపడ్డాడు. అచ్యుతాపురం నుంచి గాజువాక వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టాడు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని...

ఎలమంచిలి రూరల్ : మండలంలోని లైనుకొత్తూరు పంచాయతీ రామకృష్ణాపురం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు గాయపడ్డారని రూరల్ ఎస్ఐ చక్రధర్ తెలిపారు. అనకాపల్లి మండలం నర్సింగరావుపేటకు చెందిన కాపారపు జోగినాయుడు అనే మోటారు మెకానిక్ తాను బాగు చేసిన బైక్‌ను తునికి తీసుకు వెళుతుండగా అదే దారిలో బైక్‌పై వెళుతున్న గెడ్డం గరగా లక్ష్మణ్‌ను వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో జోగినాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడును 108 వాహనంలో ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం అనకాపల్లి ఉషాప్రేమ్ ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ చక్రధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొడిచెర్ల వద్ద ఆటోను ఢీకొన్న బైక్...

నక్కపల్లి : మండలంలోని గొడిచెర్ల జాతీయ రహదారిలో రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. నక్కపల్లికి చెందిన శివలెంక చిన్న, ఎల్.ఏసు అనే యువకులు బైక్‌పై తుని నుంచి వస్తుండగా గొడిచెర్ల జంక్షన్‌లో ఆగివున్న ఆటోను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానిక పోలీసులు తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సింహాచలం చెప్పారు.

ఫలితమిస్తున్న పోలీసుల నిఘా

- తగ్గిన ఆకతాయిలు, ఈవ్‌టీజింగ్‌ల బెడద
- నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రశాంత వాతావరణం
- విద్యార్థినులు, ప్రయాణికుల హర్షం
- నిరంతరం నిఘా కొనసాగించాలని వినతి


ఆకతాయి విద్యార్థులకు క్లాస్ తీసుకుంటున్న పోలీసులు

నర్సీపట్నం : అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారిన నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న పోలీసుల నిఘా సత్ఫలితాలిస్తుంది. నర్సీపట్నం ఏఎస్పీ ఐశ్వర్యరస్తోగి ఆదేశాల మేరకు నర్సీపట్నం టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సింహాద్రినాయుడు, పట్టణ ఎస్ఐలు జి.ఎన్.అప్పన్న, దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకూ ఆర్టీసీ కాంప్లెక్స్ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని 20కిపైగా ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, ప్రైవేటు కళాశాలలు, ఉన్నత పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థినీ, విద్యార్థులు నర్సీపట్నం పరిసర పది మండలాల నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు. దీంతో సాయంత్రం వేళల్లో విద్యార్థినులను వేధించేందుకు పలువురు ఆకతాయిలు ఆర్టీసీ కాంప్లెక్స్‌లోనే తిష్ఠ వేస్తున్నారు. అలాగే విద్యార్థినుల ఎదుట వేగంగా ద్విచక్ర వాహనాలపై చక్కర్లు కొట్టడం, సెల్‌ఫోన్‌లతో ఫొటోలు తీయడం, అసభ్యకర మేసేజ్‌లు పంపడం వంటివి చేస్తున్న వారిపై పోలీసులు దృష్టి సారించారు. సరైన రికార్డులు, డ్రైవింగ్‌లైసెన్స్‌లు లేకుండా ద్విచక్ర వాహనాలను నడిపేవారిని, ఇద్దరు కంటే ఎక్కువ మంది కూర్చొని వేగంగా వాహనాలను నడిపేవారిని, విద్యార్థినుల ఎదుట అసభ్యకర కామెంట్‌లు చేసేవారిపై కేసు నమోదు చేస్తున్నారు. అటువంటి వారి వాహనాలను స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే రహదారి నిబంధనల ఉల్లంఘన కేసులు నమోదు చేసి జరిమానా మొత్తాన్ని మీ-సేవా కేంద్రాల్లో జమచేసి రశీదులు చూపించిన తర్వాతనే వాహనాలు అప్పగిస్తున్నారు. మరికొంత మందిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కొన్ని గంటల పాటు ఉంచి విడిచిపెడుతున్నారు. గత కొద్దిరోజులుగా పోలీసు అధికారులు నిఘా అధికం కావడంతో, ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆకతాయిల బెడద తగ్గింది. పోలీసు చర్యల పట్ల ప్రయాణికులు, కాంప్లెక్స్‌లోని వ్యాపారులు, విద్యార్థినులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలాకాలం తర్వాత సాయంత్రం వేళల్లో కాంప్లెక్స్ ఆవరణ ప్రశాంతంగా ఉందని ఏఎన్ఎల్ ఏజెంట్ శ్రీను అన్నారు. పోలీసుల నిఘా నిరంతరం కొనసాగిస్తే కొన్నాళ్లకు పరిస్థితులు చక్కబడతాయని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో గల మీ-సేవా కేంద్రం నిర్వాహకుడు విజయ్ అన్నారు. పట్టణ పోలీసులు ముందే ఈ విధంగా స్పందించి ఉంటే ఇటీవల జరిగిన హత్యను నివారించగలిగేవారని ఆర్టీసీ ఉద్యోగి కె.సన్యాసిరావు అన్నారు. విద్యార్థుల రద్దీకి తగ్గట్టుగా సాయంత్రం వేళల్లో బస్సుల సంఖ్యను పెంచేలా ఆర్టీసీ అధికారులు శ్రద్ధ వహించాలని ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు కోరారు.


మఫ్టీలో నిఘా వేసిన సీఐ సింహాద్రినాయుడు


యువకుడి హెయిర్‌స్టయిల్ మార్చాలని హెచ్చరిస్తున్న పోలీసులు

కోటవురట్ల పంచాయతీ సీతారామరాజునగర్ కాలనీలో...

లేఅవుట్ అనుమతులపై దర్యాప్తు

- సర్పంచ్ ఫిర్యాదుతో నర్సీపట్నం డీఎల్‌పీఓ శిరీషారాణి విచారణ
- పంచాయతీ రికార్డులన్నీ సీజ్
- ఫిర్యాదు చేసిన మేరకు రికార్డుల మాత్రమే సీజ్ చేయాలని సర్పంచ్ సూచనతో వాగ్వాదం


డీఎల్‌పీఓ శిరీషా రాణితో సర్పంచ్ వాగ్వాదం

కోటవురట్ల: కోటవురట్ల పంచాయతీ సీతారామరాజునగర్ కాలనీలోని సర్వేనెంబర్ 180-1, 180-1బీలో వేసిన లేఅవుట్‌పై నర్సీపట్నం డీఎల్‌పీఓ శిరీషారాణి సోమవారం దర్యాప్తు చేశారు. ఈ లేఅవుట్‌కు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఎలా ఇచ్చారని పంచాయతీ కార్యదర్శి, అందుకు సహకరించిన ఈఓపీఆర్‌డీలపై ఆమె మండిపడ్డారు. పంచాయతీ పాలకవర్గం తీర్మానం లేకుండా లేఅవుట్‌కు పంచాయతీ కార్యదర్శి సంజీవరావు అనుమతులు ఇవ్వగా, ఇందుకు ఈఓపీఆర్‌డీ ప్రభాకర్ ఆమోదం తెలిపారు. పంచాయతీ పాలకవర్గం తీర్మానించకుండా అనుమతులు ఇవ్వడంపై సర్పంచ్ గవ్వా గోవిందరావు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు ప్రాథమిక విచారణ జరిపి కార్యదర్శి సంజీవరావును కోటవురట్ల పంచాయతీ నుంచి బాధ్యతలు తప్పించి, దర్యాప్తునకు ఆదేశించారు. కోటవురట్ల పంచాయతీ అదనపు బాధ్యతలను తంగేడు కార్యదర్శికి అప్పగించారు. విచారణ చేపట్టిన డీఎల్‌పీఓ శిరీషారాణి పంచాయతీ రికార్డులను పరిశీలించారు. లేఅవుట్ యాజమానుల నుంచి ఆధారాలు తీసుకున్నారు. పాలకవర్గం తీర్మానం లేకుండా అనుమతులు ఇవ్వడం, రికార్డుల్లో లోపాలను ఆమె గుర్తించారు. పంచాయతీ రికార్డులను సీజ్ చేయాలని అదనపు కార్యదర్శి నాగేశ్వరరావును ఆదేశించారు. ఈ విషయంలో సర్పంచ్ గవ్వా గోవిందరావు జోక్యం చేసుకుని రికార్డులన్నీ సీజ్ చేయవద్దని డీఎల్‌పీఓ శిరీషాను కోరారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాల్సి ఉందని, అందువల్ల రికార్డులు సీజ్ చేస్తామని ఆమె స్పష్టం చేశారు. తాను ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించి రికార్డుల మాత్రమే తీసుకు వెళ్లాలని, మిగిలిన రికార్డులు సీజ్ చేయొద్దని ఆమెతో వాగ్వాదానికి సర్పంచ్ దిగారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం తీవ్ర స్థాయిలో జరిగింది. చివరకు పంచాయతీ రికార్డులను సీజ్ చేసి తన వెంట డీఎల్‌పీఓ తీసుకు వెళ్లారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

చోడవరం: పట్టణ శివారు అన్నవరం గ్రామానికి చెందిన జి.గంగరాజు అనే యువకుడు సోమవారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సమస్యలు కారణంగా పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు చోడవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

జాజులపాలెంలో జ్వరాల విజృంభణ


జ్వరాలతో బాధపడుతున్న గిరిజనులు

చీడికాడ : మండలంలో కోనాం శివారు జాజులపాలెంలో జ్వరాలు విజృంభిస్తుండడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు నెలలుగా, దపదపాలుగా జ్వరాలు, కీళ్లనొప్పులు, వాంతులు, విరేచనాలతో గిరిజనులు బాధపడుతున్న వైద్య సిబ్బంది సరిగ్గా స్పందించడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా జ్వరాలు, వాంతులతో బాధపడుతున్న విషయాన్ని చీడికాడ ప్రభుత్వ ఆస్పత్రికి తెలియపరచినా పట్టించుకోవడం లేదని పలువురు గిరిజనులు తెలిపారు. సోమవారం పొట్టంగి నూకాలమ్మ, దుప్పి వరలక్ష్మి, దుప్పి ముత్యాలమ్మ, పాడెల బసువులమ్మ, దుప్పి దేముడు, పొట్టంగి గౌరమ్మ, జన్ని దేముడమ్మ , కూడా లక్ష్మి, దాయిలి భీమరాజు, దుప్పి పండుదొరతో పాటు మరో ముగ్గురు చిన్నారులైన దుప్పి శివ, జల్లి కార్తీక్. దాయిరి జయశ్రీలు జ్వరాలతో బాధపడుతున్నారు.

పోలీసు బీట్ ఐలాండ్‌ను ఢీకొన్న లారీ

అచ్యుతాపురం : అచ్యుతాపురం నాలుగు రోడ్లు కూడలిలో గల పోలీసు బీట్ ఐలాండ్‌ను లారీ ఢీకొంది. దీంతో ఐలాండ్ నేలకొరిగింది. ప్రమాదం సమయంలో ఎవరూ లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు హుటాహుటిన తిరిగి తాత్కాలికంగా నిలబెట్టారు. జంక్షన్ వద్ద రోడ్డు ఇరుకుగా ఉండటం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

ఉన్నత ప్రమాణాలతో బోధన అవసరం

కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ● ఎంఈవోలు జాబ్‌చార్డు ప్రకారం తనిఖీలు చేయాలి



విద్యాశాఖ అధికారులతో సమావేశమైన కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల విద్యాశాఖ అధికారులు జాబ్‌చార్టు ప్రకారం పాఠశాలలను తనిఖీలు చేయాలని సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ అధికారులతో పథకాల అమలుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారులు వారి జాబ్‌చార్టు ఆధారంగా పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. మండల విద్యాశాఖ అధికారులు గ్రామాల్లో పల్లె నిద్రలు నిర్వహించి ఆయా పాఠశాలల్లో విద్యాబోధన తీరుతెన్నులను తనిఖీ చేయాలన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజూ ఉపాధ్యాయులతో సమావేశమై సిలబస్‌పై చర్చించాలని సూచించారు.

ఒకే ఒక్క పాఠశాలకు ఎల్‌పీజీ సిలిండర్లు :డీఈవో నాగమణి

డీఈవో నాగమణి మాట్లాడుతూ జిల్లాలో 3,867 పాఠశాలలుండగా ఒక్క చంద్రంపాలెం పాఠశాలలో మాత్రమే ఎల్‌పీజీ గ్యాస్ సిలెండర్లు అందజేశారని తెలిపారు. మిగిలిన పాఠశాలలకు అందించాలని కోరారు. జిల్లాలో రేషనలైజేషన్ లోభాగంగా 79 యూపీ స్కూళ్లను, ఐదు ప్రైమరీ స్కూళ్లను దగ్గర స్కూళ్లలో కలిపినట్లు తెలిపారు. ఆర్ఎంఎస్ఏ కింద జిల్లాలో చేపట్టిన ప్రగతిని పీడీ శివప్రసాద్ వివరించారు. జిల్లాలో వివిధ పాఠశాలలకు మంజూరైన 126 క్రీడా మైదానాలను ఉపాధి హామీ పథకంతో చేపట్టాల్సివుందన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రమణమూర్తి తదితరులు హాజరయ్యారు.

డుంబ్రిగుడలో వర్షం: రైతన్నల హర్షం



వర్షంతో చిత్తడిగా మారిన రహదారి

డుంబ్రిగుడ: మండలంలోని సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలోని పలు ప్రాంతాలు పూర్తిగా జలమయయ్యాయి. డ్రైనేజీలు పూర్తిగా నిండిపోయి చెత్తచెదారంతో అధ్వానంగా ఉంది. ఈ వర్షాల వల్ల వరి పంటకు ఎంతో మేలు కలుగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా విస్తారంగా మండల పరిధిలో వర్షాలు పడుతుండటంతో పర్యాటక ప్రాంతం చాపరాయిలో వరదనీటి ఉధృతి అధికంగా ఉంటోంది. ఈ కారణంగా చాపరాయికి వచ్చే పర్యాటకులకు గెడ్డలో దిగేందుకు అనుమతి ఇవ్వడానికి టెండర్ దారులు నిరాకరిస్తున్నారు.

లాడ్జిలు, థియేటర్‌లలో సీసీ కెమెరాలు

● నిర్వాహకులకు ఏఎస్పీ ఐశ్వర్య రస్తోగి సూచన



మాట్లాడుతున్న ఏఎస్పీ ఐశ్వర్యరస్తోగి

నర్సీపట్నం: పట్టణంలో ఉన్న సినిమా థియేటర్లు, లాడ్జిలు కచ్చితమైన నియమ నిబంధనలు పాటించాలని నర్సీపట్నం ఏఎస్పీ ఐశ్వర్య రస్తోగి అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని సినిమా థియేటర్ల యజమానులు, లాడ్జిల నిర్వాహకులతో తన కార్యాలయంలో సమావేశమయ్యారు. లా అండ్ ఆర్డర్ దృష్ట్యా, పట్టణంలో నెలకొన్న శాంతిభద్రతల దృష్ట్యా ప్రతి థియేటర్, లాడ్జిలలో సీసీ కెమెరాలు పెట్టాలన్నారు. అలాగే పార్కింగ్ ప్లేస్‌లను కేటాయించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచారం ఉన్నట్టు తెలిస్తే తమకు తెలియజేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి, ప్రాంతాల నుంచి కొత్త వ్యక్తులు లాడ్జిలకు వస్తే సమాచారం స్థానిక పోలీసులకు అందించాలన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, డ్రైవింగ్‌లైసెన్స్ ప్రూవ్‌లు విధిగా తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పట్టణ సీఐ సింహాద్రినాయుడు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమమే ఎన్ఎంయూ లక్ష్యం

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఆగస్టు 21: ఆర్టీసీ కార్మిక సంక్షేమం కోసం నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) కృషి చేస్తుందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు అన్నారు. యూనియన్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా యూనియన్ విశాఖ రీజనల్ కమిటీ సోమవారం మద్దిపాలెం డిపో ఆవరణలో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించింది. ఈ సభకు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై యూనియన్ వ్యవస్థాపకులు రామ్మోహన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాకుండా ఆర్టీసీ కార్మికులతోనే అనుబంధం పెంచుకొని నిరంతరం వారి బాగోగులకోసం ఎన్ఎంయూ పనిచేస్తుందన్నారు.

యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.నంద గోపాల్, జోనల్ అధ్యక్షులు కె శ్రీనివాసరాజు, జోనల్ కార్యదర్శి పీవీవీ మోహన్ యూనియన్ నాయకులు ఎంవీఆర్ మూర్తి, పీపీఎం రాజు, వి. అప్పారావు, ఎస్ఎస్ బాబు, ఏకే శివాజీ, జేఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం: జీవీఎంసీ 55వ వార్డు జేఎన్ఎన్‌యూఆర్ఎం నివాస గృహాల విషయంలో అక్రమాలకు పాల్పడిన వారిని దువ్వాడ పోలీసులు గుర్తించి విచారణ నిర్వహిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహాల కేటాయింపులో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని గతంలో పలుమార్లు స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో

అక్రమార్కులపై విచారణ ?

గతంలో అధికారులు ఈ విషయంపై విచారణ జరిపారు. ఇప్పుడు అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు విచారణ నిర్వహిస్తున్నట్టు తెలిసింది. ఈవిషయంపై దువ్వాడ సీఐ ఎన్.సాయిని సంప్రదించగా దీనిపై దర్యాప్తు నిర్వహిస్తున్నామని సంబంధిత పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

ఇకపై వెబ్‌ల్యాండ్‌లో వుడా భూములు

- జాయింట్ కలెక్టర్ సృజన ఆదేశం
- లెక్కలు తేలుస్తున్న వుడా
- సిట్ నుంచి 22 కేసులు

(ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం)

ఇప్పటివరకు ప్రభుత్వ భూముల వివరాలు మాత్రమే వెబ్‌ల్యాండ్‌లో లభిస్తున్నాయి. ప్రైవేటు భూములైతే యజమానుల పేర్లు నమోదు చేసున్నారు. విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థ (వుడా)కు మాత్రం ఇప్పటివరకు ఆ ఏర్పాటు లేదు. ప్రభుత్వం నుంచి వుడా పెద్ద ఎత్తున భూములు తీసుకుంది. వాటిలో అత్యధికం వుడా దగ్గరే వున్నాయి. వాటి వివరాలు వెబ్‌ల్యాండ్‌లో చూస్తే ప్రభుత్వ భూములుగానే కనిపిస్తున్నాయి. వుడా పేరు ఎక్కడా కనిపించడం లేదు. దీన్ని సరిదిద్దాలని భూములపై ఎవరికి హక్కులు వుంటే వారి పేర్లు మత్రమే వెబ్‌ల్యాండ్‌లో వుండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సృజన సూచించడంతో వుడా అధికారులు దానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. భూముల కుంభకోణం వెలుగు చూసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం మొత్తం భూములపై దృష్టి సారించింది. వుడాకు ఇచ్చిన భూములు, వాటిలో వెనక్కి తిరిగి తీసుకున్నవి... అన్నింటికి లెక్కలు వేస్తున్నది. ఇటువైపు వుడాలోను ఆ కసరత్తు జరుగుతోంది.

వుడా అధికారులు రెండు నెలల నుంచి ఆరు బృందాలతో భూములను సర్వే చేయిస్తున్నారు. వుడాకు సేకరించిన భూములు, ప్రభుత్వం నుంచి తీసుకున్నవి, వాటి క్షేత్రస్థాయి పరిస్థితి ఏమిటనేది పరిశీలిస్తున్నారు. కొంతవరకు సమాచారం రాగా, సిట్ దర్యాప్తు ముమ్మరమైన నేపథ్యంలో రెవెన్యూ సిబ్బంది ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. వారితో కలిసి చేయాల్సిన కొన్ని సర్వే పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. వాటిని కూడా పూర్తి చేశాక... భూముల లెక్కలన్నీ తేల్చి వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేస్తామని, ఇకపై వుడాకు చెందిన భూములైతే అక్కడ యజమాని పేరు వుడాగా వస్తుందని వుడా ఎస్టేట్ అధికారి వసంతరాయుడు తెలిపారు.భూముల వివాదాలకు సంబంధించి సిట్‌కు పలు ఫిర్యాదులు రాగా, వాటిలో 22 కేసులకు సంబంధించిన వివరాలు సమర్పించాలని వుడాను సిట్ కోరింది.

వుడా భూముల సమాచారం

మొత్తం భూములు	10,390.36 ఎకరాలు
ఖాళీగా వున్నవి	3,138.07 ఎకరాలు
లే అవుట్లు వేసినవి	1,604.61 ఎకరాలు
ఇతర శాఖలకు ఇచ్చినవి	3,750.59 ఎకరాలు
ఆక్రమణలు, వివాదాలు	621.24 ఎకరాలు
ఇంకా గుర్తించాల్సినవి	1,286.00 ఎకరాలు

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



కనకమహాలక్ష్మి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అధికారులు

విశాఖపట్నం: కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న శ్రావణమాస ప్రత్యేక కుంకుమ పూజలు సోమవారంతో ముగిశాయి. సోమవారం చివరిరోజు కావడంతో పెద్ద సంఖ్యలో ఉభయదాతలు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మండపంలో లక్ష్మీహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం, మధ్యాహ్న, సాయంత్ర సమయాల్లో విశేష పంచామృతాభిషేకాలు చేశారు. చుట్టపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన ఈవో ఎస్.జ్యోతిమాధవి అన్ని ఏర్పాట్లు చేశారు.

India's largest trade partner?

Current Affairs & GK



A. Ravi Prakash Reddy
Senior Faculty

1. Justice Deepak Mishra, 45th Chief Justice of India, will assume office on…..
1) 27 August 2017 2) 28 August 2017
3) 29 August 2017 4) 30 August 2017
5) 31 August 2017

2. Who is the President of Kenya re-elected for second term in the August 2017 general elections?
1) Uhuru Kenyatta
2) Muhammadu Buhari 3) Jacob Zuma
4) Robert Mugabe 5) None of these

3. Ruth Pfau, popularly known as Pakistan's Mother Teresa has passed away. She hailed from which country?
1) Switzerland 2) South Sudan
3) South Africa 4) Saudi Arabia
5) Germany

4. Name the countries for first time are going to conduct Indra tri-services exercise, involving their armies, navies and the air forces in October 2017 to further ramp up military ties?
1) India and USA 2) India and UK
3) India and Russia 4) India and China
5) India and Japan

5. Usain Bolt announced retirement to athletics recently. He is widely considered to be the greatest sprinter of all time. He belongs to ……
1) Jamaica 2) Kenya 3) Zimbabwe
4) Brazil 5) None of these

6. Who was served as the Returning Officer for the 15th Presidential election held on 17 July 2017?
1) Anoop Mishra 2) Shumsher K. Sheriff
3) Hamid Ansari 4) Sumitra Mahajan
5) None of the above

7. Which of the following lines forms border between North Korea and South Korea?
1) 18th Parallel north
2) 28th Parallel north
3) 38th Parallel north
4) 48th Parallel north
5) None of the above

8. Which of the following statements correct regarding Asian Infrastructure Investment Bank (AIIB)?
1) AIIB started operation after the agreement entered into force on 25 December 2015 and opened for business on 16 January 2016.
2) The Headquarters of AIIB is in Beijing, China.
3) Jin Liqun (China) is currently President of AIIB.
4) AIIB is an multilateral development bank that aims to support the building of infrastructure in the Asia-Pacific region.
5) All of the above

9. Which of the following bank has introduced biometric attendance in the place of the existing system of signing attendance in the attendance register?
1) State Bank of India
2) Punjab National Bank
3) Corporation Bank
4) Bank of India 5) None of these

10. The Senior IAS officer from Gujarat S. Aparna is appointed as Executive Director of the …….
1) World Bank
2) International Monetary Fund
3) World Trade Organisation
4) SAARC 5) None of these

11. Who defeated China's Zulpikar Maimaitiali in the unified WBO Asia Pacific and Oriental Super Middle weight title?
1) Vijender Singh 2) Manoj Kumar
3) Jitender Kumar 4) Gurcharan Singh
5) None of these

12. Match the following?

Author	Book
A. Y.V.Reddy	(i) A Life in Science
B. C.N.R.Rao	(ii) Advice and Descent : My Life in Public Service
C. Arundhati Roy	(iii) Matoshree
D. Sumitra Mahajan	(iv) The Ministry of Utmost Happiness

	A	B	C	D
1)	(i)	(ii)	(iii)	(iv)
2)	(iv)	(iii)	(ii)	(i)
3)	(i)	(iii)	(ii)	(iv)
4)	(ii)	(i)	(iv)	(iii)
5)	(iv)	(i)	(iii)	(ii)

13. The 75th anniversary of the Quit India Movement was observed across the country on ……
1) 7th August 2017 2) 8th August 2017

FOR ALL COMPETITIVE EXAMS

3) 9th August 2017 4) 10th August 2017
5) None of these

14. The Eighth Mekong-Ganga Cooperation Ministerial Meeting (8th MGCMM) was held on 7 August 2017 in..
1) Manila, Philippines
2) Bangkok, Thailand 3) Hanoi, Vietnam
4) Phnom Penh, Cambodia
5) None of these

15. Find the Arundhati Roy's first novel?
1) The God of Small Things
2) The End of Imagination
3) The Cost of Living
4) The Greater Common Good
5) The Algebra of Infinite Justice

16. Usain Bolt, greatest sprinter, belongs to …..
1) South Africa 2) South Sudan
3) South Korea 4) Sierra Leone
5) None of these

17. World's largest Crude Oil importer?
1) China 2) USA 3) India 4) Japan
5) None of these

18. World's largest Crude Oil exporter?
1) Saudi Arabia 2) Russia 3) Iraq
4) Canada 5) None of these

19. India's largest trade partner?
1) China 2) USA 3) UAE
4) Saudi Arabia 5) None of these

20. NABARD has conferred the 'best performance award' for 2016-17 to which regional rural bank?
1) Andhra Pragathi Grameena Bank
2) Karnataka Vikas Grameena Bank
3) Telangana Grameena Bank
4) Kaveri Grameena Bank
5) None of these

21. Who is the author of book "The Adivasi Will Not Dance"?
1) Arundhati Roy
2) Hansda Sowvendra Shekhar
3) Chetan Bhagat 4) Amitav Ghosh
5) None of these

22. Which state has the highest number of elephants, as per the Elephant census report 2017, released by the Union Ministry of Environment, Forests and Climate Change (MoEFCC)?
1) Karnataka 2) Assam 3) Kerala
4) Tamil Nadu 5) None of these

23. Who is the Union Minister for Environment, Forests and Climate Change?
1) Suresh Prabhu 2) Prakash Javadekar
3) Harsh Vardhan
4) Thawar Chand Gehlot
5) Radha Mohan Singh

24. India's Elephant population as per Elephant Census 2017 released by Union Ministry of Environment, Forests and Climate Change (MoEFCC)?
1) 27,312 2) 37,312 3) 47,312
4) 57,312 5) None of these

25. What is the nation wide campaign to protect elephants, launched by Union Ministry of Environment and Forests on the occasion of World Elephant Day observed on 12th August 2017?
1) Project Elephant
2) Project Heritage Animal
3) Project Gaja Raja 4) Gaj Yatra
5) None of these

26. Which of the following is the India's largest Regional Rural Bank (RRB)?
1) Andhra Pragathi Grameena Bank
2) Prathama Bank
3) Allahabad UP Gramin Bank
4) Maharashtra Gramin Bank
5) Kerala Gramin Bank

27. Mercosur is a sub-regional bloc between countries of which of the following continents?
1) North America
2) South America
3) Africa 4) Asia 5) None of these

28. McMohan Line represents boundary between which following two countries?
1) India and Afghanistan
2) India and Pakistan 3) India and China
4) India and Bangladesh 5) None of these

29. Which company occupies No.1 position in Fortune Global 500 list 2017, which ranks companies by their revenues in 2016?
1) Walmart 2) State Grid
3) Sinopec Group
4) China National Petroleum
5) Toyota Motors

30. How many Indian companies listed in Fortune Global 500 companies list?
1) 6 2) 7 3) 8 4) 9 5) None of these

31. SBI's rank in the Fortune Global 500 companies list?
1) 117 2) 217 3) 317 4) 417
5) None of these

32. Match the following?

Company	Country
A. Toyota Motors	(i) USA
B. Berkshire Hathaway	(ii) Germany
C. Volkswagen	(iii) South Korea
D. Samsung Electronics	(iv) France
E. AXA	(v) Japan

	A	B	C	D	E
1)	(ii)	(iii)	(iv)	(v)	(i)
2)	(iii)	(iv)	(ii)	(i)	(v)
3)	(iv)	(iii)	(i)	(ii)	(v)
4)	(i)	(ii)	(iii)	(iv)	(v)
5)	(v)	(i)	(ii)	(iii)	(iv)

33. First bank to introduce ATM in India was HSBC in…
1) 1957 2) 1967 3) 1977 4) 1987
5) None of these

Answers

1) 2 2) 1 3) 5 4) 3 5) 1
6) 1 7) 3 8) 5 9) 2 10) 1
11) 1 12) 4 13) 3 14) 1 15) 1
16) 5 17) 1 18) 1 19) 1 20) 2 21) 2
22) 1 23) 3 24) 1 25) 4 26) 5 27) 2
28) 3 29) 1 30) 2 31) 2 32) 5 33) 4

ఉద్యోగాలు

బిఇసిఐఎల్

బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బిఇసిఐఎల్) - కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 42
- **కంటెంట్ ఆడిటర్**

ఖాళీలు: 1
అర్హత: పీజీ డిప్లొమా(జర్నలిజం/ మాస్ కమ్యూనికేషన్) + విజువల్ మీడియా లేదా న్యూస్ ఏజెన్సీ(ఎఎన్ఐ/ పిటిఐ/ యుఎన్ఐ)ల్లో మూడేళ్ల అనుభవం ఉండాలి. లేదా న్యూస్ ఎడిటర్/ డిప్యూటీ డైరెక్టర్ (న్యూస్) గా పనిచేసి రిటైర్ అయి ఉండాలి.
- **సీనియర్ మానిటర్**

ఖాళీలు: 3
అర్హత: పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం ఉత్తీర్ణత + మీడియా / న్యూస్ ఏజెన్సీల్లో రెండేళ్ల అనుభవం ఉండాలి. లేదా న్యూస్ ఎడిటర్/ అసిస్టెంట్ డైరెక్టర్(న్యూస్) గా పనిచేసి రిటైర్ అయి ఉండాలి.
- **మానిటర్**

ఖాళీలు: 38
అర్హత: గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత + కంప్యూటర్ పరిజ్ఞానం + ప్రాంతీయ భాషల్లో ప్రావీణ్యం ఉండాలి. పీజీ డిప్లొమా(జర్నలిజం)/డిగ్రీ(జర్నలిజం / మాస్ కమ్యూనికేషన్) పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: రూ.300
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
వెబ్‌సైట్: www.becil.com

సిఎస్ఐఆర్ నెట్

కౌన్సెల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సిఎస్ఐఆర్)- నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్)కు ప్రకటన విడుదల చేసింది.
విభాగాలు: కెమికల్ సైన్సెస్/ ఎర్త్, అట్మాస్ఫియరిక్/ ఓషన్/ ప్లానెటరీ సైన్సెస్/ లైఫ్ సైన్సెస్/ మేథమెటికల్ సైన్సెస్/ ఫిజికల్ సైన్సెస్
అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఎమ్మెస్సీ / తత్సమాన పరీక్ష/ ఇంటిగ్రేటెడ్ బిఎస్- ఎంఎస్/ నాలుగేళ్ల బిఇ/ బిటెక్/ బిఫార్మసీ/ ఎంబిబిఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: జెఆర్ఎఫ్‌లకు జూలై 1 నాటికి 28 ఏళ్లు మించరాదు. లెక్చరర్‌షిప్‌నకు వయోపరిమితి నిబంధన లేదు.
సిఎస్ఐఆర్ - యుజిసి టెస్ట్ జరిగే తేదీ: డిసెంబరు 17
పరీక్ష కేంద్రాలు: గుంటూరు, హైదరాబాద్
పరీక్ష ఫీజు: రూ.1000(ఒబిసిలకు రూ.500, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.)
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 23 నుంచి
ఫీజు డిపాజిట్‌కు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
ఆన్‌లైన్ దరఖాస్తునకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 16
ఆన్‌లైన్ దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 23
వెబ్‌సైట్: www.csirhrdg.res.in

పీజెటిఎస్ఎయు

హైదరాబాద్, రాజేంద్ర నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (పీజెటిఎస్ఎయు)- **అసిస్టెంట్ ప్రొఫెసర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 224
విభాగాలు: అగ్రికల్చర్ 186(6 పోస్టులను లైబ్రరీ సైన్స్‌కు కేటాయించారు), అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ 22, హోం సైన్స్ 16
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 20
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 29
వెబ్‌సైట్: www.pjtsau.ac.in

బల్బులోని ఫిలమెంటును దేనితో తయారు చేస్తారు?

విద్యుత్

1. విద్యుత్ ప్రవాహం ------
ఎ) సదిశ రాశి బి) అదిశ రాశి
సి) ఎ, బి డి) ఎ, బి లు కావు

2. ఓం, వెబ్ ఓంల మధ్య సంబంధం?
ఎ) $1\ \Omega = 10^{10}$ ab Ω బి) $1\ \Omega = 10^{8}$ ab Ω
సి) $1\ \Omega = 10^{9}$ ab Ω డి) $1\ \Omega = 10^{7}$ ab Ω

3. మూడు నిరోధాలను శ్రేణిలో కలిపితే ఫలిత నిరోధం R_1, సమాంతరంగా కలిపితే ఫలిత నిరోధం R_2 అయితే R_1 / R_2 విలువ?
ఎ) 3 బి) 9 సి) 1/9 డి) 1/3

4. ఒక ఆదర్శ అమ్మీటర్ నిరోధం?
ఎ) సున్నా బి) అనంతం సి) 1000 Ω డి) 10 Ω

5. ఓం నియమం అనువర్తించకూడనిది?
ఎ) ఎసి వలయం
బి) అధిక ఉష్ణోగ్రత ఉన్న వాహకాలు
సి) వాహకాలు డి) అర్ధ వాహకాలు

6. ఒక నిరోధం పొడవును రెట్టింపు చేస్తే నిరోధం?
ఎ) సగమవుతుంది బి) రెట్టింపవుతుంది
సి) నాలుగోవంతవుతుంది డి) మారదు

7. ప్రామాణిక నిరోధాలు తయారుచేయడానికి వాడే పదార్థం?
ఎ) రాగి బి) కాన్‌స్టంటన్ సి) వెండి డి) టంగ్‌స్టన్

8. 1 KWH విలువ =
ఎ) 36 x 10^{5} J బి) 36 x 10^{5} ev
సి) 36 x 10^{6} J డి) 36 x 10^{3} J

9. వివిధ సంయోగాలతో రెండు ఫలిత నిరోధాలు 18 Ω, 4 Ω. అయితే ఆ నిరోధాలు Ω లలో
ఎ) 9, 9 బి) 11, 7 సి) 6, 12 డి) 10, 8

10. ఒక వాహకం ద్వారా 0.5 ఆంపియర్ విద్యుత్ ప్రవహిస్తుంది. అయితే ఒక నిముషంలో దాని ద్వారా ప్రవహించిన ఆవేశం?
ఎ) 3C బి) 0.3C సి) 33C డి) 30C

11. విద్యుత్ ప్రవాహం వల్ల అయస్కాంత ఫలితం కలుగుతుందని కనుగొన్నది?
ఎ) మాక్స్‌వెల్ బి) ఆయిర్‌స్టెడ్ సి) ఫెర్మి డి) ఫ్లెమింగ్

12. ప్రేరిత విద్యుచ్ఛాలక బలం దిశను తెలుసుకోవడానికి ఉపయోగించే నియమం?
ఎ) ఆంపియర్ ఎడమచేతి నిబంధన
బి) మాక్స్‌వెల్ నిబంధన
సి) ఫ్లెమింగ్ ఎడమచేతి నిబంధన
డి) ఫ్లెమింగ్ కుడి చేతి నిబంధన

13. స్వయం ప్రేరణ గుణకానికి, అన్యోన్య ప్రేరణ గుణకానికి ఎస్ఐ ప్రమాణాలు వరసగా?
ఎ) హెన్రీ, ఫారడ్ బి) ఫారడ్, ఫారడ్
సి) హెన్రీ, హెన్రీ డి) ఫారడ్ హెన్రీ

14. ఒక తీగచుట్ట నుంచి నిలువుగా వదలిన దండయస్కాంతం తీగచుట్టలో నుంచి కిందికి పడుతోంది. దాని త్వరణం?
ఎ) g కంటే ఎక్కువ బి) g కంటే తక్కువ
సి) g కి సమానం డి) పైవేవీ కావు

15. పాస్పర్ - బ్రాంజ్ ధర్మం?
ఎ) యంగ్ గుణకం ఎక్కువ, ధృఢతా గుణకం తక్కువ
బి) యంగ్ గుణకం తక్కువ, ధృఢతా గుణకం ఎక్కువ
సి) యంగ్ గుణకం ఎక్కువ, ధృఢతా గుణకం ఎక్కువ
డి) యంగ్ గుణకం తక్కువ, ధృఢతా గుణకం తక్కువ

16. ఫ్యూజ్ వైర్ ముఖ్య ధర్మాలు
ఎ) తక్కువ నిరోధం, తక్కువ ద్రవీభవన స్థానం
బి) ఎక్కువ నిరోధం, తక్కువ ద్రవీభవన స్థానం
సి) తక్కువ నిరోధం, తక్కువ ద్రవీభవన స్థానం
డి) ఎక్కువ నిరోధం, ఎక్కువ ద్రవీభవన స్థానం

17. 'గాస్' కు సమానమైన విలువ?
ఎ) 10^{4} T బి) 10^{3} T సి) 10^{2} T డి) 10T

18. రెండు ఎలక్ట్రానిక్ పుంజాలు సమాంతరంగా ఒకే దిశలో ఉన్నాయి. అవి
ఎ) వికర్షించుకొంటాయి బి) ఆకర్షించుకొంటాయి
సి) వాటి వేగాలు తగ్గుతాయి
డి) ఎటువంటి అన్యోన్య ప్రభావం ఉండదు

19. అయస్కాంత అభివాహంలో మార్పు ఆగిపోయినపుడు ప్రేరిత విద్యుచ్ఛాలక బలం?
ఎ) తగ్గుతుంది బి) స్థిరం
సి) శూన్యం డి) పెరుగుతుంది

20. సమాంతరంగా షంట్ నిరోధాన్ని కలిపిన గాల్వనోమీటర్‌ను వలయంలో శ్రేణిలో కలిపితే ఆ అమరిక పేరు?
ఎ) వోల్టుమీటరు బి) అమ్మీటరు
సి) మల్టిమీటరు డి) ఓం మీటరు



శీలం దేవేందర్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ


21. B, H, I ల సంబంధం?
ఎ) $B = u_0 H$
బి) $B = u_0 (H + I)$
సి) $B = u_0 I + H$ డి) $B = uH$

22. కండెన్సర్ పలకల మధ్య నిరోధకాన్ని ఉంచితే స్థితి శక్తి?
ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
సి) మారదు డి) మారుతుంది.

23. ఒక కండెన్సర్‌లో నిలువ ఉండే శక్తి?
ఎ) QV బి) QC / 2 సి) QV/2 డి) 1/2 CV/2

24. సబ్బు బుడగను ఆవేశ పరిస్తే?
ఎ) వ్యాకోచిస్తుంది బి) సంకోచిస్తుంది
సి) పేలిపోతుంది
డి) ఎటువంటి మార్పునకు లోను కాదు

పోటీ పరీక్షల ప్రత్యేకం - ఫిజిక్స్



25. ఎలక్ట్రాన్ల శక్తిని పెంచాలి అంటే వాటిని -------
ఎ) బాగా ఎత్తునుంచి కిందికి పడవేయాలి
బి) సీసం దిమ్మె ద్వారా పంపాలి
సి) విద్యుత్ పొటెన్షియల్ ద్వారా ప్రయాణం చేయించాలి
డి) అధికంగా వేడిచేయాలి.

26. ఒక వస్తువు ఆవేశానికి, పొటెన్షియల్‌కు గల నిష్పత్తి?
ఎ) వాహకత్వం బి) కెపాసిటెన్స్
సి) ప్రేరకత్వం డి) నిరోధం

27. ఒక సర్పిలాకారపు స్ప్రింగ్ ద్వారా ఏకముఖ విద్యుత్ ప్రవాహాన్ని పంపారు. ఆ స్ప్రింగ్ -----
ఎ) సాగుతుంది బి) గుండ్రంగా తిరుగుతుంది
సి) సంకోచిస్తుంది డి) ఏదీకాదు

28. 100 w, 200V బల్బు నిరోధం ------
ఎ) 200 Ω బి) 100Ω సి) 150Ω డి) 400Ω

29. మానవుని నిరోధం సుమారు -------
ఎ) $10^{2}\ \Omega$ బి) $10^{4}\ \Omega$ సి) $10^{5}\ \Omega$ డి) $10^{6}\ \Omega$

30. ఒక అర్ధ వాహకం ఉష్ణోగ్రతను పెంచినపుడు దాని నిరోధం
ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
సి) మారదు డి) పైవేవీ కాదు

31. 3Ω నిరోధం గల తీగను మూడు సమాన భాగాలుగా కత్తిరించారు. ఆ తరవాత ఈ మూడు భాగాలను వాటి చివరలు కలిసేటట్లు ముడిపెట్టారు. ఈ అనుసంధాన నిరోధం?
ఎ) 3 Ω బి) 1/3 Ω సి) 2/3 Ω డి) 1Ω

32. శక్మాంతరాన్ని -------తో కొలుస్తారు?
ఎ) అమ్మీటర్ బి) గాల్వనా మీటర్
సి) ఓల్టు మీటర్ డి) కెపాసిటర్

33. మేఘాలలోకి గాలి పటాలను ఎగురవేసి అవి విద్యుదావేశంతో ఉంటాయని నిరూపించిన శాస్త్రవేత్త--------
ఎ) ఆంపియర్ బి) ఆయిర్‌స్టెడ్
సి) ఫ్లెమింగ్ డి) ఫ్రాంక్లిన్

34. రేడియో, టార్చిలైట్, టేపు రికార్డర్లలో ఉపయోగించే ప్రాథమిక ఘటం?
ఎ) వోల్టా ఘటం బి) అనార్ద్ర ఘటం
సి) లెక్లాంచి ఘటం డి) బైక్రోమేట్ ఘటం

35. టెలిగ్రాఫ్‌ల్లో ఉపయోగించే కోడ్?
ఎ) పిన్ బి) BCD సి) మోర్స్ డి) టెలి

36. ఎలక్ట్రిక్ బల్బుల్లో నింపే వాయువు?
ఎ) హైడ్రోజన్ బి) ఆర్గాన్
సి) ఆక్సిజన్ డి) నైట్రోజన్

37. కరెంట్ ప్రయాణించడానికి అది ఏ మార్గాన్ని ఎంచుకొంటుంది?
ఎ) గరిష్ఠ నిరోధం బి) మధ్యస్థ
సి) కనిష్ఠ నిరోధం డి) పైవేవీ కాదు

38. షార్ట్ సర్క్యూట్ అయినపుడు వలయంలో కరెంట్?
ఎ) పెరుగుతుంది బి) స్థిరంగా ఉంటుంది
సి) తగ్గుతుంది డి) చెప్పలేం

39. విశిష్ట నిరోధానికి ప్రమాణం?
ఎ) ఓం/ మీటర్ బి) మో/ మీటర్
సి) ఓం మీటర్ డి) మీటర్ / మో

40. బల్బులోని ఫిలమెంటును దేనితో తయారు చేస్తారు?
ఎ) నిక్రోం బి) టంగ్‌స్టన్
సి) మాంగనీస్ డి) క్రోమియం

41. విద్యుత్ప్రవాహం వల్ల ఉష్ణ ఫలిత అనువర్తనం?
ఎ) విద్యుత్ - ఇస్త్రీ పెట్టె బి) ఇమ్మర్షన్ హీటర్
సి) ఎలక్ట్రిక్ స్టౌ డి) పైవన్నీ

42. విద్యుత్ పని w, కరెంట్ i, నిరోధం R, కాలం t ల మధ్య సంబంధం?
ఎ) $w = iRt$ బి) $w = i^2 R/t$
సి) $w = i^2 Rt$ డి) $w = i^2 t/R$

43. ఒక విద్యుత్ సాధనం వాటేజ్(P)ను తెలిపే సమీకరణం?
ఎ) $p = vi$ బి) $p = v^2/R$
సి) $p = i^2 R$ డి) పైవన్నీ

44. ఇళ్లలోకి సరఫరా చేసే విద్యుత్ పొటెన్షియల్ భేదం?
ఎ) 220v బి) 130v సి) 240v డి) 180v

45. నిత్య జీవితంలో విద్యుత్ శక్తిని కొలిచేందుకు ఉపయోగించే పెద్ద ప్రమాణం
ఎ) వాట్ - గంట బి) కిలోవాట్ - గంట
సి) వాట్ - సెకను డి) జౌల్ / సెకను

46. విద్యుత్ ప్రవాహం వల్ల ఉత్పత్తి అయ్యే ఉష్ణరాశిని కొలిచే సూత్రం?
ఎ) $Q = mst$ బి) $Q = ms/t$
సి) $Q = m/st$ డి) $Q = ms$

47. విద్యుత్ రసాయన తుల్యాంకానికి ప్రమాణాలు?
ఎ) గ్రామ్/ కూలూమ్ బి) గ్రామ్ కూలూమ్
సి) కూలూమ్/ గ్రాం డి) గ్రామ్ / ఆంపియర్

48. విద్యుద్విశ్లేషణం వల్ల కాపర్ సల్ఫేట్ ద్రావణం గాఢత-----
ఎ) పెరుగుతుంది బి) మారదు సి) తగ్గుతుంది
డి) పెరిగి తగ్గుతుంది

49. విద్యుత్ప్రవాహం వల్ల ఏదైనా బిందువు వద్ద ఏర్పడిన అయస్కాంత క్షేత్ర (B) దిశ ఆ బిందువు వద్ద గీసిన ------- దిశలో ఉంటుంది.
ఎ) అభిలంబ రేఖ బి) సరళరేఖ
సి) స్పర్శ రేఖ డి) ఏదీకాదు

50. ప్రాంతీయ ట్రాన్స్‌ఫార్మర్లు------
ఎ) స్టెప్ అప్ ట్రాన్స్‌ఫార్మర్
బి) స్టెప్ డౌన్ ట్రాన్స్‌ఫార్మర్
సి) స్టెప్ అప్, స్టెప్ డౌన్ ట్రాన్స్‌ఫార్మర్
డి) ఏదీ కాదు

సమాధానాలు

1) బి	9) సి	17) ఎ	25) సి	34) బి	43) డి
2) సి	10) డి	18) బి	26) బి	35) సి	44) సి
3) బి	11) బి	19) సి	27) సి	36) బి	45) బి
4) ఎ	12) డి	20) బి	28) డి	37) సి	46) ఎ
5) డి	13) సి	21) బి	29) సి	38) ఎ	47) ఎ
6) బి	14) బి	22) బి	30) బి	39) సి	48) బి
7) బి	15) ఎ	23) ఎ	31) బి	40) బి	49) సి
8) ఎ	16) బి	24) ఎ	32) సి	41) డి	50) బి
			33) డి	42) సి	

ఉద్యోగాలు

డిఎంఇ

ఆంధ్రప్రదేశ్‌లోని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) - **అసిస్టెంట్ ప్రొఫెసర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 198
విభాగాలు: అనాటమీ/ ఫిజియాలజీ/ ఫార్మకాలజీ/ మైక్రోబయాలజీ/ ఎమర్జెన్సీ మెడిసిన్/ ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్
అర్హత: (ఎమ్మెస్/ ఎండి)(అనాటమి)/ఎంబిబిఎస్ + ఎమ్మెస్సీ (మెడికల్ అనాటమీ) + పిహెచ్‌డి(మెడికల్ అనాటమీ)/ (ఎమ్మెస్సీ + డిఎస్సీ)(మెడికల్ అనాటమీ)/ ఎండి(ఫిజియాలజీ)/ ఎంబిబిఎస్ + ఎమ్మెస్సీ (ఫిజియాలజీ)/ (ఎమ్మెస్సీ+ పిహెచ్‌డి)(మెడికల్ ఫిజియాలజీ)/ ఎండి(బయోటెక్నాలజీ/ మైక్రో బయాలజీ/ ఎంబిబిఎస్ + ఎమ్మెస్సీ(బ్యాక్టీరియాలజీ/ మెడికల్ బ్యాక్టీరియాలజీ) + పిహెచ్‌డి(మెడికల్ బ్యాక్టీరియాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: జూలై 1 నాటికి 40 ఏళ్లు మించరాదు
ఎంపిక: అకడమిక్ మెరిట్ లిస్ట్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.1000
ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని నింపి రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కానీ పర్సనల్‌గా గానీ కింది చిరునామాకు పంపుకోవాలి.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 4
చిరునామా: Director of Medical Education, AP, Vijayawada
వెబ్‌సైట్: www.dme.ap.nic.in

అడ్మిషన్స్

టాటా మెమోరియల్ హాస్పిటల్

టాటా మెమోరియల్ హాస్పిటల్ - కేన్సర్ పేషెంట్లకు క్లినికల్ కేర్ & సైకో సోషల్ కేర్ అందించేందుకు ఉద్దేశించిన **'పేషెంట్ నేవిగేటర్ సర్టిఫికెట్ కోర్స్'**కు దరఖాస్తులు కోరుతోంది.
కోర్సు కాల వ్యవధి: ఆరునెలలు
కోర్సు ఫీజు: రూ.18,000
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25
వెబ్‌సైట్: https://tmc.gov.in

యూనివర్సిటీ ఆఫ్ లక్నో

యూనివర్సిటీ ఆఫ్ లక్నో - **ఎంబిఎ** కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది
కోర్సు విభాగాలు: ఫైనాన్స్ & కంట్రోల్/ హెచ్‌ఆర్& ఐఆర్/ ఇంటర్నేషనల్ బిజినెస్/ మార్కెటింగ్
అర్హత: 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణ.
ఎంపిక: క్యాట్ 2017 స్కోరు ద్వారా
ఆసక్తిగల అభ్యర్థులు ముందుగా క్యాట్ 2017కు దరఖాస్తు చేసుకొని ఆ తరవాత లక్నో యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకోవాలి.
క్యాట్ రిజిస్ట్రేషన్: సెప్టెంబరు 20 వరకు
క్యాట్ 2017 ఎగ్జామ్: నవంబరు 26
యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు తేదీ: 2018 జనవరి 31
వెబ్‌సైట్: www.lkouniv.ac.in

ఐఐటిబి - మోనాష్

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటిబి), ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లోని మోనాష్ యూనివర్సిటీ ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'ఐఐటిబి - మోనాష్ రీసెర్చ్ అకాడమీ - **పిహెచ్‌డి ప్రోగ్రామ్**'నకు దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: సైన్స్/ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్/ ఐటి/ ఇంజనీరింగ్/ హ్యుమానిటీస్/ సోషల్ సైన్సెస్/ డిజైన్ / మేథమెటిక్స్
అర్హత: ఫస్టు క్లాస్ మార్కులతో పీజీ/ బిఎస్సీ/ బిఇ/ బిటెక్ పూర్తిచేసి ఉండాలి. గేట్/ జిఆర్ఇ/ సిఎస్ఐఆర్- నెట్ / జామ్ ఎగ్జామ్స్‌లో అర్హత పొందినవారికి ప్రాధాన్యం ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 11
వెబ్‌సైట్: www.iitbmonash.org

ఏయూ మైదానాలు ఇక క్రీడలకే..

ప్లాటినం జూబ్లీ గెస్ట్ హౌస్‌లో వివాహాలకు చెక్

ఏయూ పాలకుల కీలక నిర్ణయం



ఈ మైదానంలో ఇక సభలు, సమావేశాలకు స్వస్తి

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రధాన మైదానాలు రెండింటిని సభలు, సమావేశాలకు ఇవ్వరాదని పాలకులు నిర్ణయం తీసుకున్నారు. ఇంజనీరింగ్ కళాశాల, గోల్డెన్ జూబ్లీ మైదానాలు పూర్తిగా ఆటలకు మాత్రమే వినియోగించనున్నారు. వైవీఎస్ మూర్తి ఆడిటోరియానికి పడమరగా, మద్దిలపాలెం గేటుకు ఆనుకుని మైదానం, ఏయూ పాఠశాలకు ఆనుకుని ఖాళీస్థలం ప్రైవేటు వ్యక్తులకు ఇస్తారు. ఇంజనీరింగ్ కళాశాల మైదానం ప్రస్తుతం అధ్వానంగా ఉంది. ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఇటీవల తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహించిన విషయం తెలిసింది. మహానాడుకు ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్, రెండు టెలిఫోన్ టవర్లు, బయోటాయిలెట్లు అక్కడే వుంచేశారు. మహానాడు కాంట్రాక్టు తీసుకున్న కాంట్రాక్టరు వీటిని తీసుకెళ్లాలి. అయితే మైదానం యథావిధిగా ఇస్తామని చెప్పిన టీడీపీ వర్గాలు కూడా పట్టించుకోలేదు. ఏయూ పాలకులు టీడీపీకి లేఖ రాసినా ఫలితం లేకపోయింది. మైదానం అధ్వానంగా ఉండడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్ కళాశాల మైదానం సభలు, సమావేశాలు, ఎగ్జిబిషన్లకు ఇవ్వరాదని నిర్ణయించారు. ఇంకా సౌత్ క్యాంపస్‌లో గోల్డెన్ జూబ్లీ మైదానం కూడా బయట వ్యక్తులకు ఇవ్వరాదని నిర్ణయం తీసుకున్నారు. రెండు ప్రధాన మైదానాలను పూర్తిగా క్రీడలకు కేటాయిస్తారు. ఈ ఏడాదిలో సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ, టెన్నిస్ పోటీలకు ఏయూ వేదికగా నిర్ణయించారు. దక్షిణ భారత దేశం లోని అనేక విద్యా సంస్థల నుంచి క్రీడాకారులు రానున్న నేపథ్యంలో రెండు ప్రధాన మైదానాలను అందుకు తగ్గట్టుగా అభివృద్ధి చేస్తారు. ఇంజనీరింగ్ కళాశాల మైదానానికి ఉత్తర వైపున ప్రధాన రోడ్డును ఆనుకుని గోడ, లోపల చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మిస్తారు. క్రికెట్ పోటీలకు అనుగుణంగా మైదానం అభివృద్ధికి నిధులు కేటాయించారు. రూ.1.7 కోట్లతో గోల్డెన్ జూబ్లీ మైదానం అభివృద్ధి, జిమ్, విద్యార్థులకు హాస్టల్ నిర్మాణం చేపడుతున్నారు. టోర్నమెంట్లు లేని సమయాల్లో రెండు ప్రధాన మైదానాలను పిల్లలకు క్రీడల కోసం కేటాయిస్తారు. వర్సిటీతోపాటు బయట విద్యార్థులు, యువకులు క్రికెట్, ఫుట్‌బాల్, ఇతర క్రీడలకు అవకాశం ఇస్తామని ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు తెలిపారు. వైవీఎస్ మూర్తి ఆడిటోరియం పక్కనున్న ఖాళీ స్థలం, ఉన్నతపాఠశాల సమీపంలో ఖాళీ స్థలంలో సభలు, ఎగ్జిబిషన్ల నిర్వహణకు అనుమతి ఇస్తామన్నారు. అయితే ఇప్పటికే ఎవరైనా కార్యక్రమాల నిర్వహణకు డబ్బులు చెల్లించి వుంటే వారికి అవకాశం ఇస్తామన్నారు. కాగా ప్లాటినం జూబ్లీ అతిథి గృహం వివాహాలు, ఇతర విందులకు ఇవ్వరాదని నిర్ణయించారు. అకడమిక్‌కు సంబంధించిన సదస్సులు, గోష్ఠిలు, ప్రదర్శనలకు మాత్రం అతిథిగృహం హాళ్లు కేటాయిస్తారు. ఇటీవల వివాహాలకు కేటాయించడంతో అతిథిగృహం పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. ఇతర వర్సిటీల నుంచి వచ్చే ఆచార్యుల బస, అకడమిక్ కార్యక్రమాల కోసం నిర్మించిన గెస్ట్‌హౌస్‌లో ఇతర కార్యక్రమాలను అనుమతించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో పాలకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. అయితే ఎంతో ఉదారతతో పూర్వ విద్యార్థి కుటుంబం నిర్మించిన వైవీఎస్ మూర్తి ఆడిటోరియం పెళ్ళిళ్లకు ఇవ్వాలని కొందరు ఉద్యోగులు ఒత్తిడి తీసుకురావడంతో పాలకులు అప్రమత్తమయ్యారు. కేవలం విద్యావిషయాల కోసం నిర్మించిన ఆడిటోరియాలు, అతిథి గృహాల కేటాయింపులో కఠినంగా వుండాలని నిర్ణయించారు. భవిష్యత్తులో కాన్వొకేషన్ హాలు, అసెంబ్లీ హాలు కేటాయింపుపై మార్గదర్శకాలు రూపొందించాలని పాలకులు నిర్ణయించారు.

జిల్లా రజక సంఘం మహాసభలు రేపు

చోడవరం టౌన్: పట్టణంలోని పెదబజారువీధి కళాసీ కల్యాణ మండపంలో ఈ నెల 23న రూరల్ జిల్లా రజక మహాసభలను నిర్వహిస్తామని సంఘం రూరల్ జిల్లా అధ్యక్షుడు చల్లపల్లి రామకోటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, రజకులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మహాసభలో చర్చిస్తామన్నారు. ప్రధానంగా రజకులకు రుణాల మంజూరు, వారిని ఎస్సీ జాబితాలో చేర్చడం, 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్ తదితర అంశాలపై చర్చిస్తామని చెప్పారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ సుకుమార వర్మ, వాషర్ మన్ ఫెడరేషన్ చైర్మన్ రాజమండ్రి నారాయణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు పి.అంజిబాబు, జిల్లాలోని రజక సంఘం నాయకులు, సభ్యులు హాజరవుతారని ఆయన తెలిపారు.

భవనాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు

వుడా వీసీ బసంత్‌కుమార్



విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థ (వుడా) కూడా భవన నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు ఇవ్వనున్నదని వైస్ చైర్మన్ బసంత్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. వుడా పరిధిలోకి వచ్చే నాలుగు జిల్లాల్లోను జి+కి మించి భవనాలు నిర్మించేవారు ఎవరైనా సరే వుడా నుంచే అనుమతి పొందాల్సి వుంటుందని చెప్పారు. వుడా దగ్గర పేర్లు నమోదు చేయించుకున్న సాంకేతిక నిపుణుల సహకారంతో భవన నిర్మాణం వివరాలు అప్‌లోడ్ చేయించాలని, 24 గంటల్లోనే వారికి ప్రాథమిక అనుమతులు మంజూరవుతాయన్నారు. గతంలో మాదిరిగా వాటిని పరిశీలించడానికి ఎక్కువ సమయం తీసుకునే అవకాశం సిబ్బందికి వుండదని, వెంటవెంటనే ఆ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించి, ఫొటోలు తీసి డిజిటల్ సంతకంతో అప్‌లోడ్ చేయాల్సి వుంటుందన్నారు. నిర్మాణదారుడు రెండు ఫీజులకు సంబంధించిన రెండు చలానాలు కట్టిన తరువాత అన్నీ సక్రమంగా వుంటే పూర్తిస్థాయి అనుమతులు మంజూరవుతాయని వివరించారు.

ఈ ఆన్‌లైన్ విధానం అమలు చేయడానికి వుడాకు సంబంధించిన పూర్తి సమాచారం (మాస్టర్ డేటా) వెబ్‌సైట్‌కు ఫీడ్ చేస్తున్నారని, దీనికి పూణేకు సంబంధించిన సాఫ్ట్ టెక్ నిపుణుల సహకారం తీసుకుంటున్నామన్నారు. ఈ అనుమతులకు సంబంధించిన వివరాలపై దరఖాస్తుదారుడికి ఎప్పటికప్పుడు సమాచారం ఎస్ఎంఎస్‌ల రూపంలో వెళుతుందన్నారు. ఈ విధానాన్ని జిల్లా మంత్రితో వారం రోజుల్లో ప్రారంభిస్తామని స్పష్టంచేశారు. ఇందులో లోటుపాట్లను గమనించి, ఆ తరువాత లేఅవుట్లకు కూడా ఆన్‌లైన్ విధానం తీసుకువస్తామని పేర్కొన్నారు.

బీచ్‌లో రూ.9 కోట్లతో ఫుట్‌పాత్‌లు

విశాఖపట్నంలో తెన్నేటి పార్క్ నుంచి రుషికొండ ఐటీ సెజ్ వరకు ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి రూ.9 కోట్లు కేటాయించామని వుడా వీసీ తెలిపారు. ఈ పనులు దశలవారీగా చేపడతామన్నారు. సమావేశంలో చీఫ్ ఇంజనీర్ చంద్రయ్య, వుడా సీయూపీ భవానీ శంకర్, ఎస్టేట్ అధికారి వసంతరాయుడు, పీఓలు దేవి కుమారి, రెవెన్యూ సలహాదారు రెడ్డి పాల్గొన్నారు.

అనకాపల్లి మార్కెట్ ధరలు

కూరగాయలు (కిలో)



ఉల్లిపాయలు	రూ.35
బంగాళదుంపలు	రూ.15
టొమేటో	రూ.50
వంకాయలు(తెల్లవి)	రూ.30
వంకాయలు(నల్లవి)	రూ.30
బీరకాయలు	రూ.30
బెండకాయలు	రూ.30
దొండకాయలు	రూ.30
క్యారెట్	రూ.40
క్యాబేజీ	రూ.25
బీన్స్	రూ.70
కొబ్బరి కాయ(చిన్నది)	రూ.10
కొబ్బరికాయ(పెద్దది)	రూ.15
బీట్‌రూట్	రూ.40
మిర్చి	రూ.50
చిక్కుడు	రూ.--
గోరుచిక్కుడు	రూ.30
బరబాటీ	రూ.40
అల్లం	రూ.60
చేమదుంపలు	రూ.40
దోసకాయ	రూ.30
కాకరకాయలు	రూ.40
ఆనపకాయ(చిన్నది)	రూ.10
ఆనపకాయ(పెద్దది)	రూ.15
అరటికాయలు (మూడు)	రూ.20


పప్పు దినుసులు (కిలో)

కందిపప్పు	రూ.65
పెసరపప్పు	రూ.65
మినపపప్పు	రూ.70
శనగ పప్పు	రూ.75
పంచదార	రూ.44
ఇడ్లీనూక	రూ.30
గోధుమ రవ్వ	రూ.34
చింతపండు	రూ.100
మైదా	రూ.28

నూనె ధరలు (లీటర్)

పామోలిన్	రూ.62
సన్‌ఫ్లవర్	రూ.82
వేరుశనగ	రూ.120
కొబ్బరి	రూ.120
డాల్డా (కిలో)	రూ.70

కోడి గుడ్లు(నెక్)



వంద గుడ్లు రూ.లలో

విశాఖపట్నం	362
విజయనగరం	366
శ్రీకాకుళం	366

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	బ్యాగ్
లైవ్ ధర	93.00	90.00
విత్ స్కిన్	130.00	150.00
స్కిన్ లెస్	153.00	160.00

బెల్లం ధరలు(రూ.లలో)

	కనిష్ఠ	గరిష్ఠ
మొదటి రకం	3605	4220
రెండో రకం	3330	3765
మూడో రకం	3050	3270

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 4, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వృత్తి, వ్యాపారాల్లో సృజనాత్మంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సహోద్యోగులతో విందు వినోదాల్లో పాల్గొంటారు. ప్రియతముల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): చిన్నారులు, ప్రియతముల కలయిక ఆనందం కలిగిస్తుంది. సంతానం విషయంలో శుభపరిణామాలు సంభవం. పొదుపు పథకాలు, చిట్‌ఫండ్‌లకు అనుకూలం. ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.

మిథునరాశి: (మే21-జూన్21): రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారు కీలక సమాచారం అందుకుంటారు. బదిలీలు, మార్పులకు అనుకూలం. ఇంటికి అవసరమైన వస్తువులు రవాణా అవుతాయి. విద్యా సంస్థల్లో ప్రవేశం లభిస్తుంది.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): సోదరీ సోదరుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. బోధన, రవాణా, స్టేషనరీ, కమ్యూనికేషన్ల రంగా వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. విలువైన పత్రాలు చేతికి అందుతాయి.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): పెట్టుబడులపై దృష్టి సారిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సినీ, రాజకీయ రంగాల వారు కొత్త ప్రాజెక్టులు ప్రారంభిస్తారు. కొంతకాలంగా వెంటాడుతున్న స్తబ్దత తొలగిపోయి మనసు ప్రశాంతంగా ఉంటుంది. విరామ కాలక్షేపాలు ఉల్లాసం కలిగిస్తాయి.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): దీర్ఘకాలికి పెట్టుబడులకు అనుకూలం. సినీ రాజకీయ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకంగా ఉంటుంది. ఆడిటింగ్, బ్యాంకింగ్ రంగాల వారికి ప్రోత్సాహకరం. విరాళాలు, చందాలకు వెచ్చిస్తారు.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): బృందకార్యక్రమాల్లో ప్రముఖులను కలుసుకుంటారు. ఆర్థిక విషయాల్లో లక్ష్య సాధనకు పెద్దల సహకారం లభిస్తుంది. సమావేశాల్లో గౌరవ, మన్ననలు అందుకుంటారు. సంకల్పం నెరవేరుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): వృత్తి, వ్యాపారాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. రక్షణ, న్యాయ, బోధన రంగాల వారికి వృత్తిపరంగా ప్రోత్సాహకరం. గౌరవ పదవులు అందుకుంటారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఆర్థికపరమైన వ్యూహాలు ఫలిస్తాయి. రక్షణ, న్యాయ, బోధన రంగాల వారికి నిధులు సర్దుబాటవుతాయి. ప్రయాణాలకు ఏర్పాట్లు చేసుకుంటారు. పెట్టుబడులకు సంబంధించిన పత్రాలు అందుకుంటారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): క్రయవిక్రయాలకు అనుకూలం. బీమా, గ్రాట్యుటీ, పన్నుల వ్యవహారాలు పూర్తి చేస్తారు. భాగస్వామి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. శ్రీవారు, శ్రీమతి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): భాగస్వామి సహకారంతో వృత్తిపరమైన లక్ష్యాలు సాధిస్తారు. విందులు, వేడుకల్లో పాల్గొంటారు. జనసంబంధాలు విస్తరిస్తాయి. స్నేహానుబంధాలు బలపడతాయి. సంకల్పం నెరవేరుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

టంగ్ ట్విస్టర్స్

1. Farrell's features fablous food 'n' fantastic fountain fantasies for frolicking, fun-filled festive families.
2. Thomas Tattamus took two T's to tie two tots to two tall trees.
3. The Final Fixing of the Foolish Fugitive

సూక్తి

మానవుడు ఎంత గొప్పవాడు అయితే.. అంత కఠినమైన పరీక్షలు దాటవలసి ఉంటుంది.

నవ్వుల్ నవ్వుల్

సాంబా : వాస్తు తెలిసిన డాక్టరు దగ్గరకు వెళ్లడం తప్పైపోయింది.

లింగం : ఏమన్నాడేంటి?

సాంబా : వాస్తు బాగాలేదు. గుండె వేరే ప్రదేశానికి మార్చమంటున్నాడు.

లింగం : !!!!!!!!

పదాలు కనుక్కోండి

w	f	a	k	o	i	x	h	p	k
a	i	b	r	e	l	l	i	m	f
r	z	s	p	i	n	n	i	n	g
t	r	i	c	k	d	l	o	g	q
s	k	s	d	f	p	o	t	k	h

gold
straw
miller
trick
spinning



ముళ్లతో ఉండే గులాబీలు ఎవరికి ఏ హానీ చేయవు.. బురదలో పుట్టే కమలం సుగంధ పరిమళాల్నే వెదజల్లుతుంది. కానీ విషపూరితమైన పువ్వులను, చెట్లను చూశారా? ఆ చెట్లను ముట్టుకున్నా, వాటి గాలి పీల్చినా ప్రాణాలు పోవాల్సిందే. అలాంటి విష పూరిత చెట్లతో ఇంగ్లాండ్‌లో 'పాయిజన్' అనే ఓ పూదోట ఉంది. ఆ విశేషాలు..



పాయిజన్ ప్లాంట్స్

పాయిజన్ గార్డెన్‌లోని రకరకాల రంగు రంగుల పూలు ఇంగ్లాండ్ వాసుల్ని రారమ్మని స్వాగతం పలుకుతాయి. కానీ ఆ పూదోట గేటుపై 'ఈ చెట్లు మిమ్మల్ని చంపేస్తాయి' అని రాసుంటుంది. అంతేకాదు గేటు దాటి లోపలికి అడుగు పెట్టగానే 'ఈ పూలను తుంచకూడదు, ముట్టుకోకూడదు, ఇక్కడి గాలి కూడా పీల్చకూడదు. పిల్లలు ఈ చెట్లకు వీలైనంత దూరంగా ఉండాలి' అంటూ పుర్రె గుర్తుతో ఉన్న ఓ బోర్డు ' డేంజర్ ' అంటూ మిమ్మల్ని హెచ్చరిస్తుంది. ఈ పాయిజన్ గార్డెన్‌లో అనేక ఆకర్షణలున్నాయి. ట్రీ హౌస్,



అందమైన ఫౌంటెయిన్స్, గులాబీ, టోపీరియ పూల వనాలు అందరిని ఆకట్టుకుంటాయి. పూదోట మధ్యలో ఉండే వాటర్ క్యాస్కెడ్ మరో ప్రధాన ఆకర్షణ. ప్రతి సంవత్సరం వేలాది మంది సందర్శకులు ఈ పూదోటను చూడటానికి వస్తుంటారు.

మొక్కలయందు విషపు మొక్కలు వేరు..

దాదాపు 100 విషపూరిత మొక్కలు ఈ పూదోటలో ఉన్నాయి. ఈ మొక్కలున్న చోట ప్రమాద హెచ్చరిక బోర్డుతో పాటు వాటి చుట్టూ కంచె ఉంటుంది. వీటి గురించి వివరాలు తెలపడానికి గైడ్లు ఉంటారు. ఈ విషపూరిత మొక్కలపై పరిశోధనలు కూడా చేస్తుంటారు. వీటిని మెడిసిన్ తయారీలో ఉపయోగిస్తారు. ఈ విషపూరిత మొక్కల గురించి తెలియజేసే పుస్తకాలు ఈ పూదోటలోని బుక్ షాప్‌లో లభిస్తాయి.

ప్రకృతిలో నడక

పూదోటలో వుడ్‌ల్యాండ్ వాక్ బాగుంటుంది. అందమైన ప్రకృతి సాక్షిగా వేవేల వర్ణాల పువ్వుల మధ్యలో వెళ్లడం ఓ మధురానుభూతి. ఈ దారిలోనే ట్రీ హౌస్ ఉంటుంది. ఇది సందర్శకులను ప్రధానంగా ఆకర్షిస్తుంది. చెట్లపై ఉండే ఈ ట్రీహౌస్‌లో ఓ రెస్టారెంట్ ఉంటుంది. చవులూరించే స్థానిక ఆహార పదార్థాలెన్నో ఉంటాయి.






పువ్వుల్లో దాగున్న...

అక్విలేజియా : ఈ మొక్క వేర్లు, విత్తనాలు చాలా విషపూరితమైనవి.

అట్రోపా బెల్లడోన : ఈ మొక్క మరింత విషపూరితమైనది. ఇది చాలా ప్రమాదకరమైన మొక్క. దీని వాసన పీల్చడం వల్ల శ్వాసలో ఇబ్బందులు వస్తాయి. అంతేకాదు హృదయం వేగంగా కొట్టుకుంటుంది.

బ్రగ్మాన్సియా, డిజిటాలిస్, రిసినస్ కొమ్యునిస్, నక్స్ వామిక, హెమ్‌లాక్ వంటి మొక్కలు కూడా ప్రమాదకరమైనవే.

బొమ్మ గీయండి



జంతర్‌మంతర్

1. సఆక్తి ► ....
2. డిరాబ ► ....
3. వియంష ► ....
4. క్కువఎ ► ....


జంబ్లింగ్ వర్డ్స్

1. HNTU ► ....
2. MBOB ► ....
3. WODO ► ....
4. DETI ► ....


రంగులు అద్దండి



దారి కనుక్కోండి



ఔనా!



వాహనాలకు సరైన పార్కింగ్ దొరకాలని అమెరికాలో 7 శాతం మంది ప్రార్థన చేస్తారు.

చెప్పగలరా?

విరిలో ఉన్నా
కానీ పురిలో లేను
లుప్తంలో ఉన్నా
కానీ గుప్తంలో లేను
వరిలో ఉన్నా
కానీ గిరిలో లేను
అయితే ఇంతకీ
నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?



తేనె తిన్న తర్వాత కేవలం 20 నిమిషాల్లోనే రక్తంలో కలిసిపోతుంది.

జవాబులు

చెప్పగలరా? : విలువ
జంతర్‌మంతర్
1. ఆసక్తి 2. రాబడి
3. విషయం 4. ఎక్కువ
జంబ్లింగ్ వర్డ్స్ :
1.HUNT 2.BOMB
3.WOOD 4.TIDE

ఆంధ్రజ్యోతి
16
విశాఖపట్నం
మంగళవారం 22 ఆగస్టు 2017



తిరుమల సమాచారం



వసతి గదులు: రూ.500 : అక్టోబర్ 23 నుంచి డిసెంబర్ 20 వరకు ఉన్నాయి.
రూ.100 : అక్టోబర్ 23 నుంచి డిసెంబర్ 20 వరకు ఉన్నాయి.
శ్రీనివాసమ్: అక్టోబర్ 23 నుంచి డిసెంబర్ 20 వరకు ఉన్నాయి.
రూ.300 దర్శనం : సెప్టెంబర్ 6 నుంచి నవంబర్ 30 వరకు ఉన్నాయి. (మధ్యలో సెప్టెంబర్ 19, 23, 27, 28, 29, 30, అక్టోబర్ 1, 7, 14 తప్ప)
రూ.50 దర్శనం : ఖాళీలు లేవు.
ఆర్జిత సేవలు : అక్టోబర్ 22వ తేదీ ఉన్నాయి.

రైల్వే సమాచారం



రైళ్ల రాకపోకల వేళలు, రిజర్వేషన్ ఖాళీల వివరాలు, టికెట్ చార్జీలు,
ఇతర సమాచారం కోసం... 139
ప్రయాణికుల భద్రతకు రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) టోల్ ఫ్రీ నంబరు 182
అనకాపల్లి ఆర్పీఎఫ్ పోస్ట్ ఫోన్... 08924-226965

ఆర్టీసీ సమాచారం



అనకాపల్లి ఎంక్వైరీ 77300 37027
నర్సీపట్నం ఎంక్వైరీ 94932 11969
పాడేరు ఎంక్వైరీ (డీఎం) 73829 14859



రాష్ట్రస్థాయికి ఎంపికైన సాయితేజను అభినందిస్తున్న మురళి

రాష్ట్ర స్థాయి యోగాకు విద్యార్థుల ఎంపిక

చోడవరం/ బుచ్చెయ్యపేట : పట్టణంలోని రవి కాన్వెంట్‌లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి జంగం సాయి తేజ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. విశాఖలోని సీతమధార శ్రీకృష్ణ మందిరంలో జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీలలో 8 నుంచి 11 సంవత్సరాల విభాగంలో సాయితేజ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించడంతో పాటు, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా అతనిని కాన్వెంట్ కరస్పాండెంట్ బంటు మురళి, ఏవో శేఖర్, యోగా శిక్షకుడు పుల్లేటి సతీష్‌లు అభినందించారు.

అలాగే, బుచ్చెయ్యపేటలోని జాజిమొగ్గల ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి ఒమ్మి మోహనరావు కూడా రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. ఐదో తరగతి చదువుతున్న మోహనరావు జిల్లాస్థాయి పోటీల్లో రాణించంతో వచ్చే నెల 9నుంచి తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు అర్హత సాధించాడని స్కూల్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు తెలిపారు.



బుచ్చెయ్యపేట పాఠశాల నుంచి ఎంపికైన మోహనరావు



ఘాట్ రోడ్డులోని అమ్మవారి పాదాల వద్ద..



పాడేరు ఘాట్‌లో వ్యూపాయింట్ వద్ద భారీగా కురుస్తున్న వర్షం

కొండపై కుండపోత

- పాడేరు ఘాట్‌లో భారీ వర్షం
- చుట్టూ కమ్ముకున్న పొగమంచు
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- ఖరీఫ్‌కు నీటి సమస్య తీరిందని రైతులు ఆనందం



మినుములూరు వరి పొలాల్లో చేరిన నీరు

పాడేరు : వాతావరణంలో మార్పుల కారణంగా పాడేరు ఘాట్‌లో సోమవారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎండ కాసినప్పటికీ, ఆ తర్వాత ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. అదే సమయంలో పొగమంచు కమ్ముకుంది. అనంతరం భారీ వర్షం పడింది. దీంతో వర్షపు నీరు ఏరులా కిందకు ప్రవహించింది. దారి కనిపించక కొందరు వాహనచోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. ఘాట్ మినుములూరు, రాజాపురం, వ్యూపాయింట్, డైమండ్ పార్కు, వంట్ల మామిడి ప్రాంతాల్లో వాన మరింత కుమ్మింది. పాడేరు పట్టణంలో చినుకులు పడ్డాయి.

ఖరీఫ్‌కు కరవు తీరా నీరు

పాడేరు ఘాట్, పరిసరాల్లో సోమవారం కురిసిన వర్షంతో పాటు గత ఐదు రోజులుగా అక్కడక్కడ పడుతున్న వానలతో ఏజెన్సీలో ఖరీఫ్ పంటలకు నీటి సమస్య తప్పిందని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇక్కడ మెట్ట ప్రాంతాల్లో వేసిన రాగులు, వేరుశెనగ, బంతిపూలు తదితర పంటలకు సైతం నీటి సమస్య తీరినట్లైందని వ్యవసాయాధికారులు చెపుతున్నారు.

జాతీయ స్థాయి కరాటేకు స్వరూప్

అనకాపల్లి టౌన్ : ఛత్తీస్‌ఘడ్‌లో వచ్చే నెలలో జరగనున్న జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు అనకాపల్లికి చెందిన స్వరూప్‌చౌదరి అర్హత సాధించాడు. గాజువాక రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో బ్లాక్ బెల్ట్ దక్కించుకోవడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని కరాటే, కిక్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి, కోచ్ పీయువీ మహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా కరాటే గ్రాండ్ మాస్టర్ ఆనందబాలు నుంచి బ్లాక్ బెల్టు సర్టిఫికెట్ అందుకున్నట్టు చెప్పారు. స్వరూప్‌చౌదరి అనకాపల్లి న్యాయమూర్తి జేవీవీఎస్ మూర్తి తనయుడని పేర్కొన్నారు.



బ్లాక్ బెల్టు సర్టిఫికెట్ అందుకుంటున్న స్వరూప్ చౌదరి

చూడచక్కని చింతపల్లి

చింతపల్లి- లంబసింగి ప్రధాన రహదారి ఓ సీనరీని తలపిస్తోంది. కళాకారుడు కుంచె నుంచి జాలువారిన చిత్రం వలే ప్రకృతి రమణీయత ఉట్టిపడుతోంది. పచ్చని అడవికి శ్వేతవర్ణపు చీర కట్టినట్టుగా ఉన్న ఈ దృశ్యాలు సోమవారం ఆవిష్కృతం కావడంతో పర్యాటకులు ఈ అందాలను తమ కెమెరాల్లో బంధించారు. - చింతపల్లి





రాష్ట్రంలో వరి సాగుకు ఢోకా లేదు

- మినీకిట్‌ల దశలో కొత్త వరి రకాలు
- ముంపు తట్టుకునే రకాల రూపకల్పన
- ఆంధ్రప్రదేశ్ వరి పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ



అనకాపల్లి అగ్రికల్చర్ : విశాఖ, విజయనగరం వంటి కొన్ని జిల్లాల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వరినాట్లు ఆలస్యమవుతున్నా గోదావరి, కృష్ణా, గుంటూరు, శ్రీకాకుళం జిల్లాల్లో వరి పరిస్థితి బాగానే ఉందని ఏపీ వరి పరిశోధన సంస్థ డైరెక్టర్ (మార్టేరు) వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పాలడగు వెంకట సత్యనారాయణ తెలిపారు. ఇక్కడి ఆర్ఏఆర్ఎస్‌లో సోమవారం ఆ విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబర్ మొదటి వారం వరకు వరినాట్లకు సమయమున్నందున, వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రాష్ట్రంలో వరి సాధారణ విస్తీర్ణం తగ్గకపోవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 20.5 లక్షల హెక్టార్లలో వరి సాగవుతోందని, ఖరీఫ్ రబీలలో 115 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతోందని చెప్పారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇంతవరకు 16 లక్షల హెక్టార్లలో వరి నాట్లు పూర్తయ్యాయని వివరించారు. రాష్ట్రంలో 30 రకాల వరి వంగడాలు ప్రాచుర్యంలో ఉన్నప్పటికీ వీటిలో బీపీటీ 5204, ఎంటీయూ 1010, ఎంటీయూ 1001, ఎంటీయూ 1061, ఎంటీయూ 1075, ఎంటీయూ 1121, స్వర్ణ, ఎన్ఎల్ఆర్ 34449, ఆర్‌జీఎల్ 2337 (శ్రీకాకుళం సన్నాలు) అనే తొమ్మిది రకాలు అధిక విస్తీర్ణంలో సాగవుతున్నాయని చెప్పారు.

కొత్త రకాలపై పరిశోధన

మారుతున్న వాతావరణ పరిస్థితులు, సాగు పద్ధతులు, చీడపీడలు, వినియోగదారుల అభిరుచుల్లో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని కొత్త వరి రకాలపై పరిశోధనలు జరుపుతున్నామని సత్యనారాయణ చెప్పారు. ముంపును తట్టుకొనే ఎంటీయూ 1140, ఎంటీయూ 1184 రకాలను రూపొందించామని, అలాగే మధ్యకాలిక, దీర్ఘకాలిక రకాలకు చెందిన 1187, 1224, 1210, 1229, 1226, 1262 అనే మార్టేరు రకాలను కూడా రూపొందించామని, ప్రస్తుతం ఇవన్నీ మినీకిట్‌ల దశలో ఉన్నాయని వివరించారు. మరిన్ని పరిశీలనల అనంతరం వీటిని విడుదల చేస్తామని చెప్పారు. వీటిలో చాలా రకాలు వెదజల్లే పద్ధతికి కూడా అనువైనవేనన్నారు. రాష్ట్ర సగటు వరి ఉత్పాదకత రేటుతో పోల్చితే విశాఖ, విజయనగరం జిల్లాల్లో ఉత్పాదకత రేటు తక్కువగా ఉందన్నారు. రాష్ట్ర ఉత్పాదకత రేటు హెక్టారుకు 5.2 టన్నులు ఉండగా ఈ రెండు జిల్లాల్లో 3.8 టన్నులు మాత్రమే ఉందన్నారు. దీనిని కనీసం నాలుగు టన్నులకు పెంచేందుకు కృషి జరుగుతోందని పేర్కొన్నారు. హైబ్రీడ్ వరిపై పరిశోధనలు జరుగుతున్నాయని వివరించారు.

జర్రెల బస్సును పునరుద్ధరించాలి

గూడెంకొత్తవీధి: జర్రెల ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని సర్పంచ్ అడపా విజయకుమారి తెలిపారు. రహదారి బాగులేదని బస్సును నిలిపి వేయడంతో ప్రైవేటు వాహనాల్లో ప్రాంతీయులు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. దీంతో అదనపు చార్జీలు వసూలు చేయడంతో పాటు అందుబాటులో వాహనాలు ఉండడం లేదన్నారు. ప్రస్తుతం రహదారి బాగుందని, బస్సును యథాతథంగా నడపాలని ఆమె కోరారు.

ఇంటికి చేరుతున్న దీపం



జీసీసీ గోదాములో ఉన్న గ్యాస్ సిలిండర్లు


సిలిండర్లు పంపిణీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆదివాసీ కుటుంబాల్లో దీపం పథకం వెలుగులు నింపుతోంది. చాలా ఇళ్లల్లో కట్టెల పొయ్యిలకు కాలం చెల్లుతోంది. పొగ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలితంగా గ్యాస్‌తో వంట చేసుకునే అవకాశం లభిస్తోంది.

అర్హులందరికీ ఉచిత గ్యాస్ కనెక్షన్లు
సబ్ డివిజన్‌లో 15,091 సిలిండర్ల పంపిణీ లక్ష్యం
మూడు మండలాల్లో 5,369 మందికి అందజేత
పంపిణీ సిద్ధంగా మరో 3,354 సిలిండర్లు

చింతపల్లి: గిరిజన ప్రాంతాల్లో ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమం రెండు నెలలుగా అమలు జరుగుతోంది. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి దీపం పథకం కింద గ్యాస్ సిలిండర్, స్టవ్‌లను అధికారులు ఉచితంగా అందిస్తున్నారు. చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో తొలి విడతగా 5369 కనెక్షన్లను పంపిణీ చేశారు. కొయ్యూరు, చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లోని గిరిజనులకు ఈ కనెక్షన్లను అందించారు.

పంపిణీకి సిద్ధంగా 3,354 కనెక్షన్లు

చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో 15,091 కనెక్షన్లు అందించాలని అధికారులు నిర్ణయించారు. చింతపల్లి మండలంలో 4,602, గూడెంకొత్తవీధిలో 9,236, కొయ్యూరులో 1,253 కుటుంబాలను ఇందుకోసం ఎంపిక చేశారు. ఇప్పటివరకూ 5369 కనెక్షన్లను పంపిణీ చేశారు. ఇందులో చింతపల్లి మండలానికి 2,622, జీకే వీధికి 2,337, కొయ్యూరుకు 410 కనెక్షన్లను ఉన్నాయి. అలాగే మరో 3,354 కనెక్షన్లను పంపిణీకి అధికారులు సిద్ధం చేశారు. ఇందులో చింతపల్లి మండలానికి 1714, జీకేవీధి 1340, కొయ్యూరు 300 కనెక్షన్లు అందించనున్నారు. మిగిలిన కనెక్షన్లు కూడా త్వరితగతిన పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.


పంపిణీకి సిద్ధం చేసి గ్యాస్ బండలు

జీసీసీ డిపోల ద్వారా సిలిండర్ల పంపిణీ

గిరిజనులకు ఒకేసారి అధిక మొత్తం చెల్లించి 14.5 కిలో సిలిండర్లు కొనుగోలు చేసుకోలేరనే ఉద్దేశంతో ప్రభుత్వం ఐదు కిలోల సిలిండర్లను అందిస్తున్నది. దీని ధర రూ.250-300 మధ్య ఉంటుంది. ఈ సిలిండర్‌ను ఒక వ్యక్తి సులభంగా తీసుకుని వెళ్లిపోవచ్చు. వీటి కోసం వినియోగదారులు చింతపల్లి గోదాముకు వచ్చి తీసుకోవాలంటే ప్రయాణపు ఖర్చులతో పాటు సమయం కూడా వృధా అవుతోంది. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు ప్రతీ జీసీసీ డీఆర్ డిపో ద్వారా గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో సిలిండర్ మార్చుకునేందుకు జీసీసీ డిపోకు వెళ్తే సరిపోతుంది.

పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేశాం



దీపం కనెక్షన్లు వేగవంతంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు చింతపల్లిలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశాం. ప్రతి రోజూ ఆరుగురు కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్ చేసి బాండ్లను తయారు చేస్తున్నారు. హెచ్‌పీ కంపెనీ కూడా ఐదు కిలోల గ్యాస్ సిలిండర్లను పూర్తి స్థాయిలో సరఫరా చేయలేకపోతోంది. ఈ కారణంగా కొంత జాప్యం జరుగుతోంది. అర్హులందరికీ ఈ కనెక్షన్లను అందజేస్తున్నాం.

-ఎంవీవీ.ప్రసాద్, సీఎస్‌డీటీ

అదనపు సిలిండర్ ఇస్తేనే ఉపయోగం



గ్యాస్ కనెక్షన్లు ఇస్తుండడంతో జీసీసీ ద్వారా కిరోసిన్ పంపిణీ నిలిపి వేశారు. దీంతో గ్యాస్ అయిపోగానే పొయ్యి వెలిగించాలంటే మరో సిలిండర్ అందుబాటులో ఉండాలి. లేకపోతే జీసీసీ డిపో వద్దకు వెళ్లి సిలిండర్ మార్చుకునేవరకూ కట్టెల పొయ్యిపైనే వండుకోవాల్సి వస్తోంది. ఈ సమస్యను అధికారులు గుర్తించి, అదనంగా మరో సిలిండర్ మంజూరు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది.

-సాగిన దేవుడమ్మ, సర్పంచ్, చింతపల్లి

రైతురథంలో 132 ట్రాక్టర్లు

వ్యవసాయ శాఖ ఏడీ శంకర్‌రెడ్డి

పాడేరు రూరల్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతురథం పథకంలో మన్యానికి 132 ట్రాక్టర్లు మంజూరయ్యాయని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు పి.శంకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, గిరిజన రైతుల సంక్షేమానికి 50 శాతం రాయితీపై ట్రాక్టర్లు అందిస్తున్నట్టు చెప్పారు. పాడేరు నియోజకవర్గానికి 66, అరకు నియోజకవర్గానికి 66 ట్రాక్టర్లు మంజూరయ్యాయని ఆయన చెప్పారు. వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలకు 51 ట్రాక్టర్లు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వాటిని పాడేరు మండల రైతులకు 14, జి.మాడుగుల 14, ముంచంగిపుట్టు 12, పెదబయలు 11 మంది రైతులకు అందిస్తామని చెప్పారు. రెండు ఎకరాలు వ్యవసాయ భూమి ఉన్న వారు ఇందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆధార్ కార్డు, పట్టాదారు, బ్యాంకు పాస్ పుస్తకాలు, మీ-సేవలో పొందిన కుల ధ్రువీకరణ పత్రం, మూడు ఫాస్ ఫొటోలతో ఈ నెల 31వ తేదీలోగా ఆయా మండలాల వ్యవసాయ శాఖ కార్యాలయాలకు వెళ్లి రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏడీ సూచించారు. అనంతరం మీ సేవలో రూ.వెయ్యి చెల్లించి రైతు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. రూ.3 లక్షల విలువైన ట్రాక్టర్‌కు ప్రభుత్వం రూ.1.5 లక్షలు వేలు రాయితీ ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీ కోరారు.

నేటి నుంచి 'సంకల్ప టు సిద్ధి మూమెంట్'

కొయ్యూరు: మండలంలో మంగళవారం నుంచి సంకల్ప టు సిద్ధి మూమెంట్ కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీవో ఇమ్మానుయేలు తెలిపారు. ఇందులో భాగంగా మూడు రోజుల పాటు స్వచ్ఛభారత్ నిర్మాణం, పేదరికం-అవినీతి రహిత దేశంగా తీర్చిదిద్దడం తదితర అంశాలపై ప్రతి ఒక్కరితోనూ ప్రతిజ్ఞ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని కోరారు.

క్రీడా రంగంపై యువత ఆసక్తి చూపాలి

సీఐ వెంకట విజయ్‌కుమార్

జి.మాడుగుల: మారుమూల గ్రామాల్లోని యువత క్రీడా రంగంపై ఆసక్తి కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని సీఐ వెంకట విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని లువ్వాసింగి పంచాయతీ కేంద్రంలో సోమవారం కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యువకులకు వాలీబాల్ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో సుమారు 30 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు బహుమతులను సీఐ ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మారుమూల గ్రామాల్లో యువతకు క్రీడా రంగాల్లో మంచి పట్టు ఉందని చెప్పారు. క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని నైపుణ్యం ప్రదర్శిస్తే ఉన్నత స్థాయికి ఎదగవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీను, పోలీసు సిబ్బంది, సర్పంచ్ పాల్గొన్నారు.


క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న సీఐ

కొండజర్తలో మౌలిక సదుపాయాలు కల్పించండి

పోలీసులకు గిరిజనుల విన్నపం

సీలేరు: కొండజర్త గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఐ విభూషణరావుకు గిరిజనులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎస్ఐను కలిసి సమస్యలు వివరించారు. గ్రామంలో 30 కుటుంబాలు జీవిస్తుండగా, 20 మందికిపైగా పిల్లలు ఉన్నారని చెప్పారు. అలాగే గర్భిణులు, బాలింతలు కూడా ఉన్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో సరిపడా సరుకులు అందించకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారానికోసారి మాత్రమే పాలు ఇస్తున్నారని, అవి కూడా పాడవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే రహదారి, విద్యుత్, మంచినీటి సదుపాయాలు లేవని చెప్పారు. చాలా మంది అర్హులు ఉన్నప్పటికీ పింఛన్ అందడం లేదని వాపోయారు. సమస్యలను పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని, గ్రామంలో సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తానని ఎస్ఐ హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్థులకు బియ్యం బస్తా అందజేశారు.


ఎస్ఐకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

సదురుమామిడిలో జ్వరాలు

జి.మాడుగుల: బొయితిలి పంచాయతీ సదురుమామి గ్రామంలో పది మంది గిరిజనులు జ్వరాలతో బాధ పడుతున్నారు. కొంత కాలంగా కనీసం వైద్య సేవలు అందించడం లేదని, దీంతో గ్రామంలో జ్వరాల ప్రబలుతున్నాయని స్థానికులు తెలిపారు. ఏఎన్ఎం కూడా గ్రామాన్ని సందర్శించడం లేదని చెప్పారు. ప్రస్తుతం పది మంది చిన్నారులతో పాటు గర్భిణులు జ్వరాలతో బాధ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వైద్య సిబ్బంది స్పందించి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు వేడుకున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

జి.మాడుగుల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండగలమని గెమ్మెలి పీహెచ్‌సీ వైద్యాధికారి నాయుడు చెప్పారు. మండలంలోని పాలమామిడి పంచాయతీ దేవరాపల్లి గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 175 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, పరిసరాలు పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవని చెప్పారు. రోగాలు ప్రబలితే ఆస్పత్రులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పట్నం గాంధీ ఆస్పత్రి నుంచి వైద్యులు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-224233
ఎంపీడీఓ	9000 01928
తహసీల్దార్	88977 01286

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	జయ జానకీ నాయక
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ)	లై
పూర్ణ	ప్రతిక్షణం

గదులు తక్కువ... విద్యార్థులెక్కువ

- ఆరుబయట, వరండాల్లోనే చదువులు
- పాతవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల అవస్థలు



వరండాలోను, ఆరుబయట కూర్చుని చదువుతున్న విద్యార్థులు

కె.కోటపాడు : మండలంలోని పాతవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు బయట చదువులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోని కారణంగా ఏళ్ళ తరబడి నేలబారు చదవులకే పరిమితమవుతన్నారు. పాఠశాలో పూర్తిస్థాయిలో వసతులు లేక విద్యార్థులు ఆరు బయటే కటిక నేలపై చదవులు కొనసాగిస్తున్నారు. తరగతి గదుల లేమితో చెట్లు కింద నానా అవస్థలూ పడుతున్నారు.

300మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో 6 నుంచి 10 తరగతుల వరకూ ఎ,బి సెక్షన్లకు సంబంధించి 10 తరగతి గదులున్నాయి. విద్యార్థుల సంఖ్యను బట్టి 10 గదులు అవసరమే. కాకపోతే ఈ గదుల్లో నాలు గింటిని ఉపాధ్యాయుల విశ్రాంతికి, సైన్స్ ల్యాబ్, లైబ్రేరీ, డిజిటల్ క్లాస్‌రూమ్‌లకు వినియోగిస్తున్నారు. తరగతి గదులు తక్కువ, విద్యార్థుల సంఖ్య అధికం కావడంతో ఉపాధ్యాయులు విద్యార్థులను వరండాల్లో, ఆరుబయట కూర్చోబెట్టి చదవులు చెబుతున్నారు. దాంతో వర్షం వస్తే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిసర గ్రామాలైన గొట్లాం, శృంగవరం, కొత్తభూమి, మర్రివలస, సూదివలస, కె.సంతపాలెం, కేకే అగ్రహారం తదితర గ్రామాల విద్యార్థులకు ఇదొక్కటే ఉన్నత పాఠశాల. పాఠశాలలో మెరుగైన విద్యను బోధించడానికి ఉపాధ్యాలున్నారు కాని తగినన్ని గదులు లేవు. దాంతో రెండు పూటలా ఆరుబయటే కూర్చోబెట్టి చదివిస్తున్నారు. వర్షం పడితే ఉపాధ్యాయులకు, విద్యార్థులకు నరక యాతనే. ఇరుకు గదుల్లో, వరండాల్లో విద్యార్థులను కూర్చోబెట్ట లేక ఒక్కో సారి పాఠశాలకు సెలవు ప్రకటించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. దాంతో పాటు పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు పాఠశాల ఆవరణలోకి ప్రవేశిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలకు అదనపు తరగతి గదులు నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

సీతాఫలాలకు గిట్టుబాటు ధర కరువు

కావిడి ధర రూ.1200 నుంచి రూ.వెయ్యికి విక్రయం



మాడుగుల సంతకు సోమవారం రైతులు తీసుకు వచ్చిన సీతాఫలాలు

మాడుగుల: మాడుగుల ఫలసాయాల సంతలో సీతాఫలాలకు సోమవారం నాటి సంతలో గిట్టుబాటు ధర లభించలేదు. రెండు వారాలుగా ఒక్కో సీతాఫలం కావిడి ధర రూ.1800 వరకు పలకగా ఈవారం తొలుత రూ. 1500లకు కొనుగోలు చేసిన వ్యాపారులు, చివరకు రూ.1200, తరువాత రూ.వెయ్యికి కొనుగోలు చేశారు. దాంతో రైతులు చేసేదిలేక వ్యాపారులు అడిగిన ధరలకే అమ్ముకున్నారు.

మాడుగుల మండల కేంద్రంలో జరిగే సోమవారం సంతకు పాడేరు గిరిజన ప్రాంతాలైన దేవాపురం, సలుగు, కందులపాలెం, ఈదులపాలెం, కక్కి, పులుసుమామిడి చింతగరువు నుంచి గిరిజన రైతులు సీతాఫలం కావిళ్లు తీసుకు వచ్చారు. గడచిన రెండు వారాలకంటే ఈ వారం అధిక ధరలకు అమ్ముడుపోతాయని ఆశించి గిరిజన రైతులు భారీ మొత్తంలో సీతాఫలాలను కావిళ్లతో, గంపలతో తీసుకొచ్చారు. ఆదివారం రాత్రి వాహనాలపై మాడుగుల సంతకు తీసుకొచ్చిన సీతాఫలాలను ముందుగా వచ్చిన వ్యాపారులు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేశారు.

గిరిజన గ్రామాల్లో వేకువజామున బయలుదేరి మోతసహాయంతో ఇటీవలి కాలంలో ఎన్నడూ లేని విధంగా భారీ ఎత్తున సీతాఫలాలను సంతకు ఆలస్యంగా తీసుకొచ్చారు. అప్పటికే వ్యాపారులు సీతాఫలాలు కొనుగోలు చెయ్యడంతో, తరువాత వచ్చిన సీతాఫలాలను కొనుగోలు చేసేందుకు విముఖత చూపించలేదు. కొనేవారు కూడా చాలా తక్కువ ధరకు అడగడంతో చేసేది లేక రైతులు అయినకాడికి అమ్ముకున్నారు.

సుజల స్రవంతి పనులు ప్రారంభించాలి

సాగునీటి సాధన సమితి కన్వీనర్ కుమార్



ఉన్నత పాఠశాల విద్యార్థులతో పోస్ట్‌కార్డు ఉద్యమంలో పాల్గొన్న కుమార్

చీడికాడ : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ పనులను వెంటనే ప్రారంభించాలని సాగునీటి సాధన సమితి మాడుగుల నియోజకవర్గ కన్వీనర్ పీవీజీ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం చీడికాడ హైస్కూల్లో మధ్యాహ్న భోజన సమయంలో పలువురు విధ్యార్థులతో పోస్టుకార్డు ఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిందని, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.2100 కోట్లు కేటాయించడం హర్షనీయమని అన్నారు. అయితే దీన్ని మంత్రివర్గ సమావేశంలో కూడా వెంటనే ఆమోదించి పనులు ప్రారంభించాలని కోరారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఉత్తరాంధ్ర జిల్లాల్లో 30 లక్షల ఎకరాలకు, విశాఖ జిల్లాలో 3.21 లక్షల ఎకరాలకు, చీడికాడ మండలంలో 18 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పి.సత్యవతి, పాల సంఘం డైరెక్టర్ పరవాడ రామారావు, ఎస్ఎంసీ డైరెక్టర్ నడుపూరి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

కోనాం ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌పై చర్యలకు డిమాండ్

చీడికాడ : కోనాం గురుకులం విద్యార్థిని నూకరత్నం మృతిపై ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లను సస్పెండ్ చేస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఇప్పటివరకు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం శోచనీయమని మాలమహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగా త్రిమూర్తులు, సియ్యాద్రి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం విశాఖ ప్రజావాణిలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. నూకరత్నం మృతికి కారణమైన ఆ ఇద్దరిపై చర్యలు తీసుకుంటామని, బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఇంత వరకూ స్పందించలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా హామీ నిలబెట్టుకోని పక్షంలో ఈ నెల 29న ముఖ్యమంత్రి చంద్రబాబును కలుస్తామని వారు తెలిపారు.

నేతపర్వంగా దీపోత్సవం

చోడవరం: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం రాత్రి ఘనంగా దీపోత్సవం నిర్వహించారు. 108 జంటలు అమ్మవారి ఆలయంలో దీపాలను వెలిగించారు.

అండగా ఉండే పార్టీలకే మద్దతు

అఖిలభారత క్రైస్తవ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

దేవరాపల్లి : క్రైస్తవ మైనార్టీలకు చేదోడుగా ఉంటే రాజకీయ పార్టీలకు మద్దతు ఇస్తామని అఖిలభారత క్రైస్తవ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జీవీ ప్రసాదరావు అన్నారు. సోమవారం ఇక్కడ జరిగిన సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చర్చిలకు, వివాహ, శుభకార్యాల కోసం ఇస్తున్న ఖర్చులను సరళీకృతం చేయాలన్నారు. క్రైస్తవుల కులాంతర వివాహానికి ప్రభుత్వం రూ.50 వేలు ప్రోత్సహకంగా, చర్చిల నిర్మాణాలకు రూ.3లక్షలు ఇస్తోందని అన్నారు. జరూసలం వెళ్ళడానికి రూ.40 వేలు ఇస్తోందని, దాన్ని రూ.లక్షకు పెంచాలని, చట్టసభల్లో క్రైస్తవు మైనార్టీలకు అవకాశం కల్పించాలని కోరారు. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో క్రైస్తవుల శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమా వేశంలో సమాఖ్య మాడుగుల నియోజకవర్గ అధ్యక్షుడు బండారు సల్మాన్‌రాజ్, క్రైస్తవ సంఘం నాయకులు బి.లాజరస్, ఎం.జాన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తిదారులపై ప్రభుత్వం చిన్నచూపు : మరియమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న దళిత మహిళా శక్తి జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ

దేవరాపల్లి: చేతివృత్తులపై జీవనం సాగించే రజక, కమ్మరి, కుమ్మరి, నాయీబ్రాహ్మణ కులాలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని దళిత మహిళాశక్తి జిల్లా అధ్యక్షురాలు జి.మరియమ్మ అన్నారు. సోమవారం స్థానిక రజకవీధిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ యంత్రాలు రావడంతో చేతివృత్తిదారుల జీవనం దయనీయంగా తయారైందని, ప్రతి పనికీ యంత్రాల వినియోగం పెరిగిపోవడంతో కులవృత్తులను నమ్ముకున్న వారు కష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. అనుభవం లేని వృత్తుల్లోకి వలసలు వెళ్లి పని చెయ్యాల్సి వస్తోందని అన్నారు. వీరిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కింతాడ రమణమ్మ, కృష్ణమ్మ, అప్పారావు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

చోడవరం ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-245033
ఎంపీడీఓ	9959550097
తహసీల్దార్	8500632088

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	జయ జానకీ నాయక
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ)	లై
పూర్ణ	ప్రతిక్షణం

తామరచెరువు వీధిలో తాగునీటి కష్టాలు

- దెబ్బతిన్న పైప్‌లైన్
- కుళాయిలు రాక ఇబ్బందులు
- బోరు నుంచి ఉప్పు నీరు



బోరు నీటిని తోడుకుంటున్న మహిళలు

చోడవరం టౌన్: పట్టణంలోని తామర చెరువు వీధిలో మూడు రోజులుగా వీధి కుళాయిలు రాక స్థానిక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజుల క్రితం రామాలయం వద్ద ఎక్సవేటర్ సహాయంతో కుంగిన చెట్టును తొలగిస్తున్న సమయంలో తామర చెరువు వైపు వస్తున్న వీధి కుళాయిల పైపులైన్ దెబ్బ తినడంతో ఆ వీధికి నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో మరో ప్రత్యామ్నాయం లేక ఆ ప్రాంత మహిళలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఆ వీధి అంతటికీ ఒకటే బోరు ఉంది. అది కూడా ఉప్పునీరు వస్తుండడంతో ఆ నీటిని తాగలేకపోతున్నామని పలువురు మహిళలు తెలిపారు. నీటి కోసం పక్క వీధికి వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. వీధి కుళాయిలు మరమ్మతు పనులు చేపట్టేంత వరకు ట్యాంకుల ద్వారా నైనా మంచినీటిని సరఫరా చేయాలని ద్వారపూడి మంగ, ఎడ్ల చెల్లయ్యమ్మ, దిద్దుపూడి సత్యవతి, సువర్చల చిన్న, కశింకోట లక్ష్మి, రెడ్డి కుమారి, దుద్దుపూడి సత్యవతి, పట్నాల సత్యవతి, అడిగర్ల కృష్ణవేణి, కిల్లి బంగారమ్మ,మానేపల్లి రమణ తదితరులు కోరుతున్నారు. తాగునీటి అవసరాలకు చేతి బోర్లు మంజూరు చేయాలని, అలాగే ప్రస్తుతం అందుబాటులో ఉన్న బోరు వద్ద వీధి కాలువ పనులు చేపడుతున్న సమయంలో బోరు ప్రాంగణం (ప్లాట్ ఫాం) దెబ్బ తిందని, మరమ్మతు పనులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ట్యాంకులతో నీరు సరఫరా చేయాలి



మూడు రోజులుగా తాగు నీటికి కటకట లాడుతున్నాం. పైప్ లైన్ దెబ్బతినడంతో నీరు రావడం లేదు. కనీసం వాటికి మరమ్మతు పనులు చేపట్టే వరకైనా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలి.

- దిద్దుపూడి సత్యవతి

ప్రత్యామ్నాయ మార్గం చూపించాలి



నీరు రాక చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడి దగ్గరలో మంచి నీటి బోరు లేక పోవడంతో తాగు నీటిని పక్కవీధికి వెళ్ళి తెచ్చుకుంటున్నాం. పంచాయతీ వారు నీటి అవసరాలకు ప్రత్యామ్నాయం చూపాలి

- కశింకోట లక్ష్మి

గోవాడ షుగర్స్ కార్మికులకు తీపి కబురు

41మందికి పదోన్నతులు ● ఏడేళ్ల తరువాత ప్రమోషన్‌ల కల్పన

చోడవరం: గోవాడ షుగర్‌ఫ్యాక్టరీలో 41మంది కార్మికులకు పదోన్నతులు కల్పిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. పదోన్నతులపై కార్మిక సంఘం నుంచి వచ్చిన వినతి మేరకు కార్మికులకు పదోన్నతుల కల్పనపై రాష్ట్ర షుగర్ కేన్ అధికారులు నిర్ణయం తీసుకోవడంతో , కమిషనేట్ నుంచి ఇద్దరు అధికారులు ప్రత్యేకంగా రెండురోజుల క్రితం గోవాడ వచ్చారు. ఈ అధికారులతో పాటు గోవాడ షుగర్స్ ఎండీ కేఆర్ విక్టర్ రాజు, ఛైర్మన్ గూనూరు మల్లునాయుడులు కార్మికుల పదోన్నతులపై సమావేశం నిర్వహించి అర్హత, సీనియారిటీ ప్రాతిపదికన కార్మికులకు సోమవారం ఇంటర్వూలు నిర్వహించి పదోన్నతులు కల్పించారు. పదోన్నతులు వచ్చిన 41మంది కార్మికులలో సీజనల్ కార్మికులు 14మందికి పర్మినెంట్ కార్మికులుగా పదోన్నతి కల్పించారు. మిగిలిన 27 మందికి వివిధ కేడర్లలో పదోన్నతులు కల్పించారు. ఏడేళ్ల తరువాత షుగర్ ఫ్యాక్టరీలో కార్మికులకు పదోన్నతులు కల్పించిన అధికారులకు, యాజమాన్యానికి ఫ్యాక్టరీ గుర్తింపు కార్మిక సంఘం నాయకుడు శరగడం రామునాయుడు కృతజ్ఞతలు తెలిపారు. షుగర్‌కేన్ కమిషనర్ పదోన్నతులకు కమిటీ నియమించడంతో పాటు, వెంటనే పదోన్నతులు ఇచ్చేలా చర్యలు చేపట్టడం చాలా ఆనందంగా ఉందని రామునాయుడు ఆనందం వ్యక్తంచేశారు.

కౌలు రైతు గ్రూపులకే రుణాలు

తేల్చి చెప్పిన బ్యాంకులు, పీఏసీఎస్‌ల అధికారులు



సమావేశంలో పాల్గొన్న బ్యాంకులు, పీఏసీఎస్, రెవెన్యూ అధికారులు

బుచ్చెయ్యపేట : గతంలో కౌలు రైతులకు వ్యక్తిగతంగా ఇచ్చిన రుణాలు రికవరీ కానందున ఇపుడు కౌలు రైతుల గ్రూపులకే రుణాలందించగలమని వాణిజ్య బ్యాంకు అధికారులు, పీఏసీఎస్ కార్యదర్శులు స్పష్టం చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో హెచ్‌డీటీ రామారావు, ఏవో శైలజ సమక్షంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న బ్యాంకులు, పీఏసీఎస్‌ల అధికారులకు రెవెన్యూ శాఖ మంజూరుచేసిన 84 కౌలు రుణ అర్హత, వ్యవసాయశాఖ 250 మందికి మంజూరు చేసిన సాగు ధ్రువీకరణ పత్రాల వివరాలను అందజేశారు. వ్యక్తిగత రుణాలు మంజూరు చేయలేమని, డ్వాక్రా గ్రూపుల మాదిరిగా ఐదుగురు కౌలు రైతులు ఒక గ్రూపుగా ఏర్పడితే ఆయా గ్రూపులకు రుణాలు మంజూరు చేయగలమని బ్యాంకుల, పీఏసీఎస్‌ల అధికారులు తెలిపారు. గతంలో తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించని కౌలురైతులకు నిబంధనల ప్రకారం తిరిగి కొత్త రుణాల మంజూరుకు అవకాశం లేనందున అటువంటి వారిని గ్రూపుల్లో చేర్చుకోరాదన్నారు. వడ్డాది, బుచ్చెయ్యపేట, విజయరామరాజుపేట, పొట్టిదొరపాలెం, బంగారుమెట్ట, తురకలపూడి పీఏసీఎస్‌ల కార్యదర్శులతో పాటు బుచ్చెయ్యపేట ఐఓబీ, గ్రామీణ బ్యాంకు మేనేజర్లు, ఏఈఓ రూప, ఎంపీఈఓ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి : ఎస్ఐ

బుచ్చెయ్యపేట : వినాయక ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసే మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని బుచ్చెయ్యపేట ఎస్ఐ శిరీష్‌కుమార్ తెలిపారు. మండపాల్లో ఏర్పాటు చేసే స్టేజ్, మైక్, నిమజ్జనోత్సవాలకు అనుమతి తీసుకోవాలన్నారు. చేసే సాంస్కృతిక కార్యక్రమాలు, నిమజ్జనం సమయంలో అశ్లీల నృత్యాలు, చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించరాదని సూచించారు.జ

నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వేపై

ఉపాధ్యాయులకు వీడియో కాన్ఫరెన్స్



చోడవరంలో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయినులు

చోడవరం టౌన్: విద్యాపరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వేపై మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాల, గవర్నమెంట్ హైస్కూల్‌తో పాటు లక్కవరం, గోవాడ, లక్ష్మీపురం, పీఎస్.పేటల్లో ఆయా పాఠశాలల సముదాయాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడం తదితర అంశాలపై సర్వశిక్ష అభియాన్ అధికారులు శిక్షణ ఇచ్చారు. మండల రిసోర్సు పర్సన్ కేవీఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో....

రావికమతం : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న మూడు, ఎనిమిది తరగతుల విద్యార్థుల విద్యాప్రమాణాల గుర్తింపునకు నిర్వహించనున్న పరీక్షలపై ఉపాధ్యాయులకు ఎస్ఎస్ఏ ప్రతినిధులు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. 58 మంది ఎస్జీటీలు హాజరయ్యారు.



నేత్రపర్వంగా దీపోత్సవం

చోడవరం: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం రాత్రి ఘనంగా దీపోత్సవం నిర్వహించారు. 108 జంటలు అమ్మవారి ఆలయంలో దీపాలను వెలిగించారు.

కిటకిటలాడిన శివాలయాలు

బుచ్చెయ్యపేట : శ్రావణమాసంలో అమావాస్యతో కూడిన సోమవారం రావడంతో మండలంలోని శివాలయాలు కిటకిటలాడాయి. వందేళ్లకు ఒకసారి ఇలా అమావాస్య, సోమవారం, సూర్యగ్రహణం తటస్థిస్తాయని వేద పండితులు చెబుతున్నారు. సూర్యగ్రహణం మనదేశంలో కనిపించకపోయినా శాస్త్రప్రకారం శివాలయాల్లో అభిషేకాలు, పూజలు జరిపిస్తే దోషాలు తొలగిపోతాయని చెబుతారు. వడ్డాదిలో రామలింగేశ్వరస్వామి, భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి, విజయరామరాజుపేట, దిబ్బిడి, రాజాం, మంగళాపురం తదితర గ్రామాల్లో గల శివాలయాల్లో స్వామి వారికి భక్తులు పూజలు చేశారు.

కల్వర్టుల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి : డీఈ భారతి



కాలువలను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ భారతి

రోలుగుంట : గ్రామాల్లో నిర్మించే కల్వర్టులు, కాలువల నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ భారతి సూచించారు. అన్నారు. మండల కేంద్రంలో 14వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన కాలువలను సోమవారం ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరుణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమణ ఉన్నారు. రోలుగుంటలో రూ.1.4 లక్షలతో ఎంపీపీ పాఠశాల వద్ద నిర్మించిన కల్వర్టును, సంతబయలు వద్ద రూ.2 లక్షలతో నిర్మించిన రెండు కాలువలను పరిశీలించారు.

ఎంపీడీవోల ఫోన్ నంబర్లు

నర్సీపట్నం	9849900151
గొలుగొండ	9000013921
నాతవరం	9000013925
మాకవరపాలెం	9000013920

కషాయాల తయారీ యంత్రాల పంపిణీ



యంత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ చిన్నయ్యమ్మ

మాకవరపాలెం:
ప్రకృతి వ్యవసాయానికి కషాయాలను తయారు చేసే యంత్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రుత్తల చిన్నయ్యమ్మ అన్నారు. సోమవారం వ్యవసాయ కార్యాలయంలో కషాయాలు తయారు చేసే యంత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం చేసే గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఎన్‌పీఎం షాపులకు ఈ యంత్రాలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. సేంద్రియ ఎరువులను తయారు చేసి అన్ని గ్రామాల్లోని రైతులకు పంపిణీ చేయాలన్నారు. కషాయాలు తయారు చేసే ఒక్కో యంత్రం ధర రూ.30 వేలు అని, దీనిని పూర్తిగా రాయితీతో ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. మండలంలో మల్లవరం, గిడుతూరు, బూరుగుపాలెం, నగరం, కొండలఅగ్రహారం గ్రామాలకు ఐదు యంత్రాలను పంపిణీ చేశారు. ఈ గ్రామాల్లో ఇప్పటికే ఎన్‌పీఎం షాపులను ప్రారంభించారన్నారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం ప్రతి రైతు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి హేమ, ఏఈవో శేషునాయుడు, రామచంద్రరావు పాల్గొన్నారు.

మిలియన్ మార్చ్ పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

మాకవరపాలెం:
కంట్రీబ్యూటర్ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)పై కొత్త విధానాన్ని రద్దు చేయాలని ఉపాధ్యాయ సీపీఎస్ సంఘం మండల కన్వీనర్ కోసూరు రాము డిమాండ్ చేశారు. సోమవారం మండలపరిషత్ కార్యాలయం వద్ద మిలియన్ మార్చ్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 సెప్టెంబరు ఒకటిన ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు పెన్షన్ సౌకర్యం లేదన్నారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. దీనిపై సెప్టెంబరు ఒకటో తేదీన 13 జిల్లాల సీపీఎస్ ఉపాధ్యాయులు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు సర్వేశ్వరరావు, రవి, మోహన్, దేవి రేవతి,సూర్యనారాయణ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధి

ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు

గొలుగొండ:
రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు కృషిచేయాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. సోమవారం నిర్వహించిన మండల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాసమస్యలు గుర్తించి, వాటి పరిష్కారానికి కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు గ్రామాల్లో 80 శాతం రోడ్లు సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేశామన్నారు. సమావేశాల్లో మహిళా ప్రజాప్రతినిధులు సమస్యలను ప్రస్తావించాలని, అప్పుడే రిజర్వేషన్ల ఉద్దేశం నెరవేరుతుందన్నారు. పాతమల్లంపేట సర్పంచ్ లెక్కల సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీలో నాడప్, వర్మీ కంపోస్టు యూనిట్లకు ఖర్చు చేసిన నిధులు వృథా అయ్యాయని అన్నారు. వర్మీ కంపోస్టు యూనిట్లకు వానపాములను రైతులకు అందించడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారన్నారు. సంక్షేమ పథకాలు అధికార పార్టీ కార్యకర్తలకే అందుతున్నాయని, అర్హులకు అందడం లేదన్నారు. దీనిపై ఎంపీడీవో ఎంవీ సువర్ణరాజు కలుగజేసుకుని త్వరలో రైతులకు వానపాములు సరఫరా చేస్తామన్నారు. అనంతరం శాఖలవారీగా మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వినిపించారు. ఎంపీపీ సుర్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ పప్పల చలపతిరావును ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. ఈ సమావేశంలో తహసీల్దారు పి. అంబేడ్కర్, జడ్పీటీసీ సభ్యుడు చిటికెల తారక వేణుగోపాల్, వైస్ ఎంపీపీ గెడ్డం సత్యసుధ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు సుర్ల బాబ్జి, అధికార్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చలపతిరావు



ఎమ్మెల్సీ పప్పలను సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు

‘అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వమే ఆదుకోవాలి’

మాకవరపాలెం:
అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వమే ఆదుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్ల స్టేట్ గౌరవ అధ్యక్షుడు ముప్పాల నాగేశ్వరావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు బాసటగా ఏర్పాటు చేసిన బస్సు యాత్ర సోమవారం మాకవరపాలెం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులు 19.52 లక్షల మంది ఉన్నారన్నారు. వీరందరికీ రూ.3,996 కోట్లు చెల్లించవలసి వుందన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు రూ.7,600 కోట్లు ఉన్నాయన్నారు.ఈ ఏడాది మార్చి 27 వరకు 107 మంది బాధితులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. మార్చి 23వ తేదీన ముఖ్యమంత్రి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని ప్రకటించి ఇప్పటివరకు అసలు ఊసేఎత్తలేదన్నారు. ఈనెల 16వ తేదీన విజయనగరంలో బస్సుయాత్ర ప్రారంభించి వచ్చే నెల 17వ తేదీన అనంతపురంలో బస్సు యాత్ర ముగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బాధితుల సంఘం అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, నాగలక్ష్మి, విమల, పాలపర్తి తాతబ్బాయి, నాగరాజు పాల్గొన్నారు.



మాకవరపాలెంకు చేరుకున్న బస్సు యాత్ర

నర్సీపట్నంలో...

నర్సీపట్నం రూరల్: అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సమితి గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు బి.విశ్వనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 16 నుంచి సెప్టెంబర్ 15 వరకు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు సాగుతున్న అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య బస్సు యాత్ర సోమవారం సాయంత్రం నర్సీపట్నంకు చేరుకుంది. ఈ సందర్భంగా అబీద్‌సెంటర్‌లో వారు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల ఆత్మహత్యలను నివారించాలని, మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, రూ.1,180 కోట్లను అడ్వాన్స్‌గా ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అగ్రిగోల్డ్ కంపెనీ డైరెక్టర్ అవ్వా సీతారామారావుతోపాటు మరికొందరిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు, రాష్ట్ర కమిటీ నాయకులు చంద్రశేఖర్, షేక్ రజాక్, కొండలరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

గొలుగొండ:
గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీపీ సుర్ల లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మండలపరిషత్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంవీ సువర్ణరాజు, వైస్‌ఎంపీపీ గెడ్డం సత్యసుధ, వెలుగు ఏపీఎం రమణి, వ్యవసాయాధికారి మధుసూదనరావు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

15 ఏళ్ల లోపు వారికి ఎంఆర్ వ్యాక్సిన్ వేయాలి



వెంకునాయుడుపేట పాఠశాలలో వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

నర్సీపట్నం టౌన్:
తొమ్మిది నెలల చిన్నారి నుంచి 15 ఏళ్ల వరకు ప్రతిఒక్కరూ మీజిల్-రూబెల్లా వ్యాక్సిన్ వేయించుకోవాలని 21వ వార్డు కౌన్సిలర్ దన్నిన రాంబాబు అన్నారు. సోమవారం వెంకునాయుడుపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు విద్యార్థులకు వ్యాక్సిన్‌లు వేశారు. తట్టు, పొంగు వ్యాధులు రాకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం డి.గోపీనాథ్, ఉపాధ్యాయురాలు సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

సోలార్ రాట్నాలు కొనుగోలుకు రూ.70 లక్షలు మంజూరు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నాతవరం:
సోలార్ రాట్నాల కొనుగోలు చేసి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రూ.70లక్షలు మంజూరు చేయనున్నామని ఖాదీబాండార్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన తాండవ, చమ్మచింత గ్రామాలలో మహిళలకు నూలు వాడకంపై శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోలార్‌రాట్నాలు కొనుగోలుకు ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.33 వేల రూపాయలు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. తాండవలో పదిరోజులపాటు నూలు వడకడంపై శిక్షణ తరగతులు ఇస్తున్నామన్నారు. ప్రతిరోజు ఒక్కొక్కరికి రూ.100 స్టైఫండ్ ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో అప్పన్న విజయ్, సూర్యారావు, ఎల్‌వీ రమణ పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ వ్యాధుల శిబిరానికి విశేష స్పందన

గొలుగొండ:
మండలంలోని జి.కొత్తూరులో సోమవారం పశు సంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి నర్సీపట్నం ఏడీ సీహెచ్ గణేష్, పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ డి.రాఘవేంద్రరావులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పశువులు ఈనిన రెండు నెలల లోపే చూలు కట్టించుకోవాలని సూచించారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్ ద్రావణం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారిణి అశ్విని, గోపాలమిత్ర సూపర్‌వైజర్ కె.శ్రీరామ్మూర్తి, గోపాలమిత్రలు దొరబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాయకరావుపేట మండలం ఫోన్ నెంబర్లు

పాయకరావుపేట పోలీస్ స్టేషన్	: 08854 254044
ఎంపీడీవో కార్యాలయం	: 9441953611
తహసీల్దార్ కార్యాలయం	: 9441836336
వెలుగు ఏపీఎం	: 9866074067

సినిమా గైడ్

గౌతమ్ : లై
సూర్యమహల్ : జయ జానకి నాయక
సాయిమహల్ : నేనే రాజు నేనే మంత్రి
లక్ష్మీ (ఏసీ) : ఫిదా

పీహెచ్‌సీలో అందని వైద్యసేవలు

- ప్రైవేట్ హాస్టల్ విద్యార్థుల నిరసన
- ఎమ్మెల్యేకు నిర్వాహకులు ఫిర్యాదు

పాయకరావుపేట : స్థానిక పీహెచ్‌సీలో విద్యార్థులకు సక్రమంగా వైద్యసేవలు అందకపోవడంతో సోమవారం జ్వరపీడితులు ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పాయకరావుపేటలోని ఓ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న స్కాట్ బాలుర హోమ్‌లో వివిధ గ్రామాలకు చెందిన పేదల పిల్లలు ఉంటూ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. హాస్టల్‌లో ఉంటున్న కర్రి ఆనంద్, తడిపే నూకేష్, కుర్ర ఆనంద్, కుంద్ర నూకరాజు, మాసా శ్రీను, రాయి కిరణ్ అనే ఆరుగురు విద్యార్థులకు జ్వరం రావడంతో పీహెచ్‌సీలో డాక్టర్లకు చూపించారు. జ్వరం తగ్గడానికి మాత్రలు ఇచ్చి పంపించేశారు. ఆస్పత్రిలో జ్వర నిర్ధారణ పరీక్షలు చేయకుండా కేవలం మాత్రలు ఇచ్చి చేతులు దులుపుకోవడంపై విద్యార్థులతోపాటు హాస్టల్ నిర్వాహకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా హాస్టల్ నిర్వాహకులు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం తమ హాస్టల్ నుంచి జ్వరంతో వచ్చిన నలుగురు విద్యార్థులకు ఎటువంటి పరీక్షలు జరపకుండా మామూలు మాత్రలు ఇచ్చారన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

అయితే ఆ నలుగురిని ప్రైవేటు ఆసుపత్రిలో చూపిస్తే ఇద్దరికి మలేరియా ఉందని డాక్టర్ నిర్ధారించారన్నారు. సోమవారం మరో ఆరుగురికి జ్వరం రావడంలో పీహెచ్‌సీకి తీసుకువచ్చామని, గతంలో మాదిరిగానే ఎటువంటి టెస్టులు చేయకుండానే మామూలు మాత్రలు ఇచ్చి పంపేస్తున్నారని వాపోయారు. దీనిపై హాస్టల్ నిర్వాహకులు ఎమ్మెల్యే వంగలపూడి అనితకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శిరీషను వివరణ కోరగా హాస్టల్ విద్యార్థులకు పూర్తిస్థాయి వైద్య పరీక్షలు నిర్వహించడంలో తమ లోపం లేదన్నారు. విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించగా మలేరియా నెగిటివ్ వచ్చిందన్నారు. 8 నుంచి 11 సంవత్సరాల వయస్సు ఉన్న ఈ విద్యార్థులకు రక్తం బాగా తక్కువ ఉందని, వీరికి హై డోసేజ్ మందులు ఇస్తే వెంటనే ఒళ్ళు చల్లబడి పోతుందని తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వంగలపూడి అనితకు కూడా తెలియజేశానని ఆమె తెలిపారు.

పూరీ జగన్నాథుని దర్శించుకున్న ఎమ్మెల్యే అనిత



పూరీలో మత్స్యకార నాయకులతో సమావేశమైన అనిత

పాయకరావుపేట : పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత సోమవారం ఒడిశాలోని పూరీ జగన్నాథస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఎమ్మెల్యేకి పూర్ణకుంభ స్వాగతం పలికారు. నియోజకవర్గానికి చెందిన పలువురు పార్టీ నాయకులతో కలిసి సోమవారం పూరీలోని పెంటకోట గ్రామానికి ఆమె వెళ్లారు. అక్కడ ఎమ్మెల్యే అనితకు మత్స్యకార నాయకులు కొరివి ప్రసాద్, జగన్నాథం తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. ఆమెకు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వెంట పాయకరావుపేట మండల టీడీపీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, చిక్కాల శ్రీను, కట్టా శ్రీను తదితరులు ఉన్నారు.

ఘనంగా యాళ్ల సురేష్ జన్మదిన వేడుకలు



చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట : పాయకరావుపేట మేజరు పంచాయతీ ఉప సర్పంచ్ యాళ్ల సురేష్ జన్మదిన వేడుకలు సోమవారం పాయకరావుపేటలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డుల్లో సురేష్ బర్త్ డే కేక్‌ను కట్‌చేయగా, వార్డు సభ్యులు పేదలకు చీరలు పంపిణీ చేశారు. అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో వార్డు సభ్యుల సమక్షంలో ఉప సర్పంచ్ యాళ్ల సురేష్ బర్త్ డే కేక్ కట్‌చేశారు. అనంతరం వార్డు సభ్యులతోపాటు వివిధ యూనియన్ల నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గీసాల పద్మ, దేవాది మంగాదేవి, ఎన్.పద్మ, మలిపెద్ది వెంకటరమణ, అల్లు అప్పారావు, చిట్టిమూరి రామారావు, బి.ఎస్.నారాయణ, పెంకే శ్రీను, కశింకోట సత్తిబాబు, శివలంక నాగమల్లి, బళ్ల దొంగబాబు, పి.మేఘరంజన్, పేర్రాజు, దొంగల శ్రీను, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కంటోన్మెంట్ ఏరియాలో 12వ వార్డు సభ్యుడు చిట్టిమూరి రామారావు ఆధ్వర్యంలో సురేష్ జన్మదిన రందర్భంగా 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. దుర్గాకాలనీలో వార్డు సభ్యుడు కశింకోట సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పలువురు పేదలకు చీరలు పంపిణీ చేశారు.

మద్యం దుకాణం ఏర్పాటు విరమించుకోవాలి

నక్కపల్లి : మండలంలోని పెదతీనార్ల గ్రామ పరిధిలో మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, తక్షణమే ఈ షాపు ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని ఆ గ్రావస్థులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ గ్రామ మత్స్యకార నాయకులంతా సమావేశమై తమ గ్రామంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయరాదంటూ తీర్మానించారు. మద్యం షాపు ఏర్పాటు చేసేందుకు గుర్తించిన ప్రాంతం గుండా హైస్కూళ్లు, కళాశాలలకు అనేక మంది బాలికలు వెళ్తారని, అటువంటప్పుడు గ్రామం మధ్యలో దుకాణం ఎలా ఏర్పాటు చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఫిర్యాదు చేసేందుకు గ్రామ పెద్దలంతా కలిసి పాయకరావుపేటలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయానికి వెళ్లారు. సీఐ అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి ఫిర్యాదు అందజేశామని గ్రామ పెద్దలు చెప్పారు. సోమవారం దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తామని వారు చెప్పారు. సమావేశంలో మత్స్యకార పెద్దలు మేరుగు నాగేశ్వరరావు, కారే దాసు, మైలపల్లి జాన్, చేపల సూరిబాబు, గనగళ్ల జగ్గ, కారే ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.



ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయడానికి పాయకరావుపేట వెళ్లిన మత్స్యకారులు

మొక్కుబడిగా ప్రజావాణి

నక్కపల్లి : నక్కపల్లి మండలంలో గత కొంతకాలంగా ప్రజావాణి కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఈవోఆర్‌డీ, స్థానిక ఎస్ఐ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, వెలుగు ఏపీఎం, ఉపాధి పథకం ఏపీవో తప్ప ఇతరశాఖల అధికారులెవ్వరూ హాజరుకావడం లేదు. వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ, విద్యుత్‌శాఖ, జలవనరులశాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ, ఎక్సైజ్ తదితర విభాగాలకు చెందిన అధికారులెవ్వరూ ప్రజావాణికి హాజరుకావడం లేదు. దీంతో ఆయా సమస్యలపై ఫిర్యాదులు చేసేందుకు వచ్చినా సంబంధిత అధికారులెవ్వరూ కనిపించకపోవడంతో ప్రజలు కూడా రావడం మానేస్తున్నారు. ఇప్పటికైనా మండల పరిధిలో అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ రాణీ అమ్మాజీని సంప్రదించగా ప్రజావాణికి చాలా మంది అధికారులు రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులకు వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపాధ్యాయులు

నక్కపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 3,5,8 తరగతుల విద్యార్థులకు జాతీయ స్థాయిలో నిర్వహించనున్న పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం చేయాలన్న దానిపై ఉపాధ్యాయులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. రెండు రోజుల పాటు ఈ కాన్ఫరెన్స్ వుంటుందని ఎంఈవో డీవీడీ ప్రసాద్ చెప్పారు. తొలిరోజు సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : మండలంలోని తిమ్మాపురం పంచాయతీ పరిధిలో రైతులకు సోమవారం జీడి, మామిడి మొక్కలను పంపిణీ చేశారు. వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులకు టీడీపీ నాయకుడు వంగలపూడి గోవింద్ మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన వన తోటల పెంపకానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు సీసీ ఏవీ సుబ్బారావు, వంగలపూడి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మంగవరంలో ఘనంగా ఏకాహం



పాయకరావుపేట : మండలంలోని మంగవరం గ్రామంలో చిట్టి పైడమ్మతల్లి(గూనాలమ్మ)పండుగ సందర్భంగా సోమవారం ఏకాహం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయంలో శ్రీసాయిబాబా సేవా సంఘం ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఏకాహం కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని అమ్మవారి భక్తి గీతాలు ఆలపించారు. మంగళవారం ఉదయం ఆరు గంటలకు ఈ కార్యక్రమం ముగుస్తుంది.

పాఠశాల గోడలపై సినిమా పోస్టర్లు



పాయకరావుపేట : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మెయిన్ గేటుకు ఇరువైపులా ప్రహరీపై సినిమా పోస్టర్లు అతికించినా ఎవరూ పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఈ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పది వరకు సుమారు 500 మంది విద్యార్థులు చదువుతున్నారు.పాఠశాల ఆవరణలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడా ఉంది. ఇప్పటికైనా పాఠశాల గోడలపై సినిమా పోస్టర్లు, ఇతర పోస్టర్లు అతికించకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సినిమా గైడ్

సీతాచిత్రమందిర్ - లై

తులసీ చిత్రమందిర్ - నేనే రాజు నేనే మంత్రి

పరమేశ్వరి - జయ జానకి నాయక

నేడు దిమిలిలో పరదేశమ్మ అమ్మవారి పండుగ

రాంబిల్లి: మండలంలోని దిమిలి గ్రామంలో మంగళవారం పరదేశమ్మ అమ్మవారు పండుగ ఘనంగా జరుగనుంది. ఈ పండుగ కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు దర్శించి పసుపు,కుంకుమలను నివేదించి భక్తిశ్రద్ధలతో పూజించనున్నారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

53 పశువులకు చికిత్సలు



పశువులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న రఘునాథ్

రాంబిల్లి: సీజనల్ పశువ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా వుండాలని స్థానిక పశు వైద్యులు రఘునాథ్ అన్నారు. మండలంలోని కొప్పగొండుపాలెంలో పశుసంవర్ధకశాఖ అధ్వరంలో సోమవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన 53 పశువులకు పలు రకాల వైద్యపరీక్షలను నిర్వహించి పాడిరైతులకు మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పశు వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాడనర్సాపురం తీరంలో ఇంజన్ బోటు బోల్తా



బోటు యజమాని పకీర్

రాంబిల్లి: మండలంలోని వాడనర్సాపురం తీరంలో సోమవారం తెల్లవారుజామున సముద్రంలో అలల ఉధృతికి చేపల వేటకు వెళుతున్న ఇంజన్‌బోటు బోల్తాపడింది. ఈ ఘటనలో ముగ్గురు మత్స్యకారులకు స్వల్పగాయాలైనట్టు మత్స్యకారులు తెలిపారు.గ్రామానికి చెందిన ఎస్.పకీర్,చెల్లూరి శ్రీను,జామి తాతారావు, చోడిపల్లి దేముడు, వి.పోలయ్యలు సోమవారం తెల్లవారు జామున ఇంజన్ బోటుపై చేపలవేటకు బయలుదేరారు. సముద్రంలో అలలు తీవ్రత ఎక్కువై కెరటాలు ఎగసిపడుతుండడంతో ఆయిల్ ఇంజన్ బోటు తిరగబడిందని స్థానిక మత్స్యకారులు తెలిపారు. ఈ ఘటనలో పడవలో ఉన్న తాతారావు, దేముడు, మరో వ్యక్తికి గాయాలు కాగా మరో ముగ్గురు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారన్నారు. ఈ ఘటనలో ఇంజన్ పూర్తిగా దెబ్బతినగా చేపలవేట సాగించే వల పూర్తిగా పాడైపోయిందని ఇంజన్ బోటు యజమాని పకీర్ ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని ఆయన వాపోయాడు.

జోరుగా ట్రీగార్డ్ ప్లాంటేషన్ పనులు

వైఎస్ఆర్ విగ్రహం వద్ద సెంటర్ లైటింగ్‌కు ఏర్పాట్లు

ఎలమంచిలి: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో సుమారు రూ.20 లక్షలతో చేపడుతున్న ట్రీ గార్డ్ ప్లాంటేషన్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ పనులు జరుగుతుండగా వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోతుండడంతో స్టేషన్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నిర్మాణ పనులు పూర్తయితే రహదారి ఆధునికీకరణకు నోచుకుంటుంది. గతంలో ఈ రోడ్డుపై ప్రయాణమంటే నరకయాతనగా ఉండేది. చిన్నపాటి వర్షం కురిసినా బురదమయమయ్యేది. దీనికి తోడు రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గోతులు పడి దారుణంగా తయారవ్వడంతో వాహనదారుల పరిస్థితి ఇబ్బందికరంగా ఉండేది. ఎట్టకేలకు మున్సిపల్ పాలకులు స్పందించడంతో ఈరోడ్డు ఆధునికీకరణకు మోక్షం కలుగుతుంది. రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ బస్‌స్టాండ్ వరకూ ఈ రోడ్డు వధ్యలో ట్రీ గార్ట్ ప్లాంటేషన్ పనులు చేపడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే సెంటర్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు గతంలోనే కమిషనర్ తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఆధునికీకరణకు నోచుకోకుండా ఉన్న ఈరోడ్డు ఆధునికీకరణకు నోచుకోనుండడంతో పట్టణవాసుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



ఎలమంచిలి రైల్వేస్టేషన్ రోడ్డులో జరుగుతున్న ట్రీ గార్డ్ ప్లాంటేషన్ పనులు

ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణకే ఎంఆర్ వ్యాక్సిన్

అచ్యుతాపురం: ప్రాణాంతకమైన తట్టు, రుబెల్లా వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించడానికే ప్రభుత్వం ఎంఆర్ వ్యాక్సిన్‌ను సరఫరా చేస్తోందని ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం వెదురువాడలో చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనివల్ల చిన్నారులకు హాని కలగదన్నారు. ప్రభుత్వ వైద్యాధికారి డి.భీమారావు మాట్లాడుతూ మండలంలో 75 శాతం పూర్తిచేశామన్నారు. ప్రతి పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి ఈవ్యాక్సిన్ పిల్లలకు వేశామన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో బలరాముడు, వెదురువాడ సర్పంచ్ గొర్లె లోవకుమారి, సీహెచ్‌వో పి.సాంబమూర్తి, రామజోగి పాల్గొన్నారు.



చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

ఉచితంగా మొక్కల పంపిణీ



పోతిరెడ్డిపాలెంలో రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ విత్తంశెట్టి నాయుడు

ఎలమంచిలి రూరల్: మండలంలోని పోతిరెడ్డిపాలెంలో సోమవారం వెలుగు ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. సర్పంచ్ విత్తంశెట్టి నాయుడు చేతుల మీదుగా రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పటికే రైతుల కోసం పలు పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటోందన్నారు. వెలుగు ఏపీఎం శ్రీనువాసరావు మాట్లాడుతూ వెలుగు ఆధ్వర్యంలో రైతులకు 1,600 మొక్కలు అందించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వాలు

సీపీఎం జిల్లా నాయకులు కర్రి అప్పారావు

అచ్యుతాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం పట్టించుకోవడంలేదని సీపీఎం జిల్లా నాయకులు కర్రి అప్పారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గల పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పాలన మూడున్నరేళ్లు గడుస్తున్నా రైతులకు సహాయం చేయలేదన్నారు. ఈమూడున్నరేళ్లలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల ధరలు విపరీతంగా పెరిగాయి. కాని రైతు పంటకు గిట్టుబాటు ధర మాత్రం రావడంలేదన్నారు.వ్యవసాయరంగం సంక్షోభంలో పడడంతో రైతులు, కూలీలు వలసబాట పడుతున్నారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ప్రకారం పంటలకు రైతు పెట్టిన పెట్టుబడికి మరో 50 శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధర ప్రకటిస్తామని ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం వాగ్దానం చేసింది. కాని అమలు కాలేదన్నారు, దీంతో రైతులు పెట్టుబడి రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రైతుల సమస్యలపై ఈనెల15 నుంచి 30 వరకు తాము తలపెట్టిన దేశవ్యాప్త ఆందోళనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈసమావేశంలో బుద్ద రంగారావు, కొవిరి అప్పలరాజు, చోడిపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కర్రిఅప్పారావు

ఉపాధ్యాయులకు టెలికాన్ఫరెన్స్



టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

అచ్యుతాపురం రూరల్ : అక్టోబర్‌లో నిర్వహించే అభ్యసనా సామర్థ్యాల మదింపుపై మండలంలోని హరిపాలెం, అచ్యుతాపురం, దోసూరు పూడిమడక పాఠశాలల్లో ఎస్‌సీఆర్‌టీ ఆధ్వర్యంలో సోమవారం టెలికాన్ఫరెన్స్ జరిగింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్, ట్రైనింగ్ సంస్థ గత ఏడాది నిర్వహించిన సర్వేలో తక్కువ స్థాయిలో ఫలితాలు వచ్చాయని వారు తెలిపారు. ఈ ఏడాది ఉపాధ్యాయులు తమ సామర్థ్యాలను పెంచుకోవాల్సి ఉందని సూచించారు. విద్యార్థులకు సృజనాత్మకంగా బోధించాలని తెలిపారు. ఈ కాన్ఫరెన్సులలో ఉపాధ్యాయులు త్రినాథస్వామి, నాగేశ్వరరావు, నళిని తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్ మృతి సమాజానికి తీరనిలోటు

రాంబిల్లి: భాగవతుల ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పివిఆర్‌కె ప్రసాద్(77)అకాల మృతికి బీసీటీ పాలకవర్గం,సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.బీసీటీ క్యాంపస్ లో సంతాపసభ నిర్వహించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా బీసీటీ కార్యదర్శి బి.శ్రీరామూర్తి మాట్లాడుతూ పివిఆర్‌కే ప్రసాద్ సోమవారం తెల్లవారు జామున గుండె పోటుతో హైదరాబాద్‌లోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ కేడర్‌కు చెందిన ప్రసాద్ మృతి బీసీటీకి, సమాజానికి తీరనిలోటన్నారు. హిందూ పరిరక్షణ ట్రస్టు ఛైర్మన్‌గా ఉన్నారన్నారు.ఈ కార్యక్రమంలో బీసీటీ సంయుక్త కార్యదర్శి టి.వి.ఎస్. రాఘవరావు, నేమాని సోమయాజులు,కేవీకే సమన్వయకర్త కె.శైలజా,హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.కె.అరుణ,ఐటీఐ ప్రిన్స్‌పాల్ కె.సురేస్, విద్యార్థులు పాల్గొన్నారు.



సంతాపసభలో మాట్లాడుతున్న బీసీటీ కార్యదర్శి శ్రీరామూర్తి

పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరి

అనకాపల్లి రూరల్ : తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలని ఎంపీహెచ్‌ఏ కె.మంగమ్మ సూచించారు. మారేడుపూడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తుమ్మపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం యర్రా చక్రవర్తి, తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర- గౌతమ్‌నంద
శ్రీసత్య - లై
రాజా - జయ జానకి నాయక
షిర్డీసాయి - ఆనందో బ్రహ్మో
పర్తిసాయి- ఫిదా
రామచంద్ర : నేనే రాజు నేనే మంత్రి
శ్రీసత్యనారాయణ : ప్రతిక్షణం

అగ్రిగోల్డ్ పై చంద్రబాబు, జగన్‌లది ఒకే బాట

◆ సీఎం మాట తప్పడం వల్లే చైత్యన్య యాత్ర ◆ ప్రతిపక్ష నేత బాధితుల తరపున పోరాటం చేయడంలో విఫలం
◆ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి ◆ అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు





సభకు హాజరైన బాధితులనుద్దేశించి మాట్లాడుతున్న నాగేశ్వరరావు

అనకాపల్లి రూరల్ : అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరిస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని విస్మరించడం వల్లే చైతన్య యాత్ర ప్రారంభించామని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన చైతన్య యాత్ర సోమవారం అనకాపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలో బాధితులు, ఏజెంట్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగురోడ్ల జంక్షన్ వద్ద ఏర్పాటైన సభలో నాగేశ్వరరావు మాట్లాడారు. పండగల కానుకల పంపిణీలో ఉన్న శ్రద్ధ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారంలో లేదని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. అలాగే ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ జగన్ పలు సమస్యలపై ధర్నాలు, ఓదార్పు యాత్రలు చేశారని, అగ్రిగోల్డ్‌లో సుమారు 20 లక్షల మంది బాధితులు, ఏజెంట్ల సమస్యలపై ఏనాడూ ఆందోళనలు, ఓదార్పు యాత్రలు చేయలేదన్నారు. పైగా 2019లో తనను సీఎంను చేస్తే మూడు నెలల్లో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరిస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.తిరుపతిరావు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలను అగ్రిగోల్డ్ సమస్యను పరిష్కరించాలని కోరినా ఎవరూ ఇంతవరకు స్పందించలేదని వాపోయారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మానసిక ఆందోళనతో మృతి చెందిన అగ్రిగోల్డ్ బాధితుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వి.విశ్వనాథరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఏజే స్టాలిన్, మహిళా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నాగలక్ష్మి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు వీవీ చంద్రశేఖర్, నాయుడు, అనకాపల్లి అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వైఎన్ భద్రం, కోన లక్ష్మణ్, కరణం మాణిక్యాలరావు, జె.దుర్గారావు, ఎం.గోపాల్‌రమణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో
చాంపియన్ అనకాపల్లి



చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకున్న డీఎస్పీ, పోలీస సిబ్బంది

అనకాపల్లి టౌన్ : విశాఖ నగరంలో మూడు రోజుల పాటు జరిగిన పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో అనకాపల్లి సబ్ డివిజన్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. జిల్లా పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2017 విశాఖ నగరంలోని కైలాసగిరి పోలీసు గ్రౌండ్స్‌లో 17 నుంచి 20వ తేదీ వరకు జరిగాయి. ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్‌లలో ప్రథమ, కబడ్డీలో ద్వితీయస్థానం సాధించడమే కాకుండా అనకాపల్లి సబ్ డివిజన్ బృందం ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం రాత్రి పోలీసు గ్రౌండ్‌లో జరిగిన ముగింపోత్సవంలో అనకాపల్లి డీఎస్పీ కేవీ రమణ చాంపియన్‌షిప్ కప్‌ను అందుకున్నారు. ఈ పోటీల్లో పట్టణ ఎస్‌ఐ సూర్యప్రకాష్, రామకృష్ణ, కిరణ్, వాసు, వర్మలతోపాటు అనకాపల్లి టౌన్, రూరల్, చోడవరం సర్కిల్ పరిధిలోని పోలీసు క్రీడాకారులు పాల్గొని విజయం సాధించారు.

యోగా పోటీల్లో సంపత్‌కుమార్ ప్రతిభ



ప్రశంసా పత్రంతో సంపత్‌కుమార్

అనకాపల్లి టౌన్ : విశాఖలో ఆదివారం జరిగిన 11వ జిల్లా స్థాయి యోగాసనాల పోటీల్లో పట్టణానికి చెందిన సంపత్‌కుమార్ ప్రతిభ చూపాడు. చక్కని ఆసనాలు వేసి ఐదో స్థానాన్ని దక్కించుకున్నట్టు యోగా గురువు నగేష్ తెలిపారు.

పిసినికాడలో ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన

◆ పంచాయతీ వాసుల స్థితి గతులపై ఆరా ◆ ఉపాధిని పెంపొందించుకునే కుటుంబాలకు ప్రోత్సాహం



పిసినికాడలో పర్యటిస్తున్న ప్రపంచ బ్యాంకు బృందం

కొత్తూరు : ప్రతి ఇంటికీ నెలకు కనీసం పది వేల రూపాయల ఆదాయం ఉండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయానికి అనుగుణంగా అడుగులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ప్రపంచ బ్యాంకు బృందం సోమవారం విస్తృతంగా పర్యటించింది. తొలుత పిసినికాడ పంచాయతీలో ఈ బృందం సభ్యులు అక్కడివారి స్థితిగతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటైన సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సత్యసాయి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో యువత స్వయం ఉపాధిని పెంపొందించు కోవాలన్నారు. ప్రతి కుటుంబానికి నెలకు పది వేల రూపాయల ఆదాయం ఉండాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు టాటా ట్రస్ట్, ప్రపంచ బ్యాంక్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నీల్సన్ బృందాలు సర్వే చేస్తున్నట్టు చెప్పారు. ఇందుకు జిల్లాలోని ఆనందపురం మండలం పాలవలస, గండిగుండం, అనకాపల్లి మండలం పిసినికాడ, కశింకోట మండలం ఉగ్గినపాలెం తదితర గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఈ గ్రామాల్లో సదరు బృందం పర్యటించి స్వయం ఉపాధిని పెంపొందించుకుంటున్న కుటుంబాలకు వ్యాపార వ్యవహారాలపై అవగాహన కల్పించేందుకు, వారు తయారు చేసిన వస్తువుల అమ్మకాలను పెంచేందుకు, వ్యాపారంలో మెలకువలు, నైపుణ్యాభివృద్ధి, బ్యాంకింగ్ లావాదేవీలపై భవిష్యత్తులో చైతన్యపరిచే చర్యలు చేపడుతుందన్నారు. అనంతరం ఈ గ్రామాల్లోని వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళతారన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఏపీ హెడ్ పరమేశ్వరన్, రాజా గంగూలీ, బాలకృష్ణ, సర్పంచ్ దాడి కమలాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు మళ్ళ సాయిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎ.లక్ష్మి, పొలమరశెట్టి నూకరాజు, గ్రామ నాయకులు దాడి ఉదయ్‌కుమార్, మళ్ళ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'విందాం- నేర్చుకుందాం'తో
విద్యార్థులకు విజ్ఞానం



విద్యార్థులకు పాఠాలు వినిపిస్తున్న పీఎస్‌ఎన్ మూర్తి

అనకాపల్లి రూరల్ : మండలంలోని గొలగాం పంచాయతీ కొత్త తలారివానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 'విందాం- నేర్చుకుందాం' రేడియో కార్యక్రమాన్ని జిల్లా ఏఎంవో పీఎస్‌ఎన్ మూర్తి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు ఎంతో ఆసక్తిగా, ఆహ్లాదకరంగా, ఆట పాటలతో విద్య నేర్చుకునేందుకు ఈ ప్రోగ్రాం దోహదపడుతుందన్నారు. శుక్రవారం వరకు ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు ఈ కార్యక్రమం ప్రసారమవుతుందన్నారు. ఇది ప్రతి విద్యార్థి శ్రద్ధగా వినడం ద్వారా తమ విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని కోరారు. ఎంఈవో డి.దివాకర్, సర్పంచ్ చీకటి రాంబాబు, హెచ్‌ఎం రెడ్డి నారాయణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీసు యాప్‌పై అవగాహన సదస్సులు



కశింకోటలో వివరిస్తున్న ఎస్‌ఐ మధుసూదనరావు

అనకాపల్లి టౌన్ : నేరాల నియంత్రణకు పోలీసు శాఖ రూపొందించిన లాక్‌డ్ హౌసెస్ మోనటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌పై గ్రామీణ ప్రాంత ప్రజలకు పోలీసు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి మండలంలోని బవులవాడ గ్రామంలో సదస్సు ఏర్పాటు చేశారు. ఎవరైన పొరుగూరు వెళ్లేటప్పుడు తమకు సమాచారం తెలియజేస్తే ఇంటిపై నిఘా ఏర్పాటు చేస్తామని రూరల్ సీఐ రామచంద్రరావు ప్రజలకు వివరించారు. అలాగే పోలీసు యాప్‌లో భాగస్వాములైతే ఎవరైనా సుదూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు యాప్‌లో మెసేజ్‌పెడితే తమకు సమాచారం అందుతుందని వివరించారు. అలా సమాచారం అందుకున్న వెంటనే క్యాంపు వెళ్లే ముందురోజు ఇంటికివచ్చి ఒక కెమెరాను అమర్చుతామని పేర్కొన్నారు. ఎవరైనా ఇంట్లోకి చొరబడినట్లయితే ఆ కెమెరా ద్వారా నిందితులను గుర్తించి అరెస్టు చేయడానికి వీలుంటుందని చెప్పారు. అలాగే రోడ్లపై ప్రయాణం చేసేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన వివరించారు. రూరల్ ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి టీడీపీ నాయకులు కోట్ని ఈశ్వరరావు, బాలాజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

కశింకోట రూరల్ : నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ రూపొందించిన యాప్‌పై కశింకోట ఎస్‌ఐ మధుసూదనరావు సోమవారం కశింకోట ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరా అదుపునకు పోలీసుశాఖ ఎన్నెన్నో వినూత్న చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఇందుకు అన్నివర్గాల సహకారం అవసరమని కోరారు. ప్రస్తుతం చోరీల నియంత్రణకు కూడా ఒక యాప్‌ను రూపొందించామన్నారు. అనంతరం ఆ వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లిలో సెంటర్ లైటింగ్ పనులు



నెహ్రూచౌక్ : అనకాపల్లి పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎన్టీఆర్ స్టేడియం నుంచి శారదా బ్రిడ్జి వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటును జీవీఎంసీ చేపడుతోంది. రూ.14 లక్షలు వెచ్చించి రహదారి మధ్యలో 27 విద్యుత్ స్తంభాలు, ఒక భారీ రింగ్ విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ పనుల అనంతరం ఎల్ఈడీ బల్బులను అమర్చనున్నట్టు ఏఈ బాబూరావు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

తపాలా సేవలు వినియోగించుకోండి

ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి

జి.మాడుగుల: గ్రామీణ ప్రాంతాల్లోని విస్తరిస్తున్న పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి సూచించారు. మండలంలోని భీరం పంచాయతీ కేంద్రంలో సోమవారం తపాలా శాఖ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పీవో మాట్లాడుతూ, తపాలా శాఖలో అనేక పథకాలు అమలు చేస్తున్నారని, వాటి గురించి పూర్తిగా తెలుసుకోవాలని చెప్పారు. ప్రధానంగా బాలికల కోసం సుకన్య సమృద్ధి పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మారుమూల ప్రాంతాల్లో సైతం పోస్టల్ సేవలు అందించడం సంతోషకరమన్నారు. మారుమూల ప్రాంతాల గిరిజనులంతా పోస్టల్‌లో ఖాతాలు తెరవాలని పీవో సూచించారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, మండలంలోని ఐదు పోస్టల్ శాఖ కార్యాలయాలు మంజూరయ్యాయన్నారు. ప్రతీ పంచాయతీ కేంద్రాల్లో పోస్టాఫీసులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ బ్రాంచి మేనేజర్ శ్రీనివాస్, భీరం సర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు చిన్నమ్మి, పోస్టల్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

చెట్టు కొమ్మలు తొలగించరూ...



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు

సీలేరు: సీలేరు-ధారకొండ ప్రధాన రహదారిలోని డుప్పులవాడ సమీపంలో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు కొమ్మలను తొలగించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు. ప్రధాన రహదారిలోని 106 కిలోమీటర్ సమీపంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెట్టు పడిపోయింది. రోడ్డుకు సగభాగం వరకూ ఈ చెట్టు కొమ్మలు అడ్డుగా ఉన్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భారీగా వర్షాలు కురిస్తే వాహనాలు రోడ్డు కింది భాగంలో దిగబడి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఈ చెట్టు కొమ్మలను తక్షణమే తొలగించాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు వేడుకుంటున్నారు.

గిరి రైతులందరికీ పట్టాలు ఇవ్వాలి

చింతపల్లి: ఏజెన్సీలో అటవీ హక్కుల చట్టం ద్వారా అర్హులైన గిరిజన రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకరి విస్ణుమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ అటవీ హక్కుల చట్టం పక్కాగా అమలు జరగడం లేదన్నారు. రెండు విడతల్లో మాత్రమే పట్టాలు ఇచ్చారన్నారు. ప్రస్తుతం చట్టం అమలు చేసేందుకు సర్వే కూడా చేయడం లేదని చెప్పారు. అలాగే పెసా చట్టం సమర్థవంతంగా అమలుచేయాల్సిన అవసరం వుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు జి.నరసింహరావు, పేట్ల పోతురాజు, కొండలరావు, ఎం.రాజుబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదు వేగవంతం చేయాలి

సర్వశిక్షాభియాన్ పీవో శివరామప్రసాద్

పాడేరు: ఏజెన్సీలో బడి బయట ఉన్న విద్యార్థుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సర్వశిక్షాభియాన్ ప్రాజెక్టు అధికారి టి.శివరామప్రసాద్ ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం ఏజెన్సీలోని సర్వశిక్షాభియాన్ సిబ్బందితో బడి బయట బాలల నమోదుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో కొన్ని మండలాల్లో బాలల నమోదు పక్కాగా జరుగుతున్నా, మరికొన్ని మండలాల్లో అసత్వంగా ఉందన్నారు. మరో రెండో రోజుల్లో లక్ష్యం మేరకు బడి బయట బాలల నమోదు ప్రక్రియను పూర్తి చేసి, తమకు నివేదిక సమర్పించాలన్నాని ఆయన ఆదేశించారు. ఈ ప్రక్రియ నిర్వహించే క్రమంలో అలక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్ఎస్ఏ పీవో హెచ్చరించారు.





సమావేశంలో పాల్గొన్న ఎస్ఎస్ఏ సిబ్బంది... మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ పీవో శివరామప్రసాద్

ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వే ఆధారంగానే బడి బయట బాలలకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. అప్పుడు బడిఈడు బాలలందర్నీ బడిలో చేర్పించేందుకు అవకాశం ఏర్పడుతుందని ఆయన చెప్పారు. ఏజెన్సీలో ఉన్న సీఆర్‌పీలు, ఎంఐఎస్ సమన్వయకర్తలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు బాలల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ విద్యా శాఖ ఉప సంచాలకులు విజయకుమార్, సర్వశిక్షాభియాన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మావోయిస్టు నాగేశ్వరరావు లొంగిపోతే కేసులు ఎత్తేస్తాం

చింతపల్లి సీఐ చంద్రశేఖరరావు

చింతపల్లి: సీపీఐ మావోయిస్టు పార్టీ ఏసీఎం కొర్ర నాగేశ్వరరావు స్వచ్ఛందంగా లొంగిపోతే వైద్యం చేయించి కేసులను ఎత్తి వేస్తామని చింతపల్లి సీఐ చంద్రశేఖరరావు తెలిపారు. అన్నవరం వారపు సంతలో నాగేశ్వరరావు లొంగిపోవాలని సోమవారం విస్తృత ప్రచారం చేశారు. సంతలో అందరికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, మావోయిస్టు పార్టీకి ఆకర్షితుడై పార్టీలో పనిచేస్తున్న నాగేశ్వరరావు ప్రస్తుతం నడవలేని స్థితిలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్టు సమాచారం వచ్చిందన్నారు. కుటుంబ సభ్యులకు, స్వగ్రామానికి దూరంగా వుంటూ సరైన వైద్య సేవలు అందక దళంలో ఇబ్బంది పడుతున్నట్టు తెలిసి పోలీసు శాఖ చింతిస్తోందన్నారు. మీ ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోందని, పిల్లలు, భార్యకు దూరంగా వుండడం వల్ల వారి యోగక్షేమాలు పట్టించుకునేవారే లేరని, ఈ మార్గం సరైంది కాదని సీఐ పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ



వారపు సంతలో ప్రచారం చేస్తున్న సీఐ చంద్రశేఖరరావు

కుటుంబంతో స్వేచ్ఛాయుత జీవితాన్ని గడపాలని కోరారు. ఇప్పటికైనా సందేహాలు నివృతి చేసుకుని లొంగిపోవాలని భావిస్తే 9440796111, 9440904239, 9440904237 నంబర్లకు కాల్ చేయవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నవరం ఎస్ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'పోలీసు అవుట్ పోస్టులపై ప్రజాప్రతినిధుల వైఖరి తెలపాలి'

చింతపల్లి: పోలీసు అవుట్‌పోస్టులపై గిరిజన ప్రాంత ప్రజాప్రతినిధుల వైఖరి ప్రకటించాలని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మెట్టడం రాజుబాబు డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, పాడేరు ఎమ్మెల్యే ఈశ్వరి, అరకు ఎంపీ కొత్తపల్లి గీత, మాజీ మంత్రి బాలరాజు, పాడేరు నియోజక వర్గంలో పనిచేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులందరూ బాక్సైట్ తవ్వకాలు, అవుట్‌పోస్టుల నిర్మాణాలపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. అవుట్‌పోస్టుల నిర్మాణాలపై వారి వైఖరి ప్రకటించాల్సిన అవసరం వుందన్నారు. ఈ నిర్మాణాలను వ్యతిరేకిస్తే గిరిజన సమాఖ్యతో కలిసి ఉద్యమించాలని కోరారు.

ప్రభుత్వ అవకాశాలు అందిపుచ్చుకోండి: ఎంపీడీవో

జి.మాడుగుల: ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎంపీడీవో ప్రేమాకర్‌రావు సూచించారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిరుద్యోగులకు వివిధ ఉద్యోగాలు కల్పిస్తుందని చెప్పారు. మండలంలో ఇంటర్ చదువుతున్న అభ్యర్థులకు కూడా అనేక అవకాశాలను ఉన్నాయని చెప్పారు. డీడీయూ, జీకేవై వంటి సంస్థల్లో అవకాశాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. మండలంలోని అభ్యర్థులు ఈ అవకాశాలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

జి.మాడుగుల: ట్రైకార్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం రెండో విడత ఇంటర్వ్యూలను నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రేమాకరరావు ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, ఈ ఇంటర్వ్యూల్లో 219 మంది అభ్యర్థులు హాజరయ్యారని చెప్పారు. గత బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలో 420 మందికి సంబంధించి దరఖాస్తులు పరిశీలించామన్నారు. అనంతరం ప్రభుత్వం నుంచి మంజూరైన ట్రైకార్ రుణాల లబ్ధిదారులకు అందే ఏర్పాట్లు చేస్తామన్నారు. రుణాలు పొందే లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకుని, తిరిగి బ్యాంకులకు చెల్లించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్, జడ్పీటీసీ సభ్యుడు సింగిడి ఆదినారాయణ, టీడీపీ నాయకులు వరహాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

కొయ్యూరు: క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుంటే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కొయ్యూరు సీఐ ఉదయ్‌కుమార్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా సోమవారం కొయ్యూరు కొమ్మిక శివారు డేగలపాలెం గ్రామాన్ని సిబ్బందితో సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పాఠశాల ఆవరణలో యువత వాలీబాల్ ఆడుతుండగా వెళ్లి పలకరించారు. ఉన్నత చదువులు చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న, క్రీడల పట్ల అమితమైన ఆసక్తి కనపరుస్తున్న యువత వివరాలు సేకరించారు. క్రీడలపై ఆసక్తి కనబరిస్తే ఉద్యోగావకాశాలకు వస్తాయని చెప్పారు. అనంతరం వాలీబాల్, క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఆయన వెంట ఎస్ఐలు రుఖ్మాంగధరావు, శ్రీనివాసరావ ఉన్నారు.



క్రీడాకారులకు కిట్లు అందిస్తున్న సీఐ ఉదయ్‌కుమార్

హింధూ ధర్మ పరిరక్షణ ట్రస్టు చైర్మన్ మృతికి సంతాపం

పాడేరు: విశ్రాంత ఐఏఎస్ అధికారి, హింధూ ధర్మ పరిరక్షణ ట్రస్టు చైర్మన్ పీవీఆర్‌కే.ప్రసాద్ మృతికి ఏజెన్సీ ప్రాంత హింధూ ధర్మ పరిరక్షణ సమితి ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఐఏఎస్ అధికారిగా సేవలు అందించిన ప్రసాద్, హింధూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలనే లక్ష్యంతో ట్రస్టును ఏర్పాటు చేశారన్నారు. అనేక ప్రాంతాల్లో సేవలు అందించిన ప్రసాద్ అకాల మృతి తీరని లోటు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఏజెన్సీ ప్రాంత సమితి కన్వీనర్లు పేర్కొన్నారు.



శిథిలావస్థలో కేజేపురం పీఏసీఎస్ కార్యాలయ భవనం


బీటలు వారిన కింతలి పీఏసీఎస్ కార్యాలయ భవనం


గోడలు చెమ్మగిల్లుతున్న దృశ్యం

శిథిలావస్థలో పీఏసీఎస్ కార్యాలయ భవనాలు

- ఎప్పుడు కూలిపోతాయో తెలియని దుస్థితి
- భయాందోళన చెందుతున్న సిబ్బంది, రైతులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

మాడుగుల రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయాలు (పీఏసీఎస్‌లు) శిథిలావస్థలో వున్నాయి. శ్లాబ్ పెచ్చులూడిపడుతూ ఎప్పుడు ఏప్రమాదం ముంచుకొస్తుందో తెలియని దుస్థితికి చేరుకున్నాయి.

దీంతో అక్కడి సిబ్బంది, రైతులు భయాందోళన చెందుతున్నారు. మాడుగుల జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో 10 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. వీటిలో ఏటా కోట్ల రూపాయలు రైతులకు రుణాల రూపంలో టర్నోవర్ అవుతోంది. వీటిలో కింతలి, వీరనారాయణం, కేజేపురం, ఎం. కోడూరు, వమ్మలి గ్రామాల్లోని పీఏసీఎస్‌ల కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కనీసం ఎరువులు భద్రపరచుకునేందుకు వీలులేకుండా మారాయి. కార్యాలయ సిబ్బంది గదులు శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. వర్షాలు కురిస్తే వర్షపునీటితో గదులు చెమ్మగిల్లుతున్నాయి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అదికారులు కొత్త భవనాలు నిర్మించే దిశగా చర్యలు చేపట్టాలని రైతులు, సిబ్బంది కోరుతున్నారు.

భవనం ప్రమాదకరంగా మారింది



మాగ్రామం కేజేపురం పీఏసీఎస్ కార్యాలయ పరిధిలో ఉంది. దీంతో రుణాలకైనా, రాయితీలపై ఇచ్చే ఎరువులనైనా తీసుకునేందుకు అక్కడికి వెళతాం. కేజేపురం పీఏసీఎస్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది.ఈ భవనం శ్లాబ్ పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది.

-దండి సన్యాసయ్యదొర(బాల),
రైతు,వంటర్లపాలెం

ఉన్నతాధికారులు స్పందించాలి



ప్రస్తుతం కూలిపోయే దశలో ఉన్న పీఏసీఎస్ కార్యాలయాల భవనాల పరిస్థితులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. నూతన భవనాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. లేకుంటే సిబ్బందికి, రైతులకు ఇబ్బందులు తప్పవు.

-కలిమిరాము,
రైతు ఎం. కోడూరు

28న కవితా పఠనం ప్రసారం

కె.కోటపాడు: ఈనెల 28వ తేదీ ఉదయం 8.30 గంటలకు విశాఖపట్నం ఆల్ ఇండియా రేడియా కేంద్రం నుంచి తన స్వీయ కవితా పఠనం ప్రసారమవుతుందని వి.సంతపాలెం గ్రామానికి చెందిన కవి బోజంకి వెంకటరవి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హృదయం సమీరాలు సాహితీ కార్యక్రమంలో భాగంగా కవితా పఠనాన్ని ఆల్ ఇండియా రేడియో ప్రసారం చేస్తుందని తెలిపారు.

చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్


చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: మండలంలోని కేజేపురం పీహెచ్‌సీ సిబ్బంది ఎంఆర్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నారు. సోమవారం మండలంలోని కేజేపురం, చింతలూరు, గొటివాడ గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని 216 మంది విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. కాగా మండలంలో 5890 మంది చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటివరకు 5816మందికి ఎంఆర్ వ్యాక్సిన్ వేశామని ఎంపీహెచ్‌వో రవికుమార్ తెలిపారు. ఇప్పటివరకు 38 పాఠశాలలు, 23 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ వేశామని రవికుమార్ తెలిపారు.

కిటకిటలాడిన శివాలయాలు

కె.కోటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో సోమఅమావాస్య సందర్భంగా భక్తుల తాకిడితో శివాలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని భక్తి శ్రద్ధలతో పరమ శివునికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల తాకిడితో కోటపాడు,ఆర్లి,చంద్రయ్యపేట,గొండుపాలెం, ఎ.కోడూరు, ఆనందపురం గ్రామాల్లో శివాలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయాల వద్ద ఉత్సవ కమిటీలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


కోటపాడులో పూజలు చేస్తున్న భక్తులు

లబ్ధిదారులందరికీ రాయితీపై రుణాలు

చీడికాడ: మండలంలో అర్హులైన లబ్ధిదారులందరికీ రాయితీపై రుణాలను మంజూరు చేస్తామని మండల కోఆర్డినేటింగ్ అధికారి టి. సత్యనారాయణ తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ, కాపు కార్పొరేషన్‌ల ద్వారా దరఖాస్తు చేరుకున్న వారికి ఇటీవల ఇంటర్వ్యూలు పూర్తయ్యాయన్నారు. లబ్ధిదారుల ఎంపికపై మండల కమిటీ సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక రుణానికి ఇద్దరు లబ్ధిదారులు చొప్పున ఎంపిక చేశామన్నారు. ఈ నివేదికను జిల్లా అధికారులకు పంపిస్తామన్నారు. ఎంపీడీవో ఆర్ఎం గ్లాడ్స్ మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ నుంచి 30 మందికి రుణాలు ఇవ్వాలనే లక్ష్యం కాగా రూ.1.30 కోట్లు రాయితీ ప్రభుత్వం నుంచి వచ్చిందన్నారు. ఎంపీపీ కుచ్చు కళావతి,ఈవోపీఆర్డీ బి. చైతన్య, కమిటీ సభ్యులు ఆర్.వి.సత్యనారాయణ, షేక్ చిన్నా సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారుల ఎంపికపై చర్చిస్తున్న అధికారులు

హైస్కూల్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

చీడికాడ: చీడికాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జడ్పీటీసీ సభ్యురాలు పి.సత్యవతి అన్నారు. సోమవారం ఆమె స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పాఠశాల విద్యార్థులను, ఎస్ఎంసీ సభ్యులు ముత్యాలును సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్‌లో తాగునీటి సమస్య లేకుండా కృషి చేస్తానన్నారు. అవసరమైతే తన నిధులనుంచైనా తాగునీటి సౌకర్యం కల్పిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఆమె వెంట పీవీజీ కుమార్, హెచ్ఎం ఎన్.జయలక్ష్మి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛభారత్ తప్పనిసరి


ఎ.కొత్తపల్లిలో స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పిస్తున్న బృంద సభ్యులు

దేవరాపల్లి: ప్రతీ గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని ప్రపంచబ్యాంక్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎన్.నీలిమా ఆధ్వర్యంలో మండలంలోని ఎ.కొత్తపల్లి, అచ్చియ్యపాలెం, చిప్పాడపాలెం, మామిడిపల్లి, నాగయ్యపేట, పండూరుపాలెం గ్రామాల్లో కమిటీ సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని, రక్షిత పథకాల వద్ద, తాగునీటి వనరుల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కోఆర్డినేటర్ తాటికొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సంక్షేమమే ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న చిట్టిబాబు

దేవరాపల్లి: ఎస్సీ, ఎస్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని దళిత మహాజన శ్రామిక యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ చిట్టిబాబు అన్నారు. సేవాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఉషోదయ డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపకార వేతనాల కోసం ఎస్సీ ఎస్టీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈకార్యక్రమంలో ఉషోదయ ప్రిన్సిపాల్ ఎన్.దేముళ్లు తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన యూకో బ్యాంక్ ఏటీఎం

దేవరాపల్లి: వారం రోజులుగా బ్యాంక్ లావాదేవీలు, ఏటీఎం సేవలు అందుబాటులో లేకపోవడంతో మండల కేంద్రానికి చెందిన వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. యూకో బ్యాంకు పక్కనున్న వైఎన్ క్లాంప్లెక్స్‌లో ఈనెల 16వ తేదీన పిడుగుపడడంతో ఆపరిసర ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. అలాగే యూకో బ్యాంకులో ఉన్న కంప్యూటర్లు కాలిపోయి ఆన్‌లైన్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో బ్యాంకు లావాదేవీలతో పాటు ఏటీఎం సేవలు నిలిచిపోయాయి. దీంతో ఈ ప్రాంతీయులు అవస్థలు పడుతున్నారు. త్వరగా ఏటీఎం పనిచేసేలా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



యూకో బ్యాంక్ ఏటీఎం

వినాయక చవితికి ఏర్పాట్లు

మాడుగుల: మండల కేంద్రంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలో పందిళ్లు వేసి అలంకరణ పనిలో భక్తులు నిమగ్నమయ్యారు. ఉత్సవ కమిటీలు వినాయక ప్రతిమలను కొనుగోలు చేసి గ్రామానికి తీసుకువచ్చారు. మట్టి గణపతులను పూజించడానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు కమిటీలు తెలిపాయి.




బురదమయంగా మారిన గుడివాడ, పెదపాచిల రహదారులు

నరకానికి నకళ్లు
గ్రామీణ రహదారులు

- అడుగడుగునా గోతులు
- రాళ్లు తేలిన రోడ్లతో అవస్థలు
- చినుకు పడితే చిత్తడే
- ఎన్నికల హామీలకే పరిమితమవుతున్న అభివృద్ధి

రావికమతం: మండలంలో గ్రామీణ రహదారుల తీరు ఏళ్లు గడుస్తున్నా మారడం లేదు. రోడ్ల అభివృద్ధి ఎన్నికల హామీలకే పరిమితమవుతోంది. పలు గ్రామాల రోడ్లు అడుగడుగునా గోతులతో రాళ్లు తేలి కనీసం నడవడానికి కూడా వీల్లేనంత అధ్వానంగా తయారయ్యాయి. చిన్నపాటి చినుకు పడితే బురదమయంగా మారుతున్నాయి. మండలంలో ఆర్ఈసీ రోడ్డు నుంచి గుడివాడ, తోటకూరపాలెం నుంచి పోతులూరు, తట్టబంద నుంచి బూరుగుపాలెం, జి.గడబపాలెం, పేరగొట్టుపాలెం, ఆర్.దిబ్బలపాలెం, బీఎన్.రోడ్డు నుంచి గొల్లలపాలెం, రావికమతం దుర్గానగర్ నుంచి మరుపాక, బీఎన్.రోడ్డు నుంచి కిత్తంపేట, మేడివాడ, కానాడ, పారమ్మ చెరువు నుంచి పెదపాచిల తదితర గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. ఎవరికి అనారోగ్యం వచ్చినా ఈ గ్రామాల నుంచి కనీసం ఆటోపై రోగిని తీసుకువచ్చే వెసులుబాటు కూడా లేక గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. హామీలపై హామీలు గుప్పిస్తున్న పాలకులు వీటి అభివృద్ధిని విస్మరించడంతో ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తప్పడం లేదు. వీటిలో కిత్తంపేట, పెదపాచిల, కానాడ, ఆర్.దిబ్బలపాలెం, పోతులూరు రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, టెండర్లు కూడా ఖరారయ్యాయని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఏడాది కాలంగా ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు పలు సభల్లో చెబుతూ వచ్చారు. అయితే నేటికీ వాటి అభివృద్ధి కార్యరూపం దాల్చలేదు. ఇలాగైతే వచ్చే ఎన్నికల్లో ప్రజల ముందు తలెత్తుకు తిరగలేమని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.



రాళ్లు తేలిన కానాడ రోడ్డు

విరివిగా మొక్కలు నాటాలి

టీడీపీ మండల అధ్యక్షుడు నాగ గంగాధర్

రాయపురాజుపేట పాఠశాలలో మొక్కలు నాటిన నైరా వ్యవసాయ విద్యార్థులు



మొక్క నాటుతున్న విద్యార్థులు

చోడవరం రూరల్: ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ నాగ గంగాధర్ కోరారు. మండలంలోని రాయపురాజుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా నైరా కళాశాల వ్యవసాయ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనకాపల్లి ఏరువాక కేంద్రం పంపిణీ చేసిన గ్లైసిరిడియా మొక్కలను నాటారు. ఈ మొక్కల ఆకులను నేలలో వేసుకుని దుక్కి దున్నడం వల్ల నేలసారం పెంచుకోవడంతోపాటు నత్రజని వినియోగాన్ని తగ్గించుకోవచ్చని నైరా కళాశాల విదార్థులు వివరించారు.

ఈ కార్యక్రమంలో నైరా కళాశాల విద్యార్థులు సీహెచ్. కృష్ణ, డి.సాయి ప్రసన్న కుమార్, ఎన్.అప్పలనాయుడు, ఎస్. వెంకటసాయి, ఎం.బాలకృష్ణ, ఉప సర్పంచ్ బి.చినసూర్యనారాయణ, ఉపాధ్యాయిని రేవతి తదితరులు పాల్గొన్నారు.

కమలేష్ చంద్ర సిఫారసులను అమలుచేయాలి

గ్రామీణ డాక్ సేవక్‌ల డిమాండ్

బుచ్చెయ్యపేట : కేంద్ర ప్రభుత్వం కమలేష్ చంద్ర సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామీణ డాక్ సేవక్‌లు సోమవారం వడ్డాది తపాలా కార్యాయం ఎదుట ధర్నా చేశారు. కమలేష్ చంద్ర కమిషన్ నివేదక మేరకు శాశ్వత ఉద్యోగులకే కాకుండా తమకు కూడా వేతనాలు అమలు చేయాలని చోడవరం డివిజన్ సంఘం అధ్యక్షుడు రామారావు కోరారు. వడ్డాది, కేజే.పురం, వి.మాడుగుల, రావికమతం, చోడవరం కార్యాలయాల పరిధిలోని జీడీఎస్‌లు ఆందోళనలో పాల్గొన్నారు.

జీసీజీటీఏ నిరసనకు మద్దతు తెలపాలి

జిల్లా అధ్యక్షుడు విఘ్నేశ్వరరావు



చోడవరం టౌన్: 7వ వేతన సంఘం నివేదికను విడుదల చేయాలని కోరుతూ కోరుతూ మంగళవారం దేశవ్యాప్తంగా అన్ని యూనియన్లూ చేపడుతున్న నిరసన కార్యక్రమానికి జిల్లాలోని వివిధ కళాశాలల అధ్యాపకులు మద్దతు తెలియజేయాలని గవర్నమెంట్ కళాశాలల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.విఘ్నేశ్వరరావు కోరారు.

కళాశాలలకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని కోరారు.7వ పీఆర్‌సీని విడుదల చేయాలని ఏడాది కాలంగా పోరాడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదని, వీటిని సాధించుకునేందుకు, ఇతర సమస్యల పరిష్కారానికి మంగళవారం దేశవ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలని రాష్ట్ర యూనియన్ పిలుపునిచ్చిందని ఆయన పేర్కొన్నారు.

513 మందికి ఎంఆర్ వ్యాక్సిన్

రోలుగుంట: మండలంలోని బుచ్చెంపేట ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం 513 మంది పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసినట్లు వైద్యాధికారి కుసుమ మౌనిక తెలిపారు. మండలంలోని కొంతలం, రత్నంపేట, వడ్డిప గ్రామాల్లో ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి పిల్లలకు వ్యాక్సిన్ వేశారు. ఇప్పటి వరకు 3160 మందికి ఈ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. ప్రాణాంతకమైన మీజిల్స్, రుబెల్లా వ్యాధుల నివారణకు 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేయించడంలో గ్రామీణులు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 15 వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకు వేయించనివారికి, బయటి నుంచి వచ్చిన వారికి ఆరోగ్యకేంద్రాల్లో ప్రత్యేకంగా వ్యాక్సిన్ వేసే ఏర్పాట్లు చేశామన్నారు.

నేతవానిపాలెంలో చురుగ్గా రామాలయం మరమ్మతు పనులు



బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట శివారు నేతవానిపాలెంలో భక్తులు వితరణగా అందజేసిన రూ.5 లక్షలతో రామాలయం మరమ్మతు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 50 ఏళ్ల క్రితం నిర్మించిన దేవాలయం శిథిలావస్థకు చేరుకుంది. గుమ్మాలు, తలుపులు దెబ్బతిన్నాయి. ప్లాస్టింగ్ ఊడిపోయింది. ఆలయ మరమ్మతు కోసం స్థానిక భక్తులు రూ.5 లక్షలు సేకరించారు. మరమ్మతు చేయించడంతోపాటు ముఖద్వారంపై వినాయకుడు, సీతారామలక్ష్మణ, అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ఫ్లోరింగ్‌కు బదులు టైల్స్ వేశారు.

వెంకన్నపాలెంలో పశువైద్య శిబిరం



పశువుకు చికిత్స చేస్తున్న వైద్యులు

చోడవరం రూరల్: మండలంలోని వెంకన్నపాలెం పాల ఉత్పత్తిదారుల సంస్థలో సోమవారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గవరవరం పశువైద్యాధికారి టి. ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 22 పశువులకు గర్భకోశవ్యాధి చికిత్సలు చేశారు. ఆరింటికి చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 22 లేగ దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు వాటి ఆరోగ్య పరిస్థితిని గమనిస్తూ ఉండాలని వైద్యులు సూచించారు. సీఆర్‌వో మాలినాయుడు, చోడవరం ఏరియా సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, పాల సంఘం అధ్యక్షుడు వియ్యపు సన్నిబాబు, గోపాలమిత్ర అప్పలనాయుడు, రమణ, వీఏ టి.కృష్ణకుమార్ పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై నడిచేదెలా..?



శ్రీకన్య జంక్షన్ దిగువకు వెళ్లే మార్గంలో అధ్వానంగా నర్సీపట్నం ప్రధాన రహదారి

నర్సీపట్నం టౌన్:
పట్టణంలోని శ్రీకన్య జంక్షన్ దిగువ నుంచి పెద బొడ్డేపల్లికి వెళ్లే మార్గంలో ఉన్న ప్రధాన రహదారి నడవడానికి వీలు లేకుండా ఉంది. వర్షం పడుతున్నపుడల్లా వరదనీరు రోడ్డుపైనే నిల్వ ఉండడంతో ఇటీవల ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఇక్కడ కల్వర్టు నిర్మించే పనిలో నిమగ్నమయ్యారు. దీంట్లో భాగంగా వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా పక్కనే డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతున్నది. డైవర్షన్ రోడ్డు అంతా బురదమయంగా మారిపోయి చిత్తడిచిత్తడిగా ఉంది. ఈ బురదలోనే పందులు స్వైరవిహారం చేస్తుండడంతో అక్కడ మరింత అధ్వానంగా మారింది. చేసేదేమీ లేక పట్టణవాసులు ముక్కులు మూసుకుని అందులో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒక వృద్ధుడు ద్విచక్రవాహనంపై వెళ్తూ స్కిడ్ అవ్వడంతో పడిపోయి గాయాలపాలయ్యాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని పరిశుభ్రం చేసి అక్కడ ఉన్న మురుగునీటిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

'ఆక్రమణలు కాకుండా భూయజమానులు జాగ్రత్తగా ఉండాలి'



ప్రజల సమస్యలు వింటున్న ఆర్డీవో సూర్యారావు

నర్సీపట్నం రూరల్:
తమ భూములు ఆక్రమణకు గురికాకుండా యజమానులు జాగ్రత్తగా ఉండాలని ఆర్డీవో కె.సూర్యారావు అన్నారు. సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా తమకు చెందిన భూములు ఆక్రమణకు గురయ్యాయని కొంతమంది చేసిన ఫిర్యాదులపై ఆర్డీవో స్పందిస్తూ భూముల గురించి పట్టించుకోకుండా ఉండడం వలనే ఆక్రమణలకు గురవుతాయన్నారు. వేములపూడిలో పీతల కోనేరును కొంతమంది కప్పేస్తున్నారని, దానివల్ల తమ పొలాలకు సాగునీరు అందడం లేదని రైతులు ఫిర్యాదు చేయగా, తగిన చర్యలు చేపడతామన్నారు. నాతవరం మండలం ములగపూడికి చెందిన వితంతువు తన పింఛనును నిలిపివేశారని ఫిర్యాదు చేయగా, ఆ గ్రామ కార్యదర్శికి ఫోన్‌చేసి విచారించారు. సామాజిక తనిఖీలో ఆమె భర్త చనిపోలేదని, పరారీలో ఉన్నాడని సూచించడం మూలంగా పింఛను నిలిపి వేశామని కార్యదర్శి తెలిపారు. ఆమె భర్త మరణ ధ్రువపత్రాన్ని సమర్పించాల్సిందిగా ఆమెను ఆర్డీవో ఆదేశించారు. అవసరమైన ఫిర్యాదులపై ఆర్డీవో సంబంధిత తహసీల్దార్లకు ఫోన్‌చేసి ఆదేశాలు జారీచేసారు. ఈకార్యక్రమంలో నర్సీపట్నం తహసీల్దార్ వీవీ రమణ, ఏవో వి.ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కార్పొరేషన్ల రుణాల ఇంటర్వ్యూలు

రెండు రోజుల్లో 315 మంది హాజరు

నర్సీపట్నం టౌన్:
మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్పొరేషన్ల రుణాల ఇంటర్వ్యూలకు 155 మంది హాజరయ్యారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీ కార్పొరేషన్ రుణాలకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొత్తం అన్ని కార్పొరేషన్ రుణాలకు మున్సిపాలిటీ నుంచి 1,670 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోగా, సోమవారం 155 మంది మాత్రమే హాజరయ్యారు. గత శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 160 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మొత్తం రెండురోజుల్లో 315 మంది లబ్ధిదారులకు బ్యాంకర్లు ఇంటర్వ్యూలు జరిపారు. లబ్ధిదారుల ధ్రువపత్రాలను పరిశీలించి హాజరు వేయించుకుని పంపించేశారు. ఇంటర్వ్యూలకు ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి, ఏడీబీ, యూనియన్‌బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా, డీసీసీబీ, ఏపీజీవీబీ, కార్పొరేషన్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, ఆంధ్రాబ్యాంకు శాఖల అధికారులు హాజరయ్యారు. లబ్ధిదారుల ధ్రువపత్రాలను పరిశీలించి త్వరలో రుణాలు మంజూరు జరిగేలా చూస్తామని మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర తెలిపారు. ఆన్‌లైన్‌లో 1670 మంది దరఖాస్తులు చేశారని ఇంటర్వ్యూలకు 315 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. మిగిలిన వారు ఎందుకు రాలేదో తెలియలేదన్నారు. ఈకార్యక్రమంలో మెప్మా కో-ఆర్డినేటర్ రవి, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దరఖాస్తులు పరిశీలిస్తున్న దృశ్యం

రైతులు, ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

నర్సీపట్నం రూరల్:
రైతులు, ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న పలువురు నేతలు మాట్లాడుతూ జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, రైతులు నష్టపోయారన్నారు. కరువుతో రైతులు ఉపాధి నిమిత్తం పనుల కోసం వివిధ రాష్ట్రాలకు వలసలు పోతున్నారన్నారు. అలాగే వ్యవసాయ కూలీలకు ఉపాధిహామీ పథకం ద్వారా 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.400 కూలి ఇప్పించాలని, రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయాలని, ఉపాధి కూలీలకు బకాయిపడ్డ కూలిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో సూర్యారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కొండలరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.తాతబ్బాయి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సంఘం కార్యదర్శి మేకా సత్యనారాయణ, గొలకొండ నూకినాయుడు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

'విపత్తులను చాకచక్యంతో ఎదుర్కొనాలి'




సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటరావు

నర్సీపట్నం:
విపత్తులు సంభవించినపుడు చాకచక్యంతో వ్యవహరించి వాటిని ఎదుర్కొనాలని నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ .పి.వెంకటరావు అన్నారు. సోమవారం కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్, ఏపీ యువజన సేవల విభాగం నేతృత్వంలో విద్యార్థులకు విపత్తుల నిర్వహణ, ప్రాథమిక చికిత్స అనే అంశాలపై జరిగే మూడురోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధికారిణి మంగమ్మ ముఖ్య అతిథిగా హాజరైన సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువుకున్న విద్యార్థులంతా నిరక్షరాస్యులకు విపత్తులు సంభవించినపుడు తీసుకోవాల్సిన చర్యలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వి.చిట్టిబాబు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ శంకరరావు, సురేష్‌బాబు పాల్గొన్నారు.

వీధి కుక్కలు స్వైరవిహారం

ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మర్రిపాలెంలో సంచరిస్తున్న వీధి కుక్కలు

నాతవరం:
మండలంలోని గుమ్మిడిగొండ, మర్రిపాలెం, ఏపీ.పురం, తదితర గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు రోడ్డు మీదకు రావాలంటే భయపడుతున్నారు. వీధి కుక్కలు ఎక్కడ పడితే అక్కడ గుంపులుగా తిరుగుతూ చిన్నపిల్లలపై దాడి చేస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. కుక్కల భయంతో పిల్లలను ఒంటరిగా పాఠశాలకు పంపడం భయమేస్తుందని తల్లిదండ్రులు అంటున్నారు. చాలాకాలం నుంచి పంచాయతీ పాలకవర్గం వీధి కుక్కలను పట్టుకోవడం మానేయడంతో వీధి కుక్కల బెడద ఎక్కువైందని ఆందోళన చెందుతున్నారు. ఒక్కొక్కసారి ఒంటరిగా వెళ్లే మహిళలపై దాడి చేస్తున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పంచాయతీల్లో వీధి కుక్కల బెడద లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కొండ ధర్మవరం భూములు సర్వే చేయాలి

నాతవరం:
మండలంలోని కొండధర్మవరంలో ఉన్న 450 ఎకరాల భూమిని సర్వేచేసి మిగులు భూమిని పేదలకు పంచాలని సీపీఐ మండల కార్యదర్శి డి.అజయ్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ముందు ధర్మవరం భూములను సర్వేచేసి మిగులు భూములను పేదలకు ఇస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారని,కానీ నేటికీ ఈ భూములను సర్వే చేయలేదన్నారు. ఉపాధి హామీ కూలీలకు కూలి చెల్లించాలని, వారికి 200 రోజుల పనిదినాలు కల్పించి రోజుకు రూ.300 కూలి ఇవ్వాలన్నారు. అలాగే అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, లేదంటే బాధితుల తరుపున ఆందోళన చేస్తామన్నారు.

మీకోసంకు ఫిర్యాదుల వెల్లువ

నాతవరం:
మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి ఐదు ఫిర్యాదు అందాయి. నాతవరం గ్రామానికి చెందిన కర్రి గోవింద్ తనకు రేషన్‌కార్డు ఇవ్వాలని ఎంపీడీవో దృష్టికి తెచ్చారు. అలాగే పింఛన్లు మంజూరు చేయాలని వైడీపేట నుంచి ముగ్గురు దరఖాస్తులు అందజేశారు. నాతవరం నుంచి రేషన్‌కార్డు మంజూరు చేయాలని మరో దరఖాస్తు వచ్చింది.

పెదబొడ్డేపల్లి పాఠశాలలో విందాం -నేర్చుకుందాం

నర్సీపట్నం రూరల్:
మండలంలోని పెదబొడ్డేపల్లి ఎంపీపీ పాఠశాలలో ఆటలు, పాటల ద్వారా విద్యార్థులు అభ్యసించే విందాం-నేర్చుకుందాం అనే రేడియో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మానటరింగ్ సభ్యుడు ఎం.భిక్షపతి మాట్లాడుతూ ఈ రేడియో పాఠాలు కార్యక్రమం ప్రతి వారంలో సోమ, మంగళ, బుధ, గురువారాలలో జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులంతా ఈ కార్యక్రమం వినియోగించుకుని విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.గణేశ్వరరావు, సీఆర్పీ రాజాచంద్ర పాల్గొన్నారు.

కౌలు రైతులకు తప్పనిసరిగా రుణాలు

మాకవరపాలెం:
కౌలు రైతులకు బ్యాంకులు తప్పనిసరిగా రుణాలు మంజూరు చేయాలని తహసీల్దార్ కె.రమామణి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో బ్యాంకు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో ఉన్న కౌలు రైతులకు నిబంధనల మేరకు ఖరీఫ్ రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీ ప్రసాదరావు, వ్యవసాయ అధికారి హేమ పాల్గొన్నారు.

శిథిలావస్థలో మూడు వంతెనలు



- వరద ఉధృతికి దెబ్బతిన్న జల్లూరు వంతెన స్తంభం
- మరమ్మతులకు నోచుకోని తంగేడు, రామచంద్రపురం బ్రిడ్జిలు
- రాకపోకలకు భయపడుతున్న వాహనదారులు
- ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికుల ఆందోళన
- జల్లూరు వద్ద ప్రారంభంకాని కొత్త వంతెన పనులు



కోటవురట్ల: మండలంలో మూడు వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఈ మూడు వంతెనలు ప్రధానమైనవి. ప్రమాదకర స్థితిలో ఉన్నప్పటికీ వాటిపైనే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వాహనదారులు రాకపోకలు చేస్తున్నారు. జల్లూరు వద్ద వరాహ నదిపై నిర్మించిన వంతెన, తంగేడు కాటాకు సమీపంలో ఉన్న వంతెన, రామచంద్రపురం జంక్షన్ సమీపంలో ఉన్న వంతెనలు వంద ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. నీలం, హుద్‌హుద్ తుఫాన్‌ల ప్రభావానికి జల్లూరు వంతెన స్తంభం దెబ్బతింది. దీంతో ఒక వైపు ఒరిగిపోయింది. ఈ



రామచంద్రంపురం వంతెన దుస్థితి

వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించడానికి గత ప్రభుత్వం ప్రతిపాదించింది. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత, మంత్రి అయ్యన్నపాత్రుడు కృషి ఫలితంగా జలూరు వంతెనకు రూ.4 కోట్లు మంజూరైంది. టెండర్ ఖరారు విషయంలో తలెత్తిన వివాదం హైకోర్టు వరకు వెళ్లింది. అక్కడ రెండు వర్గాలవారు రాజీ పడ్డారు. వంతెన నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. వంతెనకు ఆనుకుని రూ.38 లక్షలతో నదిలో డైవర్షన్ ఏర్పాటు చేశారు. ఇంకా వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. వందేళ్ల కిందట నిర్మించిన తంగేడు వంతెన నేటికీ ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదు. వంతెనకు ఒక వైపు రక్షణ కమ్ములు విరిగిపోయాయి. దీంతో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇది గమనించిన పోలీసులు జోక్యం చేసుకుని తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.

తంగేడులో కొత్త వంతెన నిర్మించడానికి మూడు కోట్ల రూపాయలతో అధికారులు రూపొందించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు. ఈ వంతెనపై భారీ వాహనాలు నిషేధిస్తూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నిత్యం భారీ వాహనాలు రాకపోకలు చేస్తున్నాయి. ఈ వంతెన ఎప్పుడు కూలిపోతుందోనని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఈ వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని వారు కోరుతున్నారు. రామచంద్రపురం జంక్షన్ సమీపంలో ఉన్న వంతెన శ్లాబ్ బీటలు వారాయి. దీంతో ఈ వంతెన ఎప్పుడు కూలిపోతుందోనని ప్రయాణికులు, వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ సమయంలో అధిక లోడులతో లారీలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. వచ్చే సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే వంతెనకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ ఏఈ సాగర్ వద్ద ప్రస్తావించగా ఇప్పటికే నిధుల కోసం ప్రతిపాదనలు పంపించామని అన్నారు. నిధులు మంజూరు కావాల్సి ఉందన్నారు.



అధ్వానంగా జల్లూరు వంతెన రహదారి

తాగునీరు వృథా



పెద్ద కాలువ వద్ద లీకవుతున్న నీరు

పాయకరావుపేట : మండలంలో నాలుగు గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే పైపు లైన్ లీకవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రాజవరం, గజపతినగరం, వెంకటనగరం, రాజానగరం గ్రామస్థులు అన్నారు. దీనివల్ల తాగునీరు వృథా అవుతుందని, తమ గ్రామాలకు పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీరాంపురం వద్ద ఆర్‌డబ్ల్యూఎస్ బోర్లు ఏర్పాటు చేసి అక్కడి నుంచి రెండు పైపులైన్ ద్వారా తమ గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారన్నారు. శ్రీరాంపురం సమీపాన పెద్దకాలువ గేట్ల వద్ద పైపులైన్ వాల్వ్ వద్ద నీరు లీకవుతుంది. పైపులైన్‌కి మరమ్మతులు చేపట్టి తమ గ్రామాలకు పూర్తిస్థాయిలో నీరు అందించాలని వారు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి చంద్రన్న బీమా రూ.5 లక్షల మంజూరు



మంజూరు పత్రం అందజేస్తున్న జడ్పీటీసీ

నక్కపల్లి : ప్రమాదంలో మరణించిన నక్కపల్లికి చెందిన కె.నాగు కుటుంబానికి చంద్రన్న బీమా కింద రూ.5 లక్షలు మంజూరైంది. ఆయన తల్లిదండ్రుల ఖాతాలో జమ అయిన ప్రతాన్ని కుటుంబ సభ్యులకు జడ్పీటీసీ సభ్యుడు రాగిని వెంకటరమణ సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ టీడీపీ ప్రెసిడెంట్ పెదిరెడ్డి రమేష్, టీడీపీ నాయకులు మీగడ సత్తిబాబు, అల్లాడ సన్యాసిరావు, తాతారావు, కొల్నాటి నానాజీ, అడ్డూరి శ్రీను, కొప్పిశెట్టి వీరబాబు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే పూజించండి... పర్యావరణాన్ని కాపాడండి

రాజయ్యపేటలో పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

నక్కపల్లి : గణపతి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలనే పూజించాలని మండలంలోని రాజయ్యపేట మత్స్యకార గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు కోరారు. సోమవారం హెచ్‌ఎం రాధాకృష్ణ ఆధ్వర్యంలో బాల, బాలికలు తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాలను ప్రదర్శించారు. పర్యావరణం కాపాడటం కోసం మట్టి విగ్రహాలనే పూజించాలన్నారు. కాలుష్యానికి కారణమైన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, మణి, సునీల్, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



మట్టి గణపతి విగ్రహాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఉపమాకలో అమావాస్య పూజలు



నక్కపల్లి : మండలంలోని ఉపమాక శివాలయంలో సోమవారం మహా అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం, సోమవారం, అమావాస్యతో పాటు సూర్య గ్రహణం ఇలా అరుదుగా వస్తాయని, దీనిని చాలా మంది మహా అమావాస్యగా భావించి ప్రత్యేక పూజలు చేశారు. నక్కపల్లి, ఉపమాక, చందనాడ, సీహెచ్‌ఎల్‌పురం, కాగిత, జానకయ్యపేట, రాజయ్యపేట తదితర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఉపమాక శివాలయానికి తరలివచ్చారు. అర్చకులు వెలవలపల్లి మహేష్ శివలింగానికి పంచామృతాభిషేకాలతోపాటు రుద్రాభిషేకం నిర్వహించారు. శివపంచాక్షరీ నామంతో ఆలయం మార్మోగింది.

నేడు కొత్తపోలవరంలో నూకాలమ్మ పండుగ

ఎస్.రాయవరం : మండలంలోని కొత్తపోలవరం గ్రామంలో గ్రామదేవత నూకాలమ్మ పండుగ మంగళవారం జరుగుతుందని సర్పంచ్ నల్లపురాజు వెంకట్రాజు చెప్పారు. ఏటా మఖ కార్తె ప్రారంభం రోజున ఈ పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఉదయం నుంచి మహిళా భక్తులు అమ్మవారిని పూజించి, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన పెంచుకోవాలి

విద్యార్థులకు ఎస్ఐ సత్యనారాయణ పిలుపు



పాయకరావుపేట : లోకల్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)పై విద్యార్థులు అవగాహన పెంచుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పాయకరావుపేట ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పోలీసు విధుల్లో యువత భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కమ్యూనిటీ పోలీస్ ఆఫీసర్స్ అనే అంశాన్ని తీసుకువచ్చిందన్నారు. దీని ద్వారా గ్రామాల్లో నిర్వహించే ఉత్సవాలు, తీర్థాలు, పోలీస్ బీట్ తదితర కార్యక్రమాల్లో యువత పాల్గొనేందుకు అవకాశం కలుగుతుందన్నారు. కమ్యూనిటీ పోలీస్ ఆఫీసర్స్‌గా పనిచేసిన వారికి భవిష్యత్‌లో కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ నియామకాల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. యువత ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ వినియోగించడం వల్ల తమ కుటుంబ సభ్యులు ఇతర ప్రాంతాలకు వెళ్లినపుడు యాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వడం, ఇంటి రక్షణ కోసం కెమెరాతో పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వీర్రాజు, ఎన్ఎస్ఎస్ పీఓలు పి.భాస్కరరావు, జి.తాతయ్యనాయుడు, వాలంటీర్లు, రోటరాక్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ములబందగోడి రైతు సంఘం కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

మునగపాక: మునగపాక రైతు సంఘం అనుబంధంగా ఉండే ములబందగోడి రైతు సంఘం అధ్యక్షుడిగా బొడ్డేడ రామునాయుడు ఎన్నికయ్యారు. దాడి శివ అధ్యక్షతన సోమవారం ఈ ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా టెక్కలి దేవకీరావు, కోశాధికారిగా దాడి గణేష్, డైరెక్టర్లుగా టెక్కలి శ్రీనివాసరావు, బొడ్డేడ రామగణేష్, సూరిశెట్టి రామజోగినాయుడు, దాడి శ్రీనివాసరావు, మళ్ల జగ్గప్పారావు, భీశెట్టి రామునాయుడు ఎన్నికయ్యారు.

కమ్యూనిటీహాల్‌పై ఆక్రమణలను అరికట్టండి


మీ కోసంలో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

మునగపాక: గణపర్తి గ్రామంలో స్టీల్‌ప్లాంట్ సేవా సంఘం వారు కట్టించిన కమ్యూనిటీ హాల్‌పై నిర్మిస్తున్న కట్టడాలను నిలిపివేయించాలని గణపర్తి గ్రామానికి చెందిన చదరం అప్పలనాయుడు, కాండ్రేగుల సీతారాం, కాండ్రేగుల రామగోవింద తదితరులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీ కోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీనిపై వివరాలను స్థానిక విలేకరులకు వారు తెలియజేశారు. కమ్యూనిటీహాల్‌ను సక్రమంగా వినియోగించకుండా సర్పంచ్ అనుచరులు తమ ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే ఈఅక్రమ కట్టడాలను ఆపించాలని జిల్లా పంచాయతీ అధికారి ద్వారా ఆదేశాలు ఇవ్వాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు.

నవరాత్రి ఉత్సవాలకు పందిళ్లు సిద్ధం


పది అడుగుల భారీ వినాయకుడి కోసం ఏర్పాటు చేస్తున్న మండపం

ఎలమంచిలి: వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకోవడానికి వాడవాడలా పందిళ్లు వేస్తున్నారు. భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయడమే కాకుండా మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించడం, ఆకట్టుకునే రీతిలో సెట్టింగ్‌లతో మండపాలను తీర్చిదిద్దు తున్నారు. పట్టణంలో వంద చోట్లకు పైగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు మండపాలను సిద్ధం చేస్తున్నారు.

అనాథ ఆశ్రమానికి బియ్యం వితరణ

ఎలమంచిలి: పట్టణ సమీపంలోని కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలో ఉంటున్న వృద్ధులకు, అనాథల సంక్షేమానికి 50 కిలోల బియ్యం వితరణగా అందజేసినట్టు సామాజిక వేత్త పాల అప్పారావు తెలిపారు. సోమవారం ప్రేమ సమాజం నిర్వాహకులకు ఈ బియ్యం అందజేసినట్టు ఆయన తెలిపారు. ప్రేమ సమాజం నిర్వాహకులు పాల్గొన్నారు.


రాళ్లు తేలి ఉన్న రోడ్డు


గ్రామం మధ్యలో మురుగునీరు


నీరు వృథాగా పోతున్న దృశ్యం

సమస్యల వలయంలో చిన్నివానిపాలెం

- రాళ్లు తేలిన రహదారులతో ఇక్కట్లు
- కుళాయిలకు ట్యాప్‌లేక వృథాగా పోతున్న నీరు
- గ్రామం మధ్యలో మురుగుతో అవస్థలు

మునగపాక: పాటిపల్లి శివారు చిన్నివానిపాలెం గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో వుంది. శివారు గ్రామం కావడంతో చిన్నివానిపాలెం సమస్యలను పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అన్ని గ్రామాల్లోను సిమెంట్ రోడ్లు కళకళలాడుతుంటే ఈ గ్రామానికి మాత్రం సిమెంట్ రోడ్డు ఊసే లేదు. గ్రామంలో రోడ్లు అన్నీ రాళ్లు తేలి నడవడానికి ఇబ్బందికరంగా వున్నాయి. కొండ ప్రాంతం కావడంతో సక్రమంగా లేక ఈ గ్రామంలో నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. రాత్రి పూట గ్రామంలో వీధి లైట్లు కూడా వెలగకపోవడంతో రాళ్లు తేలి ఉన్న రోడ్డుపై పైగ్రామానికి వెళ్లిన గ్రామస్థులు తిరిగి ఇంటికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు.

మంచినీటి కుళాయిలున్నప్పటికీ ట్యాప్‌లకు బిరడాలు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో గ్రామం మధ్యలోనే బురదనీరు ఉండిపోయి దోమలు పెరిగి గ్రామస్థులు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలో సమస్యలు పరిష్కరించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ, గ్రంథాలయ భవనాలు



అంగన్‌వాడీ కేంద్రం


శిథిలావస్థలో తుఫాన్ షెల్టర్‌లో శాఖా గ్రంథాలయం

మునగపాక : గణపర్తి గ్రామంలో అంగన్‌వాడీ, శాఖా గ్రంథాలయం భవనాలను శిథిలావస్థలో ఉన్న తుపాను షెల్టర్‌లో నిర్వహిస్తున్నారు. ఈ గ్రామం లోతట్టు ప్రాం తంగా ఉండడంతో ఎక్కువగా శారదా నది వరద తాకిడికి గురవుతోంది. ఈ మేరకు 15 ఏళ్ల క్రితం ఇక్కడ తుపాను షెల్టర్ నిర్మించారు. ప్రస్తుతం ఇది పూర్తిగా శిథిలా వస్థకు చేరుకుంది. షెల్టర్ గోడలు పెచ్చులూడి శ్లాబ్ ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. సొంత భవనాలు లేకపోవడంతో ఈ శిథిల షెల్టర్‌లోనే అంగన్‌వాడీ కేంద్రం, శాఖా గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలు, బాలింతలు వస్తుంటారు. అలాగే శాఖా గ్రంథాలయానికి రోజుకి పదుల సంఖ్యలో పాఠకులు వస్తుంటారు. దీంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. తక్షణమే పాలకులు, అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రానికి, గ్రంథాలయానికి నూతన భవనాలు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎలమంచిలిలో ఎండ తీవ్రత


సాయంత్రం ప్రధాన రహదారిలో తగ్గిన జనసంచారం

ఎలమంచిలి: శ్రావణంలోనూ వేసవి తీవ్రత పెరుగుతుండడంతో జనం ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం ఎలమంచిలి పట్టణంలో ఎండ తీవ్రత 33 డిగ్రీల వరకూ ఉంది. వేసవిని తలపించేలా ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు జ్యూస్ పాయింట్లు, ఐస్‌క్రీమ్‌ల దుకాణాల వైపు దృష్టిసారించారు. ఇటీవల చల్లని వాతావరణం ఉండడంతో ఉపశమనం పొందిన సోమవారం నాటి ఎండతీవ్రతకు అల్లాడిపోవాల్సి వచ్చింది.

ఆరో రోజుకు చేరిన తపాలా ఉద్యోగుల సమ్మె

ఎలమంచిలి: తమ సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి ఆరో రోజుకు చేరింది. సోమవారం వీరంతా కలిసి ఎలమంచిలి తపాలా కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. అనంతరం వీరంతా అనకాపల్లిలో జరిగే కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈకార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

రేడియో పాఠాలపై విద్యార్థుల ఆసక్తి

ఎలమంచిలి: రేడియో పాఠాలపై విద్యార్థులు ఆసక్తిని కనపరుస్తున్నారని మర్రిబంద స్కూల్ హెచ్‌ఎమ్. వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం నుంచి విద్యార్థులకు రేడియో పాఠాలు బోధిస్తున్నట్టు ఆయన తెలిపారు. నాలుగో తరగతిలో ఉన్న వినాయక చవితి పాఠ్యాంశం ద్వారా రేడియో పాఠాలు ప్రారంభించినటుట ఆయన తెలిపారు.



రేడియో పాఠాలు వినిపిస్తున్న వినోద్ కుమార్

కళాశాల వేళల్లో బస్ సౌకర్యం కల్పించండి

అచ్యుతాపురం రూరల్: కళాశాల వేళల్లో బస్ సౌకర్యం కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నర్సయ్య డిమాండు చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో గల మారుమూల గ్రామాల నుంచి అచ్యుతాపురానికి బస్సులపై వస్తున్నారని తెలిపారు. సమయానికి బస్‌లు రాకపోవడం వల్ల ఇదే జంక్షన్‌లో సుమారు రెండు గంటల సేపు వేచి ఉండాల్సిన పరిస్థితి విద్యార్థులకు నెలకొందన్నారు. ఆయా కాలేజీలు, పాఠశాలలు నాలుగు గంటల సమయంలో విడిచి పెడుతుండగా రాంబిల్లి, పూడిమడక, తంతడి వైపు వెళ్లే బస్సులు ఆరు గంటల తర్వాతనే వస్తున్నాయని అన్నారు.

పాఠశాల సమయాల్లో బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్‌టీసీ యాజమాన్యానికి, స్థానిక అధికారులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా ఫలితం శూన్యమని ఆవేదన చెందారు. అధికారులు స్పందించి విద్యార్థులకు సమయానికి బస్ సౌకర్యం అందించాలని ఆయన డిమాండు చేశారు.



అనకాపల్లిలో తయారవుతున్న మట్టి విగ్రహాలు

- చవితి వేడుకలకు పట్టణం, పల్లెలు సిద్ధం
- ఏ వీధిలో చూసినా సందడి ఆరంభం
- విగ్రహాలను మార్కెట్లకు పంపేందుకు సన్నాహాలు
- నవరాత్రుల నిర్వహణకు అన్ని శాఖలు ప్రణాళికలు



ఎటు చూసినా సందడే

ఏ శుభకార్యం తలంచినా.. ఏ పనికి శ్రీకారం చుట్టాలన్నా.. తొలుత ఆది దేవుడ్ని స్మరిస్తే ఆ పని నిర్విఘ్నంగా జరుగుతుందని భక్తుల నమ్మిక. ఇంతటి శక్తిమంతుడు, విద్యలకు అధిపతి అయిన వినాయకుని పండగ మరో మూడు రోజుల్లో వచ్చేస్తోంది. విగ్రహాలకు తుది మెరుగులు దిద్దేపనిలో కళాకారులు నిమగ్నమయ్యారు. గణపతిని ప్రతిష్ఠించేందుకు పిల్లలు, పెద్దలు.. ఏర్పాట్లు చేయడంలో తెగ బిజీగా ఉన్నారు.

గణపయ్యకు మెరుగులు

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని పూడిమడక రోడ్డు, రింగ్ రోడ్డు, గవరపాలెంలోని వేగి గౌరీసు వీధి, దిబ్బవీధి, సంతబయలు తదితర ప్రాంతాల్లో కళాకారులు నెల రోజులుగా వినాయక విగ్రహాలు చేస్తున్నారు. రేయింబవళ్ళు రూపొందించిన వీటిని బుధ, గురువారాల్లో పట్టణం నడిబొడ్డున విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక అడుగు నుంచి 20 అడుగుల విగ్రహాల వరకు ఇక్కడ సిద్ధమవుతున్నాయి.

విక్రయాలకు పూజా సామగ్రి సిద్ధం

గ్రామీణ జిల్లాకు అనకాపల్లి ప్రధాన కేంద్రం కావడంతో చవితి వేడుకలు నిర్వహించే ప్రతి ఒక్కరూ పూజకు అవసరమైన ప్రతిమలతో పాటు సామగ్రి కొనుగోలుకు ఇక్కడికి రావడం ఆనవాయితీ. దీంతో వ్యాపారులు సంబంధిత సామగ్రిని సమకూర్చుకునే పనిలో ఉన్నారు.



వివిధ రూపాల్లో బొజ్జగణపయ్య

ఈ ఏడాది వివిధ రూపాల్లో బొజ్జగణపయ్య విగ్రహాలను కళాకారులు తయారు చేస్తున్నారు. నిర్వాహకులు వారికి ఇచ్చే ఆర్డరు మేరకు సిద్ధమవుతున్నాయి. ప్రధానంగా ఇందులో ఇటీవల విడుదలై సంచలనం సృష్టించిన బాహుబలి-2 చిత్రంలో ఒక సన్నివేశం దృశ్యాన్ని కళాకారులు వినాయకుని రూపంలో అద్భుతంగా మలుచుతుండడం విశేషం.

జింక మట్టితో తయారు



- ఆరిపాక కృష్ణ, కళాకారుడు

విగ్రహాలను జింకమట్టి, క్లాత్‌తో కలిపి ఎటువంటి రసాయనాలు వాడకుండా తయారు చేస్తున్నాం. నిమజ్జనం రోజున నీటిలో తక్కువ సమయంలో కరిగిపోతాయి. మూడు నెలలుగా విగ్రహాల తయారీపై దృష్టి సారించాం. బొమ్మ పొడవు బట్టి తయారు చేయడానికి మూడు నుంచి ఐదు రోజులు సమయం పట్టింది.

నిమజ్జనానికి పక్కాగా ఏర్పాట్లు



- ఆడారి కుమారస్వామి, వినాయక నిమజ్జనోత్సవ కమిటీ అధ్యక్షుడు

శారదా నదిలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి పక్కాగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. చవితి రోజు నుంచి 11 రోజుల పాటు శారదానది ప్రాంతంలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేస్తున్నాం. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ ఏడాది 20వేల మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. క్రేన్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుంది.

అనుమతులు తప్పనిసరి



- కేవీ రమణ, డీఎస్పీ, అనకాపల్లి

వినాయక నవరాత్రి వేడుకలు నిర్వహించే వారు పోలీసుశాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. మైక్‌సెట్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు చలానా కట్టి అనుమతి పొందాలి. పోలీసులు సూచించిన చోటనే వినాయక నిమజ్జనాలు చేయాలి. బాణసంచా వెలిగించరాదు. సాంస్కృతిక కార్యక్రమాలలో అశ్లీలతకు ఆస్కారం ఇవ్వరాదు. చవితి వేడుకలపై పలు శాఖల నిర్వాహకులతో సమావేశం నిర్వహించనున్నాం.



మట్టి విగ్రహాల తయారీకి ప్రాధాన్యం



పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని ప్రసార సాధనాలు, పలు స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా ప్రచారం చేయడంతో కళాకారులు కూడా మట్టితోనే విగ్రహాలు తయారీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. నవరాత్రి వేడుకలు జరిపే నిర్వాహకులు ఇప్పటికే తమకు ఏ రీతిలో విగ్రహాలు కావాలో కళాకారులకు వివరించి ఆ విధంగా తయారు చేయించుకుంటున్నారు. అనకాపల్లికి చెందిన విల్లూరి పరమేశ్వరరావు అనే కళాకారుడు ఈ ఏడాది విశాఖ డెయిరీ వద్ద 30 అడుగుల విగ్రహాన్ని రూపొందిస్తున్నారు.

ఆధార్ అప్‌డేషన్ కౌంటర్ ప్రారంభం



అప్‌డేషన్ రశీదును అందిస్తున్న నాయుడు

అనకాపల్లి : ఇక్కడి ప్రధాన తపాలా కార్యాలయంలో ఆధార్ అప్‌డేషన్ కౌంటర్‌ను అనకాపల్లి పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ కె.ఎల్.నాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కౌంటర్‌లో ఆధార్ కార్డులలో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని, తగిన చిరునామా పత్రాలను తప్పకుండా తీసుకురావాలని సూచించారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ విల్లూరి సత్యనారాయణ, పోస్టుమాస్టర్ టి.అమ్మిరాజు, కె.లైకోన్, గట్టి బ్రహ్మాజీ, జె.రామరాజు, ఇ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిసినికాడలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



కొత్తూరు : పిసినికాడలో సోమవారం స్పందించే హృదయం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో సర్పంచ్ దాడి కమలాదేవి చేతులమీదుగా సుమారు వందమందికి వీటిని అందజేశారు. ఉపాధ్యాయులు ఏవీఎన్ మూర్తి, డి.నూకేష్, ఎం.వై.రాము, స్థానిక నాయకులు దాడి కుమార్, మళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో అమావాస్య పూజలు



అమ్మవారికి నైవేద్యాన్ని ఊరేగింపుగా తీసుకు వెళ్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్ : నూకాంబిక ఆలయంలో సోమవారం అమ్మవారికి అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా అమావాస్య రోజున పెద్ద ఎత్తున ఇక్కడ పూజలు జరుపుతుంటారు. ఈ సందర్భంగా తయారుచేసిన నైవేద్యాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సుజాత, మళ్ల సురేంద్ర, అమావాస్య యూత్ నిర్వాహకులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.